డిసెంబర్
2019

164

సంపుటి : 14 సంచిక : 8

వెల రు. 10 /-

ఈ సంచికలో........

కమ్యూనిస్టు భావాల వ్యాప్తిలో ఎంఎన్ రాయ్ కృషి

భారతీయ లౌకిక, ప్రజాస్వామ్య పునాదుల విధ్వంసం

బద్దలైన అభివృద్ధి బుడగ

తొలినాటి మహానగరాలు

బ్రిటిష్ వారికి లొంగిపోయిన సావర్కర్

జెఎన్‌యు ప్రజాస్వామ్య సంస్కృతిపై దాడి

అయోధ్య తీర్పు - విశ్వాసానిదే గెలుపు

బ్రస్సెల్స్‌లో కారల్‌మార్క్స్

# కమ్యూనిస్టు భావాల వ్యాప్తిలో ఎంఎన్ రాయ్ కృషి



ఎం.ఎన్.రాయ్

ఎంఎన్‌రాయ్‌గా పిలవబడే మానవేంద్రనాథ్ రాయ్, తొలితరం కమ్యూనిస్టు నాయకులలో ప్రముఖుడు. 1920 అక్టోబర్‌లో రాయ్ తాష్కెంట్‌లో కమ్యూనిస్టు పార్టీని ప్రారంభించారు. 1921 తరువాత భారతదేశంలో ప్రారంభమైన వివిధ కమ్యూనిస్టు గ్రూపులను ఒక చోటికి చేర్చి కమ్యూనిస్టు భావాలకు ఒక రూపాన్ని ఇచ్చిన ఘనత ఎంఎన్‌రాయ్‌దే. ప్రజలలో మార్క్సిస్టు భావాలను వ్యాప్తిచేయడానికి తీవ్రంగా కృషి చేసిన తొలి నాయకుడు ఆయనే .

ఎంఎన్‌రాయ్ జీవితం ఎంతో ఆసక్తిదాయకంగా ఉంటుంది. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో ప్రముఖమైన వ్యక్తిగా గుర్తింపు పొందక ముందు, అయన జీవితం అనేక సాహసోపేత కార్యక్రమాల సమాహారం.

బెంగాల్‌లోని 24 పరాగణాల జిల్లాలో ఆరబెల్ల అనే కుగ్రామంలో రాయ్ జన్మించారు. ఒక యువకుడుగా, తన చిన్నతనంలోనే బ్రిటిషు వారికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలలో ఒక విప్లవ గ్రూపు తరపున పాల్గన్నారు. హౌరా కుట్ర కేసులో అరెస్ట్ చేయబడి 1911 లో విడుదల అయ్యారు. ఆ తరువాత జతీంద్రనాథ్ ముఖర్జీ నాయకత్వంలోని యుగాంతర్ అనే గ్రూపులో సభ్యుడయ్యారు. జతిన్ గ్రూప్ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేయడానికి జర్మన్ల సహాయం తీసుకోవాలని నిర్ణయించింది. ఆయుధాలు పొందడం కోసం ఇండోనేషియాలోని జర్మన్ కౌన్సిలర్‌ని కలవడానికి 1915 ఏప్రిల్‌లో రాయ్‌ని పంపారు. అప్పుడు దానిని నెదర్లాండ్ ఇండీస్ అని పిలిచేవారు. కలకత్తాకు ఆయుధాలు పంపాలన్న రాయ్ ప్రయత్నం విఫలమయింది. బ్రిటీషువారు కుట్రను ముందే పసిగట్టి జతీంద్రనాథ్‌ని ఎన్‌కౌంటర్ చేసి చంపారు.

ఈ సంఘటనల తరువాత తిరిగి భారతదేశానికి రాకూడదనుకున్న రాయ్ జావా వెళ్ళాడు. మొదట షాంఘై గుండా జపాన్ వెళ్లారు. ఆ తర్వాత అక్కడి నుండి అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో చేరుకున్నారు. గదర్ పార్టీతో సంబంధాలు పెట్టుకున్నారు. ఆ తరువాత న్యూయార్క్ వెళ్లి అక్కడి భారతదేశ విప్లవకారులతో సంబంధాలు పెట్టుకున్నారు. న్యూయార్క్ గ్రంథాలయంలోనే మొదటిసారిగా రాయ్ మార్క్సు రచనలు చదివారు. ఎవ్లీన్ ట్రెంట్ అనే ఓ అమెరికన్ డిగ్రీ విద్యార్థిని విప్లవ భావాలు కూడా రాయ్‌ని ప్రభావితం చేశాయి. కొన్ని రోజుల తరువాత ఆమెని స్టాన్‌ఫోర్డ్‌లో కలిశారు. ఆమెనే ఆ తరువాత వివాహం చేసుకున్నారు.

చట్టవిరుద్ధంగా అమెరికాలో ప్రవేశించినందుకు రాయ్ అరెస్ట్ చేయబడే పరిస్థితి వచ్చినందువలన తన భార్యతోసహా అమెరికా నుండి మెక్సికో వెళ్లిపోయారు. అప్పటివరకు రాయ్ నిధులు సమకూర్చుకుని భారతదేశంలో సాయుధ విప్లవం ఎలా తేవాలా అని ఆలోచించేవారు. మెక్సికోలో ఆయన మెక్సికన్ సోషలిస్టు పార్టీతో సంబంధాలు ఏర్పరచుకున్నారు. అప్పుడది అతి చిన్న గ్రూప్. అప్పుడే ఆయనకి మైఖేల్ బోరోడిన్‌తో పరిచయమైంది. బోరోడిన్ ఇంటర్నేషనల్‌లో ప్రముఖుడు. రాయ్ కి మార్క్సిజాన్ని పరిచయం చేసింది బోరోడినే. రాయ్ పాఠశాలలో చదివింది తక్కువ. స్వయంగా చదువుకొని, అపారమైన విజ్ఞానాన్ని సంపాదించాడు. కొన్ని నెలలలోనే స్పానిష్ లో ప్రావీణ్యత సంపాదించి, కరపత్రాలు రాయడం మొదలు పెట్టారు. వేదికలమీద ఉపన్యాసాలు కూడా చెప్పేవారు. త్వరలోనే మెక్సికన్ సోషలిస్టు పార్టీ నాయకుడయ్యారు. ఆ పార్టీని 1919లో మెక్సికన్ కమ్యూనిస్టు పార్టీగా మార్చేశాడు. మెక్సికన్ కమ్యూనిస్టు పార్టి ప్రతినిధిగానే రాయ్, 1920 జూలై–ఆగస్టు నెలలలో జరిగిన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ రెండో మహాసభలకు హాజరయ్యారు.

అప్పటివరకు కమ్యూనిజానికి కొత్త అయిన రాయ్ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ రెండో మహాసభలో జాతీయవాదం, వలసవాదం సమస్యపై ప్రత్యామ్నాయ పత్రాన్ని ప్రవేశ పెట్టి గుర్తింపు పొందారు. జాతీయత వలసవాదంపై లెనిన్ ఒక పత్రాన్ని ప్రవేశ పెట్టి దాని ప్రతిని సభ్యులందరికి పంచారు. లెనిన్ పత్రం రాయ్ పత్రం రెండిటిని జాతీయవాద, వలస విధానం కమిషన్ చర్చించింది. తన అనుబంధ సిద్ధాంతంలో రాయ్ భారతదేశ బూర్జువా వర్గం సమర్ధవంతంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదంతో పోరాడేంత శక్తివంతమైనది కాదని, రాజీపడే స్వభావం కలదని వాదించాడు. కమ్యూనిస్టులు జాతీయోద్యమానికి మద్దతునివ్వాలన్న ఐక్య వేదికల విధానం భారతదేశ పరిస్థితులకు అనుకూలించదని అభిప్రాయపడ్డారు. మహాసభ దీనిని తిరస్కరించింది. రాయ్ ప్రవేశపెట్టిన పత్రానికి అనేక సవరణలను సూచించింది. కొన్ని మార్పులతో లెనిన్ థీసిస్‌ను మహాసభ ఆమోదించింది.

కొమింటర్న్ మహాసభ రాయ్‌నికమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కార్యనిర్వాహక కమిటీ సభ్యునిగా తీసుకుంది. ఆ తరువాతి కాలంలో కేంద్ర ఆసియా బ్యూరోకి అధిపతిగా నియమించబడ్డారు. ఆ అధికార హోదాతోనే అయన తాష్కెంట్ వెళ్లారు. అక్కడ అయనకు భారతదేశం నుంచి వచ్చిన అనేకమంది ముహజిర్లతో పరిచయాలు ఏర్పడ్డాయి. భారతదేశంలో బ్రిటీష్ పాలన అంతం అవ్వాలంటే వారందరు కమ్యూనిస్టు పార్టీలో చేరాలని రాయ్ వారికి నచ్చచెప్పారు. ఆ క్రమంలోనే 1920 అక్టోబర్ 17 న మొదటి భారతదేశ కమ్యూనిస్టు గ్రూపుని స్థాపించారు.

రాయ్ మాస్కో చేరిన తరువాత కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌లో చర్చించి భారతదేశంలోని కమ్యూనిస్టు గ్రూపులన్నీ రాయ్

(మిగతా 33వ పేజీలో)

## ఈ సంచికలో...


1. కమ్యూనిస్టు భావాల వ్యాప్తిలో ఎంఎన్ రాయ్ కృషి ...................................... 2

2. భారతీయ లౌకిక, ప్రజాస్వామ్య పునాదుల విధ్వంసం

బివి రాఘవులు ............. 4

3. బద్దలైన అభివృద్ధి బుడగ

సిపి చంద్రశేఖర్ ............. 8

4. తొలినాటి మహానగరాలు

ఎం.వి.ఎస్. శర్మ ....... 13

5. బ్రిటిష్ వారికి లొంగిపోయిన సావర్కర్

ఎ. కోటిరెడ్డి ............ 16

6. జెఎన్‌యు ప్రజాస్వామ్య సంస్కృతిపై దాడి

జె జగదీష్ ................ 23

7. అయోధ్య తీర్పు విశ్వాసానిదే గెలుపు

టికె రాజలక్ష్మి ............. 28

8. బ్రస్సెల్స్‌లో కారల్‌మార్క్స్

టికె రాజలక్ష్మి ............. 31



సంపాదకుడు:

**ఎస్. వెంకట్రావు**

సంపాదక వర్గం:

**పాటూరు రామయ్య**

**బి.వి. రాఘవులు**

**తమ్మినేని వీరభద్రం**

**ఎస్. వీరయ్య**

**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్: కె.హరికిషోర్:9490098977, 9494101091**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# అత్యాచారాలు

మహిళ అర్ధరాత్రి కూడా సురక్షితంగా ఇంటికి వచ్చినప్పుడే భారత దేశానికి నిజమైన స్వాతంత్రం వచ్చినట్లు భావించాలని మహాత్మా గాంధీ చెప్పి దశాబ్దాలు గడిచిపోయాయి. కానీ దేశంలో మహిళల భద్రత రోజురోజుకూ దిగజారిపోతోంది. ప్రపంచంలో మహిళలకు భద్రత లేని దేశాల జాబితాలో భారత దేశం అగ్రస్థానం ఆక్రమిస్తోంది. 2011లో భారతీయ మహిళలపై 23,646 అత్యాచారాలు జరిగితే 2015 ఏడాదికి ఆ సంఖ్య 34,771కి 2016వ సంవత్సరానికి 39,068కి పెరిగిపోయింది. 'అత్యాచారాల రాజధాని'గా పేరుగాంచిన ఢిల్లీలో 2016 ఏడాదిలోనే 2,170 అత్యాచారాలు జరిగాయి. ఇవన్నీ కూడా పోలీసుల వద్ద రికార్డు అయిన కేసులు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 99 శాతం అత్యాచార ఘటనలు పోలీసు ఫిర్యాదుల వరకు పోవడం లేదు, కాబట్టి రికార్డు కావడం లేదు.

2012లో ఢిల్లీలో నిర్భయ ఉదంతం, 2018లో జమ్మూ-కాశ్మీర్‌లోని కతువాలో 8 ఏళ్ల అసీఫాపై అత్యాచార ఉదంతం, కొద్ది రోజుల క్రింతం హైదరాబాద్‌లో దిశ (పేరు మార్చబడింది) ఉందంతం దేశం మొత్తాన్ని కలచివేశాయి, ప్రజలను పెద్ద ఎత్తున కదిలించాయి. పెద్ద ఘటన జరిగిన ప్రతిసారీ ప్రభుత్వాలు దోషులను కఠినంగా అణచి వేయాలంటూ కొత్త చట్టాలు తెస్తున్నాయి. కానీ అత్యాచారాలు తగ్గడం లేదు సరికదా పెరుగుతున్నాయి.

మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హింసాకాండకు వ్యతిరేకంగా చట్టాలు ఉండాల్సిందే, వాటిని నివారించే యంత్రాంగాన్నీ పటిష్టం చేయాల్సిందే. కానీ సామాజిక వ్యవస్థలో మౌలికమైన మార్పు రాకుండా, మార్పుతేకుండా ఈ చట్టాలు, శిక్షలు నేరాలను అరికట్టలేవన్నది చరిత్ర చెబుతున్న వాస్తవం. మహిళలను పురుషుల స్వంత ఆస్తిగా పరిగణించబడే ఫ్యూడల్ సమాజం మీద పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మించబడుతున్న దేశం మనది. అందువల్ల ఫ్యూడల్ సమాజంలోని పితృస్వామిక అవలక్షణాలన్నీ గ్రామాల్లోనే కాదు, పట్టణాలు, మహానగరాల్లో కూడా పనిచేస్తున్నాయి. మహిళలు పురోగమించడానికి ఎంతగా ప్రయత్నిస్తున్నా పితృస్వామిక సమాజపు భావజాలం వారిని అడుగడుగునా అడ్డుపడుతూనే ఉంది. మహిళలను కేవలం భోగవస్తువుగా, ఇంటి చాకిరీ చేసే నౌకర్లుగా చూసే ఆలోచనా ధోరణితో ఉన్న వారు ధైర్యం చేసి అన్ని రంగాల్లో మహిళలు ముందడగు వేయడం సహించలేక వారిపై హింసాకాండకూ, అత్యాచారాలకూ పాల్పడుతున్నారు. దీనికి తోడు నయా-ఉదారవాద ప్రపంచీకరణ విధానాలు మహిళలను ఒక మార్కెట్ వస్తువుగా పరిగణించడం కూడా ఈ అత్యాచారాలు పెరగడానికి కారణమవుతున్నాయి.

పైగా మనువాదాన్ని నమ్ముతున్న, ఆచరణలో అనుసరిస్తున్న ఆర్ఎస్ఎస్-బిజెపి పాలన కేంద్రంలోనూ, అనేక రాష్ట్రాల్లోనూ నడుస్తోంది. మనువాదం మహిళలకు స్వేచ్ఛ ఉండకూడదని, వారు మగవాని కింద బానిసలుగా ఉండాలని శాసిస్తుంది. స్వేచ్ఛను కోరుకునే మహిళలను 'అదుపులో పెట్టే' మార్గం వారిపై హింసకు పాల్పడ్డం. అందువల్లనే బిజెపి-ఆర్ఎస్ఎస్ మితవాద భావజాలపు పట్టు సమాజంపై పెరిగినాక మహిళలపై హింసాకాండ, అత్యాచారాలు పెరుగుతూ వస్తున్నాయి. ఈ అత్యాచారాలను బిజెపి నాయకులు సమర్థిస్తూ మాట్లాడుతున్నారు. మహిళల వేషభాషలు, నడవడి వల్ల వారిపై అత్యాచారాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ సంస్థ సర్వే ప్రకారం మహిళలపై హింసాకాండకు పాల్పడిన పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు బిజెపిలో అత్యధికంగా ఉన్నారు. కేంద్ర రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన పార్టీలు 327 మందికి టిక్కెట్లు ఇస్తే అందులో అత్యధిక శాతం బిజెపి ఇచ్చింది.

అందువల్ల భారతీయ సమాజంలో స్త్రీలపైనా, బాలికలపైనా హింస, అత్యాచారాలు ఆగాలంటే కఠినమైన చట్టాలతో బాటు సామాజిక వ్యవస్థలో మార్పు రావాలి. ఫ్యూడల్ సమాజపు మూలాలు తెగ్గొట్టాలి. దాని సంస్కృతిని నాశనం చేయాలి. నయా-ఉదారవాదం పెంచిపోషిస్తున్న వినిమయ సంస్కృతిపై యుద్ధం జరగాలి.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా: **రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**

**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

ఇంటర్వ్యూ

# భారతీయ లౌకిక, ప్రజాస్వామ్య పునాదుల విధ్వంసం



బివి రాఘవులు

దేశంలో ప్రస్తుతం సంభవిస్తున్న ఆర్థిక,రాజకీయ పరిణామాలపై సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి వి రాఘవులు గారిని మార్క్సిస్టు మాసపత్రిక ఇంటర్వ్యూ చేసింది. మార్క్సిస్టు ప్రశ్నలు, రాఘవులు గారు ఇచ్చిన సమాధానాలను పాఠకులకు అందిస్తున్నాం......సంపాదకుడు

**దేశంలో నెలకొన్న ఆర్థికమాంద్యాన్ని పరిష్కరించటానికంటూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలితాలివ్వటం లేదు. మాంద్యానికి అసలు కారణాలు ఏమిటి? ఏ విధంగా పరిష్కరించాలి?**

దేశం తీవ్ర ఆర్థిక మాంద్యంలో చిక్కుకున్న విషయాన్ని ఇప్పుడు అందరూ అంగీకరిస్తున్నారు. అయితే ప్రభుత్వ ప్రతినిధులు, కొందరు ఆర్థిక శాస్త్రవేత్తలు ఈ మాంద్యం తాత్కాలికమైనదని, అప్పుడప్పుడూ వస్తూపోతూ వుండేదని (సైక్లికల్) ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న మాంద్యం తాత్కాలికమైనది కాదు. దీర్ఘకాలం కొనసాగేది, వ్యవస్థీకృతమైనది (స్ట్రక్చరల్). అంటే సరళీకరణ విధానాల మూలంగా ప్రజల ఆదాయాలను కుదించి కార్పొరేటు లాభాలను పెంచే సంస్కరణలు అమలుజేసినందున వచ్చిన మాంద్యం. దీని వలన ప్రజల కొనుగోలు శక్తి తీవ్రంగా పడిపోయింది. ఫలితంగా ఉత్పత్తులకు, సేవలకు గిరాకీ పడిపోయి ఆర్థిక కార్యకలాపాలు, అంటే పారిశ్రామిక ఉత్పత్తి, వ్యాపారం తగ్గిపోయాయి. పర్యవసానంగా నిరుద్యోగం పెరిగింది. లక్షలాది మంది ఉపాధి కోల్పోయారు. వాహనాల దగ్గర నుండి బిస్కెట్ల వరకు అమ్మకాలు పడిపోయాయి. ఈ పరిస్థితి ఒక విష వలయంగా మారిపోయింది. దీనికితోడు ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లోనూ మాంద్యం పొడ చూపడం, వ్యాపార పోటీ తీవ్రం కావడం వలన మన ఎగుమతులు కూడా దెబ్బతిన్నాయి. అందుకే సి.పి.ఐ(ఎం) ప్రస్తుతం మనదేశం ఎదుర్కొంటున్న మాంద్యం దీర్ఘకాలిక స్వభావం కలిగినదని చెబుతున్నది. గతంలో 7–8 శాతం మధ్యనున్న స్థూలజాతీయోత్పత్తి ఇప్పుడు 6 శాతంలోపుకు పడిపోనున్నదని వస్తూత్పత్తి, సేవలు, వ్యవసాయం అన్నిరంగాలు కుదించుకుపోతున్నాయని అందరూ చెబుతున్నారు. ప్రధానమంత్రి మోడి, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తీవ్రతను అంగీకరిస్తూనే తామూ తీసుకునే నివారణా చర్యలు పరిస్థితిని శీఘ్రంగా సరిదిద్దుతాయని బింకాలుపోతున్నారు.

మాంద్యాన్ని అధిగమించేందుకని ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కొండనాలుక్కి మందు వేస్తే ఉన్ననాలుక పోయినట్టు వున్నాయి. జబ్బు ఒకటి అయితే మందొకటి వేసినట్లున్నాయి. కార్పొరేటు సంస్థలకు, ధనవంతులకు రూ. 1,45,000 కోట్లమేర కార్పొరేట్ పన్నులో రాయితి ఇచ్చింది. అంటే (35 శాతం నుండి ఏకంగా 25 శాతానికి పన్ను తగ్గించింది. ఆర్.బి.ఐ నుండి తీసుకున్న రూ. 1,65,000 కోట్ల ప్రజల సొమ్ములో అత్యధిక భాగం పెట్టుబడిదార్లకు కట్టబెట్టింది. అంతకు ముందు రూ. 70,000 కోట్లు ఎగుమతి వ్యాపారులకు, నిర్మాణ రంగానికి రాయితీలు ఇచ్చింది.

ఈ రోజు దేశంలో వ్యాపించిన సంక్షోభం పెట్టుబడిదార్ల వద్ద డబ్బు లేకో, వారి లాభాలు దెబ్బతినడం వల్లో వచ్చింది కాదు. అలా అయితే వారికి పన్నులు తగ్గించి డబ్బు సమకూర్చితే మాంద్యం పరిష్కారం కావచ్చు. ఈ రోజు సంక్షోభానికి ప్రజల వద్ద, అంటే కొనుగోలు దార్ల వద్ద డబ్బు, అదాయం లేకపోవడం కారణం. అదాయం కావాల్సింది, డబ్బు ఇవ్వాల్సింది కొనుగోలుదార్లైన ప్రజానీకానికి. ఈ పని చేయకుండా బి.జె.పి ప్రభుత్వం మాంద్యాన్ని కూడా పెట్టుబడిదార్లకు సంపాదించుకునే సందర్భంగా మార్చి వేసింది. ప్రజల కొనుగోలు శక్తి పెరగాలంటే వారికి భారీగా ఉపాధి కల్పించాలి. మౌలిక సదుపాయాల కల్పన కోసం (రోడ్లు ప్రాజెక్టులు, స్కూళ్ళు, ఆస్పత్రి భవనాలు, పరికరాలు వగైరా) ప్రభుత్వం ఖర్చుజేయాలి.

కార్మికులకు నెలకు 20,000 కనీస వేతనంగా ప్రకటించి అమలుచేయాలి. బలహీనవర్గాలకు ఉపాధి పనులు అమలుజేసి అదాయం కల్పించాలి. కేంద్ర ప్రభుత్వమే రైతులకు రుణమాఫీ చేయాలి. ఈ చర్యలు ఇంకా ఇటువంటి చర్యలు ప్రభుత్వం చేపడితే ప్రజల చేతుల్లోకి అదాయం వస్తుంది. వారు సరుకులు, సేవలు కొనుగోలు చేస్తారు. ఆ రకంగా ఆర్థికవ్యవస్థలో గిరాకీ పెరుగుతుంది. మాంద్యం మాయమవుతుంది.

ఈ విషయాలన్నీ ప్రభుత్వాధినేతలకు తెలియనివి కాదు. వారు బడాపెట్టుబడిదారులు, విదేశీ కార్పొరేటు పెట్టుబడి యజమానులు ఎం చెపితే అది చేసేవారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా వారికి కావలసింది ప్రజాసంక్షేమం కాదు. స్వేచ్ఛా మార్కెట్లు పెట్టుబడిదారీ వ్యవస్థ సంరక్షణ. అందుకని ప్రజా సంక్షేమం ద్వారా మాంద్యాన్ని పరిష్కారం చేయడం కాకుండా. ప్రజల మీద భారాలను మోపి సంక్షోభాన్ని అధిగమించాలనుకుంటున్నారు. అందుకే మరిన్ని హానికరమైన సంస్కరణలను ప్రవేశపెడుతున్నారు. ప్రభుత్వరంగ సంస్థలను అమ్మకం, బ్యాంకులను విలీనం చెయ్యడం, కార్మికచట్టాలను సవరించడం ఇంకా ఇటువంటి అనేక హానికర చర్యలు చేబడుతున్నారు. ప్రజల ప్రయోజనాలను కాపాడే పద్ధతిలో మాంద్యాన్ని అధిగమించే విధానాలు అమలు కావాలంటే ప్రజలు ఐక్యమై పోరాడటం తప్ప మార్గం లేదు. 2020 జనవరి 8వ తారీకున దేశ కార్మికవర్గం సమ్మెకు పిలుపిచ్చింది. ఇది అటువంటి దీర్ఘ కాలిక పోరాటానికి నాంది కావాలి.

**ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మనదేశ ర్యాంకు పెరుగుతున్నది. ఇది తమ విజయమని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నది. మరోవైపు ఆర్థిక పరిస్థితి దిగజారుతున్నది. ఈ రెండు అంశాలను ఏ విధంగా అర్ధం చేసుకోవాలి?**

సులువుగా వ్యాపారం జేసుకోగల వాతావరణం(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వివిధ దేశాలలో ఎలా వుందనేదానిపై వేసిన అంచనాలను ప్రపంచ బ్యాంకు, ఐ.ఎం.ఎఫ్, ఇంకా కొన్ని రేటింగ్ సంస్థలు అప్పుడప్పుడు ప్రకటిస్తుంటాయి దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఈ వాతావరణం ఎలా వుందోపోల్చి చూసే ర్యాంకులను కూడా ప్రకటిస్తుంటాయి. పేరులో వున్నట్లుగానే పెట్టుబడిదారులు, ముఖ్యంగా విదేశీ పెట్టుబడిదారులకు ఆటంకం/ఇబ్బంది లేకుండా వుండాలంటే ఎటువంటి చర్యలు తీసుకోవాలో జాబితా తయారుజేసి. వాటికనుగుణంగా ఆయా దేశాలలో, రాష్ట్రాలలో పరిస్థితి ఎలావుందో అంచనా కడతారు. వాటిని ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకులుగా ప్రకటిస్తారు. కార్మిక చట్టాలు కఠినంగా వున్నాయా/ సరళంగా వున్నాయా; బ్యాంకులు రుణాలు సుళువుగా తొందరగా ఇస్తున్నాయా/నిబంధనలను ఎక్కువ పెడుతున్నాయా; పన్నులు ఎక్కువగా వున్నాయా/ తక్కువగా వున్నాయా; అనుమతుల కోసం ఎక్కువ సమయం పడుతుందా/ తొందరగా వస్తున్నాయా; కాలుష్య నిబంధనలు కఠినంగా వున్నాయా/ ఉదారంగా వున్నాయా; భూమి సేకరణ నిబంధనలు ఇబ్బందిగా వున్నాయా/ ఎక్కడైనా ఎంతైనా తీసుకునేందుకు అవకాశం వుందా – ఇలా అనేక అంశాలలో పెట్టుబడిదారులకు పరిస్థితులు అనుకూలంగా వున్నాయా లేదా అన్నది పరిశీలించి అంచనా వేస్తారు.

ఇప్పుడు ప్రతి ప్రభుత్వం తమ దేశంలో లేదా తమ రాష్ట్రంలోనే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బాగుందని ప్రచారం జేసుకుంటూ విదేశీ పెట్టుబడి కోసం తాపత్రయపడుతున్నాయి. ఈ పోటీలో దేశ, రాష్ట్ర వనరులకు, ప్రజలకు ఎంత నష్టం జరుగుతున్నదో అన్న విషయాన్ని పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం దేశంలో ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడానికి ఈ వినాశకర పోటీ కూడా ఒక కారణం. ఇటువంటి నష్టదాయక పోటీని సరళీకరణ విధానాలను అమలు జరిపే వ్యవస్థలో నివారించడం సాధ్యం కాదు. ఈ విధానాలను తిప్పికొట్టడం ద్వారానే సాధ్యమవుతుంది.

**కేంద్రం, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి ప్రత్యక్షంగా నగదు బదిలీ చేస్తున్నాయి. అయినా వ్యవసాయ సంక్షోభం తీవ్రమౌతున్నది. కారణమేమిటి?**

చాలా కాలం నుండి దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో వున్నది. ఈ కాలంలో లక్షలాది మంది రైతులు ఆత్మ హత్య చేసుకోవడం ఈ సంక్షోభానికి సంకేతం. గతంలో కాంగ్రెస్ అయినా, ఇప్పుడు బి.జె.పి అయినా ఈ సంక్షోభాన్ని అధిగమించే ఏవిధమైన చర్యలు తీసుకోలేదు. అప్పుడప్పుడు ప్రకటించే అరకొర చర్యలు పరిస్థితిని చక్కదిద్దేందుకు తోడ్పడలేదు. ఎన్నికల తాయిలాలుగానే బూర్జువా పార్టీలు వాడుకున్నాయి.

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అప్పుడప్పుడు కల్పిస్తున్న రుణమాఫీలు, నగదు సహాయాలు, మద్దతుధరలు, బీమా పథకాలు – అన్నీ కంటి తుడుపు చర్యలుగా కూడా వుపయోగపడడం లేదు. ఎందుకంటే వ్యవసాయరంగాన్ని ఆవహించిన సమస్యలు అంతకన్నా మౌలికమైనవి.

కార్పొరేటు పెట్టుబడికి రుణమాఫీలు, పన్నురాయితీలు ఏ స్థాయిలో ఇస్తున్నారో ఆ స్థాయిలో రైతాంగానికివ్వడం లేదు. వాస్తవంగా బ్యాకింగ్ సంస్కరణలు వ్యవసాయానికి పరపతి సౌకర్యాన్ని ఇంకా కుదించి వేసి, రైతాంగం ప్రైవేటు రంగంపై ఆధారపడేస్థితిని పెంచుతాయి. ఉత్పత్తి ఖర్చులకు ఒకటిన్నర రెట్లు ఎక్కువగా గిట్టుబాటు ధర ఇస్తామన్న బి.జె.పి కేంద్ర ప్రభుత్వ ప్రకటన కలగా మిగిలిపోయింది. ప్రభుత్వం ప్రకటిస్తున్న అరకొర పథకాలు కూడా భూమిని నిజంగా సాగుజేస్తున్న కౌలుదార్లకు, సాగు రికార్డులు సక్రమంగా లేని రైతులకు దక్కడం లేదు.

అంతకన్నా మించి వ్యవసాయ రంగాన్ని మౌలికంగా బలపరచే సంస్కరణలను గాని, కౌలుదార్ల హక్కులకు గ్యారంటీగాని కల్పించే విధానాలను అమలు చేయడానికి ప్రభుత్వాలు పూనుకోవడం లేదు. ఇప్పటికే వున్న కొన్ని సానుకూల అంశాలను కూడా తొలగించడానికి ప్రయత్నిస్తున్నాయి.

వ్యవసాయంలో మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్లలో కేటాయింపులు పెంచడం అటుంచి క్రమేణా తగ్గించి వేస్తున్నారు. సరళీకరణ విధానాలను అనుసరిస్తున్న ప్రభుత్వాలు వ్యవసాయాన్ని కూడా కార్పొరేటు పెట్టుబడి, బహుళజాతి కంపెనీలకు అనువుగా మార్చివేసేందుకు గాను రైతాంగాన్ని వ్యవసాయం నుండి గెంటివేయడానికి తోడ్పడే విధానాలను అమలు చేస్తున్నాయి. ఇప్పుడు వ్యవసాయంలో కన్పిస్తున్న సంక్షోభం యాదృచ్ఛికమైనది కాదు. బహుళజాతి కంపెనీల కోసం ప్రభుత్వం సృష్టిస్తున్నది.

**తీవ్రమైన ఆర్థికమాంద్యంతో ప్రజల పరిస్థితులు దిగజారిపోతున్నా దానికి అనుగుణమైన రీతిలో దేశంలో పోరాటాలు రావటం లేదు. ప్రజలు ప్రతిఘటించకపోవటానికి కారణమేమిటి?**

పరిస్థితులు దిగజారుతున్నప్పటికీ దేశంలో పోరాటాలు రావడం లేదు అనుకునే పరిస్థితి ఇప్పుడులేదు. అన్ని రాష్ట్రాలలో పోరాటాలు పెరుగుతున్నాయి. తెలంగాణాలో ఆర్.టి.సి కార్మికుల సమ్మె, ఆంధ్రలో ఇసుక కొరతకు వ్యతిరేకంగా భవననిర్మాణ కార్మికుల పోరాటం, అనేక రాష్ట్రాలలో బలవంతపు భూ సమీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలు, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఫీజుల

పెంపుకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం, బ్యాంకుల విలీనానికి, బొగ్గు గనుల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా జరిగిన సమ్మెలు – పెరుగుతున్న ప్రతిఘటనను వెల్లడిస్తున్నాయి. అంతర్జాతీయంగా కూడా, చిలీ, ఇరాక్, ఇరాన్ ఇంకా అనేక దేశాలలో విస్తృతంగా ప్రజలు పోరాటాలలోకి రావడం చూస్తున్నాం. అయితే బలహీనత పోరాటాలు లేక పోవడంలో లేదు, ఈ పోరాటాలన్నింటిని సమన్వయంజేసి, వ్యవస్థనే మార్చివేసే మార్గంలోకి మళ్ళించే శక్తులు బలహీనంగా ఉండటంలో వున్నది. అటువంటి శక్తులు మళ్ళీ పుంజుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితులను వుపయోగించుకుని బలపడేందుకు అభ్యుదయ, విప్లవశక్తులు ముందుకు రావడానికి కొంత సమయం పడుతుంది.



కాశ్మీర్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్బంధం విధించిన 100 రోజుల తరువాత కూడా అక్కడ నేటికీ యుద్ధ వాతావరణం నెలకొని ఉంది. కర్ఫ్యూ నీడలో శ్రీనగర్

**కేంద్రం అస్సాంలో ఎన్‌ఆర్సిని అమలు జరపటం ద్వారా 20 లక్షల మందికి పైగా పౌరులు జాబితాలో చేరలేదు. ఇపుడు దేశవ్యాపితంగా అమలుచేస్తామని చెబుతున్నది. దీని ఫలితాలెలా ఉంటాయి?**

ఎన్.ఆర్.సి(నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్) సుప్రీంకోర్టు ఆ దేశం మేరకు అస్సాంలో జరిగింది. బి.జె.పి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఈ అంశాన్ని మతోన్మాదాన్ని రెచ్చగొట్టడానికి మైనారిటీలను మరింత అభద్రతకు గురిజేయడానికి వినియోగించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. అస్సాంలో ఇప్పటికే ఎన్.ఆర్.సి పూర్తి జేసి, దేశ పౌరులుగా గుర్తించని వారి జాబితాను ప్రకటించింది. అయితే ఈ జాబితా బి.జె.పి ఆశించినట్లుగా లేదు. తొలగించిన వారి జాబితాలో మైనారిటీల పేర్లతోపాటు హిందువుల పేర్లు కూడా ఎక్కువగా వుండడమే దీనికి కారణం.

ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం అస్సాంలో ఎన్.ఆర్.సిని మళ్ళీ కొత్తగా నిర్వహించడంతో పాటు దేశమంతటికి విస్తరిస్తామని ప్రకటించింది. దీన్ని సి.పి.ఐ(ఎం) వ్యతిరేకించింది.

గతంలో జరిగిన ఒడంబడిక ప్రకారం అస్సాంలో ఎన్.ఆర్.సి అవసరమైంది. కాని దేశవ్యాపితంగా దాన్ని విస్తరించాల్సిన అవసరం లేదు. ఇప్పటికే దేశపౌరులను గుర్తించడానికి ఆధార్, ఇంకా అటువంటి అనేక గుర్తింపు పద్ధతులున్నాయి. అయినా ఎన్.ఆర్.సిని దేశానికి విస్తరించడం మైనారిటీలను వేధించడానికి మినహా మరెందుకూ ఉపయోగపడదు. మతోన్మాదాన్ని దేశవ్యాపితంగా వ్యాపింపజేయడం అనే దురుద్దేశ్యం తప్ప ఇంకే సబబైన కారణం లేదు.

**జమ్ముూకాశ్మీర్‌లో సాధారణ పరిస్థితులను పునరుద్ధరించటానికి కేంద్రం సిద్ధపడటం లేదు. రాజకీయ నాయకులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది. రాష్ట్రంలో పరిస్థితులు సవ్యంగానే ఉన్నాయని ప్రభుత్వం చెబుతున్నది. ఇది ఎంతవరకు నిజం?**

కేంద్ర ప్రభుత్వం జమ్ము – కాశ్మీర్‌ను రాష్ట్రంగా రద్దుజేసి రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా ముక్కలు చేసింది. ఆ రాష్ట్రానికి వర్తించే 370, 35ఏ అధికరణాలను రద్దు జేసింది. మొత్తం జమ్ము – కాశ్మీర్‌ను బందిఖానాగా మార్చివేసింది. సమాచార సదుపాయాలను మూసివేసి, 5000 మందికి పైగా ప్రజానాయకులను నిర్బంధంలో వుంచామని ప్రభుత్వమే ప్రకటించింది. రాజ్యాంగం పట్ల ప్రజాస్వామ్యం పట్ల, ప్రజల ప్రాథమిక హక్కుల పట్ల బి.జె.పి ఎంత శత్రుభావంతో వుందో కాశ్మీర్ పరిణామాలు వెల్లడిస్తున్నాయి. ఇటువంటి నిరంకుశ విధానాలను ప్రతిఘటించకపోతే దేశ ప్రజాస్వామ్య పునాదులకే ప్రమాదం ఏర్పడే అవకాశం వుంది.

జమ్ము – కాశ్మీర్‌లో జరుగుతున్నది ముస్లింలకు వ్యతిరేకంగా జరుగుతున్నదని భావిస్తే పొరపాటు. దేశలౌకిక, ప్రజాస్వామిక పునాదులకు ఎసరు పెట్టే ప్రమాదకర పరిణామాలు అక్కడ జరుగుతున్నాయి. అందుకే దేశ ప్రజలు అప్రమత్తత కావాల్సిన అవసరం వున్నది.

**కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన ఆర్థిక, హిందుత్వ ఎజెండాను అమలుజరుపుతూ ముందుకు పోతున్నది. వామపక్షాలు దీనిని అడ్డుకోగల స్థితిలో లేవు. ఇది ఎటువంటి సమస్యలకు దారితీస్తుంది?**

దేశంలో సంఘపరివార్, కేంద్ర బి.జె.పి ప్రభుత్వాలు మతోన్మాద అజెండాను ముందుకు తీసుకుపోవాలని ప్రయత్నిస్తున్నాయి. అంతేకాక దేశ ఆర్థికవ్యవస్థను విదేశీ పెట్టుబడికి సానుకూలంగా తీర్చిదిద్దేందుకు వేగంగా చర్యలు తీసుకుంటున్నాయి. పైన పేర్కొన్నట్లు ప్రజలు ఈ విధానంతో సర్దుకు పోవడానికి సిద్ధంగా లేరు. పోరాటాలలోకి వస్తున్నారు.

వారికి నాయకత్వం వహించాల్సిన శక్తులే ప్రజలకంటే వెనక బడివున్నాయి. లౌకిక పక్షాలైన బూర్జువా పార్టీలు (కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలు వగైరా) బి.జె.పి, కేంద్రప్రభుత్వ మతోన్మాద పోకడలను నిశితంగా ఎదిరించడంలో ఊగిసలాటలు ప్రదర్శిస్తున్నాయి. సరళీకరణ విధాన నిర్ణయాల అమలును వ్యతిరేకించడం లేదు. ఇటువంటి పరిస్థితులలో అటు మతోన్మాదానికి, ఇటు సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యపోరాటాలను నిర్మించాల్సిన బాధ్యత వామపక్షాలపై పడింది. వామపక్షాలు శక్తి మేరకు ఈ పని చేస్తున్నాయి. లౌకికశక్తులలో, పార్టీలలో అనేక ఊగిసలాటలున్నా, వాటిని

మతోన్మాదానికి వ్యతిరేకంగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాపోరాటాలను పురికొల్పేందుకు కృషిజేస్తున్నాయి.

**ఇటీవల జరిగిన మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల ఫలితాల రాజకీయ ప్రాధాన్యత ఏమిటి?**

ఇటీవల మహారాష్ట్ర, హర్యానా శాసనసభలకు జరిగిన ఎన్నికలలో బి.జె.పి విర్రవీగుడుకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 370 అధికరణ రద్దు జమ్మూ-కాశ్మీర్ విభజన అంశం తనకు ఓట్లు తెచ్చిపెడుతుందన్న నమ్మకానికి గండిపడింది. వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర బి.జె.పి ప్రభుత్వాల వైఫల్యాలు బి.జె.పి స్థానాలు తగ్గడానికి కారణమయ్యింది.

అయినా ప్రతిపక్షాల, ముఖ్యంగా కాంగ్రెస్ బలహీనత మెజార్టీ తగ్గినప్పటికి బి.జె.పి కూటమే అధిక్యం సంపాదించడానికి కారణమయింది. హర్యానాలో చౌతాలా కుటుంబ పార్టీతో జతకట్టి బి.జె.పి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల్గింది.

మహారాష్ట్రలో కూడా బి.జె.పి - శివసేన కూటమికి మెజార్టీ వున్నప్పటికి ముఖ్యమంత్రి పదవిని పంచుకోవడం విషయమై తగాదా వచ్చి కూటమి విచ్ఛిన్నమైంది. బి.జె.పి అధికారానికి రాకుండా చేయడానికి శివసేన - ఎన్.సి.పి - కాంగ్రెస్‌లు కూటమిగా ఏర్పడడానికి చేసిన ప్రయత్నాలను బి.జె.పి - ఎన్.సి.పి నాయకుడు అజిత్ పవార్‌ను ఉపయోగించి కుట్ర పూరితంగా భగ్నం చేసింది. కేంద్ర సాయంతో దొడ్డి త్రోవన బి.జె.పి ప్రభుత్వాన్ని ఏర్పాటు జేసింది. ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ బద్ధతకు ఏ మాత్రం విలువనివ్వని నిరంకుశ పార్టీగా బి.జె.పి మరో సారి రుజువు చేసుకున్నది. అయితే ఎన్‌సిపి శాసనసభ్యులు ప్రభుత్వానికి మద్దతివ్వడానికి నిరాకరించటంతో బిజెపి ముఖ్యమంత్రి ఫడ్నవీస్ అవమానకరంగా రాజీనామా చేయాల్సివచ్చింది. దీనితో శివసేన, ఎన్‌సిపి, కాంగ్రెస్ కూటమి అధికారాన్ని చేపట్టింది. రాబోయే కాలంలో రాష్ట్ర రాజకీయాలు ఎలా ఉంటాయో చూడాలి.

**రాముని విగ్రహాలు పెట్టటం, మసీదును కూల్చివేయటం తప్పంటూనే సుప్రీంకోర్టు బాబ్రీమసీదు స్థలాన్ని రామాలయ నిర్మాణం కోసం ఇస్తూ తీర్పునిచ్చింది. ప్రజలను మతాల వారీగా విభజించటం కోసం సంఘ్ పరివార్ కాశీ, మధుర, దేశంలోని వివిధ ప్రాంతాలలో ఈ విధమైన వివాదాలను ముందుకుతెస్తున్నది. ఇటువంటి పరిస్థితులలో ఈ తీర్పు ఎటువంటి పరిణామాలకు దారితీస్తుంది?**

బాబ్రీమసీదు - రామజన్మ భూమి వివాదంపై సుప్రీం కోర్టు ఏకగ్రీవ తీర్పు వచ్చింది. ఈ తీర్పు దీర్ఘకాలంగా కొనసాగుతున్న వివాదానికి ముగింపు పలికింది తప్ప, సమస్యకు న్యాయమైన పరిష్కారాన్ని ఇవ్వలేదు విశ్వాసాలను బట్టి కోర్టు తీర్పు ఇవ్వగూడని ఒక వైపు చెబుతూనే తీర్పును మాత్రం లౌకిక న్యాయపద్ధతులకు భిన్నంగా ఇచ్చింది. దీన్ని ఆసరాజేసుకుని సంఘపరివార్ కొత్త వివాదాలను లేవనెత్తడానికి ఆస్కారం వచ్చింది. భవిష్యత్తులో కాశీ, మధుర వంటి చోట్ల ఇప్పటికే వివాదంగా వున్నవాటిని మతోన్మాదశక్తులు ముందుకు తేవచ్చు. 1991లో భారత ప్రభుత్వం చేసిన చట్టం ప్రకారం మసీదు, దేవాలయాలకు సంబంధించిన వివాదాలపై నిషేధం విధించింది. 1947 నాటికన్నా ముందు వాటి విషయంలో యథాతథ పరిస్థితి కొనసాగుతుందని చట్టం చెప్పింది. ఆ చట్టంకు లోబడే అందరూ వ్యవహరించాలని ప్రస్తుత



మహారాష్ట్రలో బిజెపికి భంగపాటు : మూణ్ణాళ్ల ముఖ్యమంత్రి ఫడ్నవిస్‌తో ఫిరాయింపుదారు అజిత్ పవార్

సుప్రీంకోర్టు తీర్పులో కూడా పేర్కొనబడింది.

అయినా సంఘ పరివార్ శక్తులు కోర్టు తీర్పులకు, చట్టాలకు విలువనిస్తాయనుకోవడం భ్రమ. బాబ్రీ మసీదు కూల్చివేత సందర్భంలో సంఘ పరివార్ వ్యవహరించిన తీరు మనకందరికీ తెలుసు. ఆ శక్తులు కొత్త వివాదాలు సృష్టించి, అఘాయిత్యాలకు పాల్పడకుండా చేయాలంటే లౌకికశక్తుల వుద్యమం తప్ప మరో మార్గం లేదు.

**రెండు తెలుగు రాష్ట్రాలలోని ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకోకుండా నిరంకుశంగా వ్యవహరిస్తున్నట్లు ఇటీవల అవి తీసుకొంటున్న నిర్ణయాలు తెలుపుతున్నాయి. తెలంగాణా ప్రభుత్వం సమ్మెచేస్తున్న ఆర్‌టిసి కార్మికుల పట్ల శత్రుభావంతో వ్యవహరిస్తున్నది. ఆంధ్రలో ఇసుక సమస్యను పరిష్కరించటం లేదు. మీడియాపై ఆంక్షలకు తెగబడ్డారు. పాలకులు ఎందుకు ఈ విధంగా వ్యవహరిస్తున్నారు?**

2014 లో ఉమ్మడి రాష్ట్రం విడిపోయిన తర్వాత ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రాల ప్రజల ఆ కాంక్షలను నెరవేర్చడంపై కేంద్రీకరిస్తాయని అందరూ భావించారు. కాని తెలంగాణాలో టి.ఆర్.ఎస్‌గాని, ఆంధ్రలో మొదట తెలుగుదేశం, ఇప్పుడు వై.ఎస్.ఆర్.సి.పిగాని తమ ఆర్థిక, సామాజిక పునాదులను గట్టిజేసుకోవడం, రాష్ట్రాల వనరులను తమ బృందాలకు పంపకం చేసుకోవడంపై కేంద్రీకరించాయి. అలాగే సంస్కరణలను వేగవంతంజేసే పనిని ప్రారంభించాయి. ఎన్నికల్లో కొన్ని తరగతుల ఓట్లు రాబట్టుకోవడానికి కొన్ని పాపులిస్టు వాగ్దానాలను జేసి వాటిలో కొన్నింటిని అమలు చేసినంత మాత్రాన ఈ ప్రభుత్వాలు సంస్కరణలను దూరం పెట్టాయనుకోరాదు. ఇప్పుడు వాటిని అమలు జేయడంలో భాగంగానే తెలంగాణాలో ఆర్.టి.సి కార్మికుల సమ్మె అణచివేత. ప్రైవేటీకరణ ప్రయత్నాలు చేస్తున్నారు. ఆంధ్రలో ప్రభుత్వ భూముల అమ్మకానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటువంటి చర్యలు రాబోయే కాలంలో ఇంకా మరిన్ని వస్తాయి. కేంద్ర ప్రభుత్వం కూడా ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాల అమలును ఉధృతం చేయబోతున్నది. ఈ చర్యలను అమలు చేయాలంటే ప్రజల వ్యతిరేకతను ఎదుర్కోవాలి. ఒక వైపున నిరంకుశంగా అణిచివేసే చర్యలు, మరోవైపున మత, కుల ప్రాతిపదికన విభజనజేసే చర్యలకు పార్టీలు ఒడిగడతాయి. దీనిలో భాగంగానే తెలంగాణా, ఆంధ్రలో రాష్ట్ర ప్రభుత్వాలు నిరంకుశ పోకడలను అనుసరిస్తున్నాయన్న విషయాన్ని గుర్తించాలి.

# బద్దలైన అభివృద్ధి బుడగ



**కామ్రేడ్ నండూరి ప్రసాదరావు 18వ వర్ధంతి సందర్భంగా నవంబరు 10వ తేదీన విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన సభలో ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో అర్థశాస్త్రం బోధిస్తున్న ప్రొఫెసర్ సి పి చంద్రశేఖర్ చేసిన స్మారకోపన్యాసాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం-సంపాదకుడు.**

దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం అభివృద్ధి చేసిన మేధావులలో నండూరి ప్రసాదరావు ఒకరు. ఆయన అనేక రంగాలలో ప్రావీణ్యం సాధించారు. జాతీయోద్యమ కాలంలో దేశంలో రైతాంగం, కార్మికవర్గాలను సంఘటిత పరచటం, పోరాటాలను నిర్వహించటంలో ఆయన చాలా కృషిచేశారు. స్వాతంత్రానంతరం కూడా ఆ వర్గాల పోరాటాలను ముందుకు తీసుకుపోవటం కోసం ఆయన పనిచేశాడు. సుందరయ్య, బసవపున్నయ్య, నంబూద్రిపాద్, రణదివే తదితరుల వలెనే భారతదేశంలోని ప్రత్యేక పరిస్థితులను అర్థం చేసుకోవటానికి, మార్క్సిజం-లెనినిజాన్ని భారతదేశ పరిస్థితులకు అన్వయింపచేయటానికి ఆయన చాలా కృషి చేశారు. ఈరోజు పేదల సమస్యలపై పనిచేయటం, వారి జీవితాలలో మార్పు తీసుకురావటాని చేస్తున్న ప్రయత్నం వారి ఈ కృషి ఫలితమేనని మనం అర్థం చేసుకోవాలి.

### కొనసాగే అర్హతను కోల్పోయిన పెట్టుబడిదారీ విధానం

ఈ సందర్భంగా సమాకాలీన పెట్టుబడిదారీ విధానం, ప్రస్తుతం మనదేశం ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిణామాలను గురించి చర్చించుకుందాం. 1980 దశాబ్దం చివరి వరకు ఉనికిలో ఉన్న సంఘటిత సోషలిస్టు శక్తి సోవియట్ యూనియన్ లేకపోయినప్పటికీ పెట్టుబడిదారీ విధానం కొనసాగే అర్హత (లెజిటిమసి)ను కోల్పోతున్నదని నేను భావిస్తున్నాను. 2008లో ప్రపంచం అంతా తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. మొదటగా అమెరికా హౌసింగ్ మార్కెట్‌లో ప్రారంభమైన సంక్షోభం తర్వాత ద్రవ్యరంగానికి విస్తరించి, అన్ని రంగాలను చుట్టేసి, 1930లలో ప్రపంచాన్ని ఆవరించిన మహామాంద్యం వలె మారుతున్నది. తమ బ్యాంకింగ్ వ్యవస్థలను, తద్వారా పెట్టుబడిదారీ విధానాన్ని కాపాడుకోవటం కోసం అభివృద్ధి చెందిన దేశాలు లక్షల కోట్ల డాలర్లను ఆర్థికవ్యవస్థలోకి పంపాయి. అయినప్పటికీ అమెరికా నుండి బ్రిటన్, యూరప్ దేశాలకు, ఆ తర్వాత అభివృద్ధి చెందుతున్న దేశాలకు, మార్కెట్ వ్యవస్థలు అభివృద్ధి చెందుతున్న చైనా, భారత్ లాంటి దేశాలకు కూడా మాంద్యం విస్తరించింది. పెట్టుబడిదారీ వ్యవస్థ కొనసాగే అర్హతను కోల్పోతున్నదన్న విషయాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయని నేను భావిస్తున్నాను.

రెండవ ప్రపంచయుద్ధం పూర్తయే సరికి పెట్టుబడిదారీ విధానం తాను ఎదుర్కొంటున్న సంక్షోభం నుండి బయటపడింది. అప్పటి నుండి 1973లో ఆయిల్ సంక్షోభం ప్రారంభమయే వరకు పెట్టుబడిదారీ విధానానికి స్వర్ణయుగంగా భావించారు. ఈ కాలంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తక్కువగా ఉన్నాయి. అభివృద్ధి ఎక్కువగా ఉంది. మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయటం కోసం ప్రభుత్వాలు

పెద్దమొత్తంలో వ్యయం చేశాయి. కాబట్టి కీనీసియన్ విధానాలతో పెట్టుబడిదారీ విధానం సంక్షోభాల నుండి బయటపడిందని, రానున్న కాలంలో సంక్షోభాలను ఎదుర్కోనబోదని ప్రచారం చేశారు. 1970వ దశాబ్దంలోఆయిల్ ధరల పెరుగుదల కారణంగా ద్రవ్యోల్బణం సమస్య ఎదురైంది. తమ దేశాలలోని ఆయిల్ నిల్వలను దోపిడీ చేస్తున్న పశ్చిమదేశాల బహుళజాతి సంస్థలను అరబ్‌దేశాలు బయటకు పంపటం అందుకు కారణం. ఆ తర్వాత 1980లలో బ్యాంకింగ్ సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. 90వ దశాబ్దంలో డాట్‌కాం సంక్షోభం వచ్చింది. 2007-08లో సంక్షోభం ప్రారంభమైంది. ఈ పరిణామాల పూర్వరం గంలో మనం అర్ధ శతాబ్దకాల పెట్టుబడిదారీ విధానాన్ని పరిశీలించినపుడు పెరుగుదల రేట్లు తక్కువగా ఉండటం, స్వల్పకాల అంతరాలతో కుదిపేస్తున్న తీవ్రమైన సంక్షోభాలు ఆ వ్యవస్థ కొనసాగే అర్హతను కోల్పోయిందని స్పష్టం చేస్తున్నాయి. ఈ వ్యవస్థకు సరైన ప్రత్యామ్నాయం ఆవిర్భవించలేదు కాబట్టే అది ఇంకా నిలిచివున్నది.

భారతదేశంలో జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకోవటానికి ఈ కాలంలోజరిగిన రెండు ప్రధాన అంశాలను పరిశీలించాలి. ఒకటి ద్రవ్యపెట్టుబడులు ఆధిక్యతాస్థానానికి చేరాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభమే ఇందుకు కారణం. అభివృద్ధి చెందిన దేశాలతో పాటు అన్ని దేశాలలోని ఉత్పత్తిరంగం సంక్షోభంలో ఉండటంతో పెట్టుబడులు పెట్టటానికి డిమాండ్ తగ్గింది. అందువలన అభివృద్ధి చెందిన దేశాలలోని ప్రభుత్వాలు ద్రవ్య పెట్టుబడులు ఏ దేశాలలోనైనా పెట్టుబడులు పెట్టటానికి, లాభాలు సంపాదించటానికి అవకాశాలు కల్పించాలని నిర్ణయించాయి. పెట్టుబడిదారీ విధాన స్వర్ణయుగంలో ఉత్పాదక పెట్టుబడులు, నిజ ఆర్థికవ్యవస్థ ప్రధానస్థానంలో ఉండగా, 1980 దశాబ్దకాలం తర్వాత సాపేక్షంగా ద్రవ్య పెట్టుబడులు ప్రధానస్థానంలో ఉన్నాయి. ట్రెజరి, కేంద్రబ్యాంకుతో సహా ఆర్థికమంత్రిత్వశాఖ ద్రవ్య పెట్టుబడులకు అత్యధిక లాభాలు సంపాదించుకొనే విధంగా పెట్టుబడులు పెట్టటానికి అవకాశాలు కల్పిస్తున్నాయి. ఈ కాలంలో ఇది ఒక ముఖ్యమైన పరిణామం.

> **“ సరళీకరణ, నయా ఉదారవాద విధానాల వలన ద్రవ్యపెట్టుబడి ఆధిపత్యం పెరగటం, అభివృద్ధి చెందుతున్న దేశాలలో ద్రవ్య పెట్టుబడి ప్రవేశం, దాని కార్యకలాపాలు పెరిగాయి. 1980 దశాబ్దం నుండి దక్షిణ అమెరికా దేశాలలో, తర్వాత భారతదేశంలో ప్రారంభమైన ద్రవ్య పెట్టుబడుల ప్రవాహాలు తర్వాత ప్రపంచవ్యాపితంగా విస్తరించాయి. ”**




రెండవది అభివృద్ధి చెందిన దేశాలు ద్రవ్య పెట్టుబడులకు స్వేచ్ఛ ఇవ్వటంతో పెట్టుబడులు ప్రపంచవ్యాపితంగా విస్తరించాయి. దీర్ఘకాలం నుండి అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రైవేటు మార్కెట్ల నుండి పెట్టుబడులు పొందటానికి అవకాశం లేకుండాపోయింది. ద్వైపాక్షికంగా ప్రభుత్వాల నుండి, లేదా ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు, తదితర ప్రపంచ ద్రవ్యసంస్థల ద్వారా మాత్రమే ద్రవ్య రుణాలు లేదా సహాయం పొందటానికి అవకాశం ఉండేది. తమకు అవసరమైనపుడు లండన్, న్యూయార్క్ తదితర మార్కెట్ల నుండి రుణం పొందటానికి అవకాశం ఉండేది కాదు. అంటే ఏదేశమైనా తమ ఆర్థికవ్యవస్థలను సరళీకరించటం, తద్వారా దిగుమతులు పెరిగితే విదేశీ చెల్లింపుల సమస్యను ఎదుర్కొనేవి. తాము ఎక్కువగా దిగుమతులు చేసుకుంటే అందుకు చెల్లింపులు చేయటానికి అవసరమైన విదేశీ మారకద్రవ్యాన్ని ఎగుమతుల ద్వారా సంపాదించటం సాధ్యం కాదు. అందుకోసం తిరిగి ఐఎంఎఫ్ వద్దకు వెళ్ళాల్సివుంటుంది. అందువలన ఆ కాలంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు జాతీయాభివృద్ధి వ్యూహంపై ఆధారపడిన విధానాలను అనుసరించేవి.

### మారిన అభివృద్ధి వ్యూహం

అభివృద్ధి చెందుతున్న దేశాలు ద్రవ్య పెట్టుబడుల ప్రపంచీకరణ జరగటం తమకొక అవకాశంగా భావించాయి. నూతనంగా స్వాతంత్ర్యం సాధించిన భారత్ లాంటి దేశాలు మౌలిక విధానాలలో మార్పులు తీసుకురాలేదు. భూసంస్కరణలను అమలు చేయకపోవటంతో రైతులు, గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తిని పెంచలేకపోయారు. ఫలితంగా పారిశ్రామిక సరుకులకు మార్కెట్‌ను విస్తృతపరచలేకపోయారు. ఇందువలన 1960 దశాబ్దం నుండి అభివృద్ధి వేగం తగ్గింది. 1970 దశాబ్దం నుండి ఈ దేశాలు ప్రత్యామ్నాయ అభివృద్ధి వ్యూహాన్ని అనుసరించటానికి పూనుకున్నాయి. విదేశీ పెట్టుబడులను రుణమార్కెట్‌లోకి, స్టాక్ మార్కెట్‌లోకి ఆహ్వానించారు. తమ ఆర్థికవ్యవస్థలను సరళీకరించటం వలన విదేశీ పెట్టుబడులు వస్తాయని, ఎగుమతులను

"సంక్షోభం కొనసాగుతున్నప్పటికీ పెట్టుబడికి లాభాలు వస్తూనే ఉన్నాయి. సంపాదించిన లాభాలు తిరిగి సామ్రాజ్యవాద దేశాలకు వెళ్ళకపోయినప్పటికీ సామ్రాజ్యవాద దేశాలు, వెనుకబడిన దేశాలలోనూ పెట్టుబడి లాభాలను సంపాదిస్తూనే ఉన్నది. ఈ లాభాలు పన్ను స్వర్గాలుగా ఉన్న చిన్న దీవులకు, కేమెన్ దీవుల లాంటి చోట్లకు వెళ్ళి, తిరిగి ప్రపంచంలోని వివిధ దేశాలకు చేరుతున్నవి."

పెంచుకోవచ్చునని, తమ ఆర్థికవ్యవస్థలను ఎగుమతులపై ఆధారపడి అభివృద్ధి చెందే ఆర్థికవ్యవస్థలుగా మార్చవచ్చునని భావించారు. తమ వాణిజ్యాన్ని, దేశంలోకి విదేశీ పెట్టుబడుల రాకను, దేశీయ పెట్టుబడిని సరళీకరించారు. ఎగుమతులు తగ్గి దిగుమతులు పెరగటం ద్వారా తక్షణమే ఏదైనా సమస్య వచ్చినా వెంటనే రుణం, లేదా విదేశీ పెట్టుబడులను పెంచుకోవటం ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చునని భావించారు. అయితే సరళీకరణ వలన దిగుమతులు పెరగటంతో విదేశీ మారకం లోటు సమస్య ఎదురైంది. అభివృద్ధి చెందిన దేశాలలో ఏర్పడిన సంక్షోభం వలన ప్రపంచవ్యాపితంగా విస్తరించటానికి పూనుకున్న ద్రవ్య పెట్టుబడి భారతదేశంతో పాటు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించలేదు.

సరళీకరణ, నయా ఉదారవాద విధానాల వలన ద్రవ్యపెట్టుబడి ఆధిపత్యం పెరగటం, అభివృద్ధి చెందుతున్న దేశాలలో ద్రవ్య పెట్టుబడి ప్రవేశం, దాని కార్యకలాపాలు పెరిగాయి. 1980 దశాబ్దం నుండి దక్షిణ అమెరికా దేశాలలో, తర్వాత భారతదేశంలో ప్రారంభమైన ద్రవ్య పెట్టుబడుల ప్రవాహాలు తర్వాత ప్రపంచవ్యాపితంగా విస్తరించాయి. ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం పెరగటం వలన పెట్టుబడిదారీ దేశాలన్నింటిలోనూ సంక్షోభం తీవ్రమైంది.

### తీవ్రమౌతున్న సంక్షోభం

పారిశ్రామిక కార్యకలాపాలను అభివృద్ధి చెందిన దేశాల నుండి వెనుకబడిన దేశాలలోకి మార్చటం. వెనుకబడిన దేశాలలో పెద్దమొత్తంలో ఉన్న నిరుద్యోగం వలన చౌకగా దొరికే శ్రమశక్తి, వ్యవసాయంలో తగిన ఆదాయం రాకపోవటం వలన పట్టణాలకు వలసపోయి తక్కువ కూలికి పనిచేసే రైతులు, చౌకగా ముడి సరుకులు అందుబాటులో ఉండటంతో పారిశ్రామిక ఉత్పత్తిని సామ్రాజ్యవాద దేశాల నుండి వెనుకబడిన దేశాలలోకి మార్చారు. దీనిని అన్ని దేశాలలోకి కాకుండా ఎంపిక చేసిన దేశాలకు, జపాన్ నుండి దక్షిణకొరియా వరకు, చైనా నుండి ఇండియా తదితర దేశాలకు ఉత్పత్తి కేంద్రాలను మార్చారు. పరిశ్రమలు స్థాపించిన దేశాల అవసరాలతో పాటు ఎగుమతుల కోసం కూడా ఈ పరిశ్రమలలో ఉత్పత్తి జరుగుతుంది. ఈ విధంగా ఉత్పత్తిని వేరేచోట్లకు మార్చటానికి పెట్టుబడిదారీ సంక్షోభం కారణం కాదు. ఇది సామ్రాజ్యవాద దేశాలలో ఏర్పడిన సంక్షోభ ఫలితం మాత్రమే. చౌకగా శ్రామికులు దొరికే కొద్ది దేశాలకు ఉత్పత్తి కేంద్రాలను మార్చటం వలన పారిశ్రామిక దేశాలలో సంక్షోభం తీవ్రమైంది. ఆర్థికవ్యవస్థలు మందగించాయి. నిరుద్యోగం పెరిగింది. సామ్రాజ్యవాద దేశాలలోని కార్పొరేట్ పెట్టుబడి అపారంగా చౌకశ్రమశక్తి దొరికే దేశాలకు వచ్చి, అక్కడ లాభాలు, ఇతర ప్రయోజనాలను పొందుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ స్వర్ణయుగం పూర్తయిన తర్వాత ఆ వ్యవస్థ ఎదుర్కొంటున్న పెద్ద సంక్షోభం ఇది. ఉత్పత్తిని తరలించటం వలన కొద్ది దేశాలు లబ్ది పొందుతున్నాయి. ఆ దేశాలే సామ్రాజ్యవాద దేశాలలోని పెట్టుబడి శక్తిని కుంగదీస్తున్నాయి.

సంక్షోభం కొనసాగుతున్నప్పటికీ పెట్టుబడికి లాభాలు వస్తూనే ఉన్నాయి. సంపాదించిన లాభాలు తిరిగి సామ్రాజ్యవాద దేశాలకు వెళ్ళకపోయినప్పటికీ సామ్రాజ్యవాద దేశాలు, వెనుకబడిన దేశాలలోనూ పెట్టుబడి లాభాలను సంపాదిస్తూనే ఉన్నది. ఈ లాభాలు పన్ను స్వర్గాలుగా ఉన్న చిన్న దీవులకు, కేమెన్ దీవుల లాంటి చోట్లకు వెళ్ళి, తిరిగి ప్రపంచంలోని వివిధ దేశాలకు చేరుతున్నది. దీని వలన అసమానతలు పెరుగుతున్నాయి. కార్మికులు, రైతులు, ఇతర ఉత్పత్తిదారుల వేతనాలు, ఆదాయాలలో అతికొద్ది పెరుగుదల, లేదా ఎటువంటి పెరుగుదల లేకపోవటం, మరోవైపున ఒకశాతంగా ఉన్న శత కోటీశ్వరుల లాభాలు విపరీతంగా పెరుగుతున్నాయి. పెట్టుబడిదారీ దేశాలతో నిమిత్తం లేకుండా పెట్టుబడి విజయం సాధిస్తున్నది. ఇటువంటి పరస్పర విరుద్ధ పరిణామాలు బ్రెగ్జిట్ లాంటి పరిణామాలకు, ఎవరూ ఊహించని విధంగా ట్రంప్ విజయం సాధించటానికి దారితీస్తున్నాయి. ప్రపంచవ్యాపితంగా పెద్దమధనం జరుగుతున్నది. ఇటువంటి పరిణామాల నుండే యూరప్ దేశాలలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు వలస వచ్చిన వారే కారణమని ప్రచారం చేస్తున్న మితవాదశక్తులు బలపడుతున్నాయి. పెట్టుబడిదారీ విధానం కొనసాగే అర్హతను కోల్పోతున్నదని ఈ పరిణామాలు రుజువుచేస్తున్నాయి.

1985లో రాజీవ్‌గాంధి ప్రధానిగా ఉన్నపుడు ఈ విధానాల ద్వారా ప్రయోజనం పొందటానికి ప్రయత్నించారు. ముఖ్యంగా 1991లో విదేశీ చెల్లింపుల సమస్య వచ్చిన తర్వాత మనం కూడా సరళీకరణ విధానాలను అనుసరించటం ద్వారా, విదేశీ సరుకుల ప్రవేశానికి మన మార్కెట్‌ను తెరవటం ద్వారా విదేశీ పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందవచ్చునని, అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీపడే స్థాయికి చేరవచ్చునని, ఎగుమతులను పెంచుకోవచ్చునని భావించారు. దక్షిణకొరియా, ఆగ్నేయాసియా దేశాలలాగా, ఒకప్పటి జపాన్‌లాగా అభివృద్ధి చెందవచ్చునని, ప్రపంచ దేశాలకు ఉత్పత్తుల సరఫరాదారుగా రూపొందవచ్చునని భావించారు. ప్రపంచంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా మన విధానాలను మార్చుకోవటం ద్వారా పెట్టుబడులను ఆకర్షించటం, ఉత్పత్తికేంద్రంగా ఎదగటం ద్వారా దీనిని సాధించవచ్చునని ప్రచారం చేస్తున్నారు. 1991లో పివి నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పటి నుండి మోడి మేక్ఇన్ ఇండియా నినాదం వరకు ప్రభుత్వాలు ప్రజలకు ఇదే వాగ్దానం చేస్తున్నాయి. కాని పెట్టుబడులు భారతదేశానికి రావటం కాని, దేశం అటువంటి అభివృద్ధిని సాధించటం కాని జరగలేదు. ప్రపంచ ఎగుమతిదారుల జాబితాలో మనం లేము.

1985లోనే సరళీకరణ కొద్దిమేరకు ప్రారంభమైనప్పటికీ అది అంత ప్రముఖంగా లేదు. 1991 తర్వాత విదేశీ పెట్టుబడులు కొద్దిమొత్తంలో రావటం ప్రారంభమైంది. వస్తున్న పెట్టుబడి ఎగుమతుల రంగంలోకి కాక, దేశీయ వినియోగరంగాలైన విద్యుత్ ఉత్పత్తి, టెలికాం లాంటి రంగాలలోకి వచ్చాయి. ఇవేవీ ఎగుమతి చేసేరంగాలు కాదు. పెద్దమొత్తంలో

రాయితీలు, 16 శాతం లాభాలకు గ్యారంటీ పొందిన ఎన్‌రాన్ సమస్యగా మారటం తెలిసిందే. విదేశీ ద్రవ్య పెట్టుబడులు స్టాక్ మార్కెట్‌లోకి, ప్రభుత్వబాండ్లు కొనటానికి రావటం పెరిగింది. పెట్టుబడిదారులకు దేశంలో ద్రవ్యకొరత సమస్య ఎదురైనపుడు విదేశాలలో బాండ్లు జారీ చేయటం ద్వారా రుణాలు సేకరించి సమస్యను పరిష్కరించారు. విదేశీ పెట్టుబడులు దేశంలో ఉత్పత్తి క్రమాన్ని దెబ్బతీశాయి. విదేశీ పెట్టుబడుల రాక పెరగటంతో అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా ధరలు ఉండాలనే పేరుతో ప్రభుత్వం సబ్సిడీలు తగ్గించటం, రైతాంగానికి గిట్టుబాటు ధరలను తక్కువగా నిర్ణయించటం చేస్తున్నది. దేశీయ ధరలను తక్కువగా ఉంచటానికి అవసరమైతే దిగుమతులు చేసుకోవచ్చని భావిస్తున్నది. మరోవైపున అంతర్జాతీయ పెట్టుబడులు ప్రభుత్వం తీసుకుంటున్న రుణంపై పరిమితులు విధిస్తున్నాయి. ప్రభుత్వం బడా పెట్టుబడి, విదేశీ పెట్టుబడులకు పెద్దమొత్తంలో పన్ను ఇతర రాయితీలు ఇస్తున్న సందర్భంలో, ప్రభుత్వ ఆదాయం తగ్గుతున్న సమయంలో ప్రభుత్వరుణం పెరగకూడదని, బడ్జెట్‌లోటు పెరగకూడదని ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నది.

**ప్రజల కొనుగోలుశక్తిని పెంచటానికి పరిమితులు**

దేశంలో అభివృద్ధికి దోహదం చేసే అంశాలు రెండు ఉన్నాయి. ఒకటి వ్యవసాయరంగంలో వృద్ధి సాధించటం, రైతుల ఆదాయాన్ని పెంచటం, రెండు ప్రభుత్వ వ్యయాన్ని పెంచటం ద్వారా డిమాండ్‌ను పెంచటం. సరళీకరణ విధానాల ద్వారా ఈ రెండింటికీ పరిమితులు ఏర్పడ్డాయి. దేశంలో డిమాండ్ తగ్గిన పరిస్థితులలో ఎగుమతులను పెంచటం ద్వారా వృద్ధికి ఊతం ఇవ్వవచ్చునని ప్రభుత్వం భావించింది. సరళీకరణ విధానాల ఫలితంగా వ్యవసాయ రంగానికి సబ్సిడీలు, పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వటం సాధ్యం కావటం లేదు. ఎఫ్ఆర్‌బిఎం చట్టం వలన ప్రభుత్వం అదనంగా ఖర్చుచేసి, డిమాండ్‌ను పెంచటానికి ఉన్న అవకాశాలు కుదించుకుపోతున్నాయి. ఫలితంగా 1970వ దశాబ్దం చివరి నుండి ప్రారంభమైన అభివృద్ధి మందగించటం కొనసాగుతున్నది. అయితే హఠాత్తుగా 2003–04 నుండి 2011–12 వరకు ఆర్థికవ్యవస్థ 8 శాతంకు పైగా అభివృద్ధిని నమోదు చేసింది. మధ్యలో 2008–09 సంవత్సరం మాత్రమే వృద్ధిరేటు తగ్గింది. 2003 సంవత్సరమే

“కొందరైతే వేగంగా అభివృద్ధి చెందటంలో భారతదేశం చైనాను వెనక్కు నెట్టిందని చెప్పారు. ఈ మధ్యకాలంలో పెరుగుతున్న వృద్ధిని గురించి ప్రభుత్వం ఇస్తున్న అంకెలు వక్రీకరించబడినవని స్పష్టమౌతున్నది. వ్యవసాయరంగ సంక్షోభం, ప్రభుత్వఖర్చుపై పరిమితులు పెరగటం, ఆశించిన విధంగా ఎగుమతులు పెరగకపోవటం తదితరాలు ఒకవైపు ఉండగా, మరోవైపు అత్యంత వేగంగా ఆర్థికవృద్ధి జరగటం ఎలా సాధ్యమైంది?”



ఎఫ్ఆర్‌బిఎం చట్టాన్ని ఆమోదించారు. కొందరైతే వేగంగా అభివృద్ధి చెందటంలో భారతదేశం చైనాను వెనక్కు నెట్టిందని చెప్పారు. ఈ మధ్యకాలంలో పెరుగుతున్న వృద్ధిని గురించి ప్రభుత్వం ఇస్తున్న అంకెలు వక్రీకరించబడినవని స్పష్టమౌతున్నది. వ్యవసాయరంగ సంక్షోభం, ప్రభుత్వఖర్చుపై పరిమితులు పెరగటం, ఆశించిన విధంగా ఎగుమతులు పెరగకపోవటం తదితరాలు ఒకవైపు ఉండగా, మరోవైపు అత్యంత వేగంగా ఆర్థికవృద్ధి జరగటం ఎలా సాధ్యమైంది?

**రుణాలపై ఆధారపడిన అభివృద్ధి**

ఈ కాలంలో విదేశీ ద్రవ్య పెట్టుబడుల రాక నాటకీయంగా పెరిగింది. 1991 తర్వాతి బడ్జెట్‌లలో చూస్తే విదేశీ ద్రవ్య పెట్టుబడులు 2 బిలియన్ డాలర్లు, 4లేక 5 బిలియన్ డాలర్లు, మరీ ఎక్కువగా వచ్చాయనుకుంటే 8 బిలియన్ డ్లార్లుగా ఉండేవి. అపుడు ప్రభుత్వం బడ్జెట్ ప్రసంగాలలో సంవత్సరానికి 10 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులను రప్పించటం లక్ష్యంగా పేర్కొనేది. అటువంటిది 2003 నుండి విదేశీ ద్రవ్య పెట్టుబడుల రాక పెరిగింది. సంవత్సరానికి 10–13–34 బిలియన్లు, అత్యధికంగా 60 నుండి 80 బిలియన్ డాలర్ల వరకు వచ్చాయి. ప్రపంచవ్యాపితంగా విదేశీ ద్రవ్య పెట్టుబడులు లాభాల వేటలో భాగంగా దేశంలోకీ వచ్చాయి. ఇవి స్టాక్‌మార్కెట్, ఉత్పత్తిరంగంలోకి వచ్చాయి. అంతకు ముందు ఏదైనా పరిశ్రమలో కనీసం 25 శాతం వాటానైనా కొనుగోలు చేస్తేకాని విదేశీ పెట్టుబడిగా లెక్కించేవారు కాదు. ఇపుడు 10 శాతం కొనుగోలు చేసినా విదేశీ పెట్టుబడిగానే లెక్కిస్తున్నారు. అయినావిదేశీ పెట్టుబడుల రాక ఉత్పత్తిశక్తిని ఆదనంగా పెంచటానికి దోహదం చేయలేదు. సెకండరీ మార్కెట్‌లోకే వచ్చాయి. మరి ఈ విదేశీ పెట్టుబడులతో ఎగుమతులు పెరగనపుడు, ఇవి ఉత్పత్తిశక్తిని అదనంగా పెంచనపుడు, దేశంలోకి విదేశీ ద్రవ్య పెట్టుబడుల రాక పెరగటం వలన వృద్ధిరేటు పెరగటం ఎలా సాధ్యమైంది?

దేశంలోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులైనా, ద్రవ్య పెట్టుబడులైనా మొదటగా బ్యాంకుల వద్దకు వస్తాయి. వారు తీసుకువచ్చిన డాలర్లు, యూరో, ఎన్ లను బ్యాంకులో రూపాయలలోకి మార్చుకొని వారి కార్యకలాపాలను నిర్వహిస్తారు. వారు తిరిగి తమ డబ్బును వెనక్కు తీసుకొనేటపుడు రూపాయలను బ్యాంకుకు చెల్లించి, డాలర్లు, యూరో, ఎన్ లను తీసుకొని వెళతారు. ఈ క్రమంలో బ్యాంకుల వద్ద పెద్దమొత్తంలో డిపాజిట్లు చేరాయి. డిపాజిట్‌దారులకు వడ్డీలు చెల్లించాలి కాబట్టి బ్యాంకులు తమ వద్దకు వచ్చిన

**"భారతదేశం సాధించిన వృద్ధిరేట్ల పెరుగుదల ప్రధానంగా రుణబుడగలపై ఆధారపడినది. విదేశీ పెట్టుబడులు పెద్దమొత్తంలో రావటం, వాటిని వినియోగరుణాలుగా ఇవ్వటం, పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చటానికి పారిశ్రామిక సంస్థలకు రుణాలివ్వటం, హౌసింగ్ రుణాలు తదితరాల ఆధారంగా కొంతకాలం 8 శాతానికి పైగా వృద్ధి నమోదైంది. ఆ విధంగా రుణబుడగలపై ఆధారపడిన వృద్ధి ముగింపుకు రావటంతో ఏంచేయాలో అర్థం కాని పరిస్థితి ప్రభుత్వానికి ఏర్పడింది."**

డబ్బును తప్పనిసరిగా రుణాలుగా ఇవ్వాలి. బ్యాంకుల నుండి రుణాలు పొందినవారి నుండి వసూలుచేసిన వడ్డీలో డిపాజిట్ దారునికి బ్యాంకు చెల్లించే వడ్డీ పోనూ మిగిలిన మొత్తం బ్యాంకుకు లాభంగా ఉంటుంది. ఈ విధంగా బ్యాంకులు ఇస్తున్న రుణాలు 2003 తర్వాత భారీగా పెరిగాయి. 2003కు ముందు బ్యాంకులు ఇస్తున్న రుణాలు జిడిపిలో 20-22 శాతంగా ఉండేవి. 2003 తర్వాత ఇది 55 శాతానికి పైగా పెరిగింది.

బ్యాంకులు వినియోగదారులకు కొంతమొత్తం రుణాలు ఇచ్చాయి. ఇళ్ళు కొనుగోలు చేయటానికి, టివి, కారు, ఇతర వినియోగసరుకులు కొనుగోలుకు రుణాలు ఇచ్చాయి. అమెరికా హౌసింగ్ సంక్షోభం అనుభవం ఉన్నప్పటికీ గృహ రుణాలు ఇవ్వటం క్షేమమని భావించాయి. వినియోగరంగం తర్వాత పారిశ్రామిక రంగానికి ఎక్కువ మొత్తం రుణాలు ఇచ్చాయి. రుణాల ద్వారా డిమాండ్ పెంచటం, ఆ డిమాండ్‌ను తీర్చటానికి రుణాల ద్వారా ఉత్పత్తిని పెంచే విధానాన్ని అనుసరించారు. తర్వాత బ్యాంకులు అప్పటి వరకు రుణాలు ఇవ్వని మౌలిక సదుపాయాల రంగానికి, విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, రోడ్లు, ఓడరేవులు, విమానయాన రంగం, టూరిజం తదితర రంగాలకు రుణాలు ఇవ్వటం ప్రారంభించాయి. వీటిలో కొన్ని కంపెనీలకు, ప్రత్యేకమైన వ్యక్తులకు ఇచ్చిన రుణాలు ఎక్కువగా ఉన్నాయి. బ్యాంకులలో డిపాజిట్లు చేసిన సామాన్య ప్రజలు తమ పిల్లల విద్య, పెళ్ళిళ్ళు, ఇతర కుటుంబ అవసరాల కోసం తమ డబ్బును వెనక్కు తీసుకుంటారు. కానీ మౌలిక సదుపాయాలు కల్పించే సంస్థలకు ఇచ్చిన రుణాలు వెనక్కు రావటానికి ఎక్కువ కాలం పడుతుంది. అంతకు ముందు ఈ రంగాల రుణంకోసం బ్యాంకుల వద్దకు వెళితే, ఈ రంగాలకు రుణాలివ్వటం తమపని కాదని, మౌలిక సదుపాయాల కల్పనకు రుణాలిచ్చే బ్యాంకుల వద్దకో, బాండ్ల మార్కెట్‌కో వెళ్ళమని సలహాలు ఇచ్చేవి. అటువంటిది వాటి వైఖరిలో హఠాత్తుగా వచ్చిన మార్పుతో పెద్దమొత్తంలో రుణాలు ఇచ్చాయి. బ్యాంకుల వైఖరి మారటానికి ప్రభుత్వమే కారణం.

మౌలిక సదుపాయాల కల్పన సంస్థలకు ప్రభుత్వం నిధులు కేటాయించటం తగ్గిపోయింది. ప్రభుత్వం పన్ను రాయితీలు ఇస్తున్నది. ఎఫ్ఆర్‌బిఎం చట్టం వలన ప్రభుత్వం రుణాలు తీసుకోవటానికి పరిమితి ఏర్పడింది. మౌలిక సదుపాయాలు కల్పించే సంస్థలకు రుణాలివ్వటానికి ఏర్పాటు చేసిన ఐడిబిఐ, ఐసిఐసిఐ లాంటి సంస్థలు మూతపడ్డాయి లేదా అవి కూడా బ్యాంకులుగా మారాయి. కాబట్టి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న సంస్థలకు రుణాలివ్వటానికి ప్రత్యేకమైన సంస్థలు లేవు. ఇతర రంగాలలోకి విదేశీ పెట్టుబడులను రాబట్టటానికి మౌలిక సదుపాయాల కల్పన అవసరం. కాబట్టి రుణాలివ్వండి. ఏదైనా సమస్య వస్తే నేనున్నానని ప్రభుత్వం బ్యాంకులకు హామీ ఇచ్చింది. పెట్టుబడుల పెంపుకు బ్యాంకులను సాధనాలుగా వాడుకోవాలని ప్రభుత్వం భావించి, రుణాలివ్వటానికి బ్యాంకులను ప్రోత్సహించింది. ప్రభుత్వం చెప్పినంత మాత్రానే రుణాలు ఇవ్వాల్సిన అవసరం లేనప్పటికీ ఒకవైపున పెద్దమొత్తంలో పోగుపడిన డబ్బు, మరోవైపున ప్రభుత్వం హామి ఇవ్వటంతో రుణాల వలన రిస్క్ ఎదురైనా ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందని, రుణం తీసుకున్న సంస్థను, తమను ఒడ్డున వేస్తుందని, తమ రుణాలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని బ్యాంకులు విశ్వసించాయి. రుణాలివ్వటంపై బ్యాంకులపై అనేక ఆంక్షలుండటంతో ఇతర మార్గాలలో రుణాలిచ్చాయి. ఇదే సమయంలో పెద్దసంఖ్యలో ఎన్‌బిఎఫ్‌సిలు పుట్టుకొచ్చాయి. అవి ఇతర విధాలుగా ద్రవ్యాన్ని సమకూర్చుకున్నా, వాటి ప్రధాన వనరు బ్యాంకులే. అవి బ్యాంకుల వద్ద సంవత్సరం, ఆరు మాసాల వ్యవధితో రుణాలు తీసుకొని, చెల్లింపు వ్యవధిని పెంచుతామని బ్యాంకులు హామి ఇవ్వటంతో 10 సంవత్సరాల కాలానికి రుణాలు ఇచ్చాయి. ఆటోమొబైల్ రంగం, డిహెచ్ఎఫ్ఎల్, ఐఎల్ఎఫ్ఎస్ తదితర సంస్థలకు ఎన్‌బిఎఫ్‌సిలే ఎక్కువ మొత్తం రుణాలు ఇచ్చాయి. ఈ సంస్థలు తిరిగి చెల్లింపులు చేయటంలో సమస్యలు ఎదురయాయి. బ్యాంకులు రుణాలనునిరంతరం పునర్వ్యవస్థీకరించటంతో ఈ అంశాలు వాటి ఖాతా పుస్తకాలలో వెల్లడి కాలేదు. కొన్ని సంస్థలకు ఇచ్చిన రుణాలను ఈక్విటీగా మార్చారు. కాని కింగ్‌ఫిషర్ లాంటి సంస్థలు దివాళా తీయటంతో వాటి ఈక్విటీకి విలువ లేకుండాపోయింది. రుణం ఎక్కువగా ఉండటం బ్యాంకులకు సమస్యగా మారింది. హఠాత్తుగా బ్యాంకులు రుణాలివ్వటం తగ్గించటం, రుణాలను పునర్వ్యవస్థీకరించటం ఆపివేయటంతో ఎన్‌బిఎఫ్‌సిలు సంక్షోభంలో చిక్కుకున్నాయి.

భారతదేశం సాధించిన వృద్ధిరేట్ల పెరుగుదల ప్రధానంగా రుణబుడగలపై ఆధారపడినది. విదేశీ పెట్టుబడులు పెద్దమొత్తంలో రావటం, వాటిని వినియోగ రుణాలుగా ఇవ్వటం, పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చటానికి పారిశ్రామిక సంస్థలకు రుణాలివ్వటం, హౌసింగ్ రుణాలు తదితరాల ఆధారంగా కొంతకాలం 8 శాతానికి పైగా వృద్ధి నమోదైంది. ఆ విధంగా రుణబుడగలపై ఆధారపడిన వృద్ధి ముగింపుకు రావటంతో ఏంచేయాలో అర్థం కాని పరిస్థితి ప్రభుత్వానికి ఏర్పడింది. అంతర్జాతీయ పెట్టుబడులకు ఇచ్చిన వాగ్దానం నుండి వెనక్కురావటానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. దాని నుండి బయటపడటం కోసం పెద్ద నోట్లను రద్దు చేశారు. జిఎస్‌టిని తీసుకొచ్చారు. అయినా ఫలితాలు రాలేదు. శతకోటీశ్వరులపై పన్నులు వేయటం ద్వారా ఈ సమస్యను పరిష్కరించటానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. 2003లోచోటు చేసుకున్న పరిణామాలు పెట్టుబడిదారీ విధానానికి కల్పించిన కొనసాగే అర్హతను ఈ పరిణామాలు హరించివేస్తున్నాయి. నయా ఉదారవారం కొనసాగే అర్హతను కోల్పోయింది. దానితో ప్రభుత్వం జిఎస్‌టి లాంటి చర్యల ద్వారా సంక్షోభాన్ని మరింత తీవ్రం చేయటం, లేదా ప్రజల మధ్య విభజనలను సృష్టించి, ఆర్థిక అంశాల నుండి దృష్టి మళ్ళించే చర్యలకు పాల్పడుతున్నది. దీని వలన ఈ విధానాల డొల్లతనాన్ని ఎండగట్టటానికి ప్రయత్నిస్తున్న ప్రతిపక్షాల పని మరింత క్లిష్టంగా మారుతున్నది.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

# తొలినాటి మహానగరాలు

ఎంవిఎస్ శర్మ



రచయిత
ప్రజాశక్తి సంపాదకులు

సింధునాగరికత ప్రధానంగా కంచు యుగపు నాగరికత. ఆనాడు వాడిన పనిముట్లలో అత్యధిక భాగం రాతి పనిముట్లే అయినా రాగి, కంచు పనిముట్లదే కీలకపాత్ర. తగరంతో రాగి కలిపి తయారు చేస్తే వచ్చే మిశ్రమ లోహం కంచు. ఇటుకలతో కట్టిన కొలిమిలో ఈ లోహాన్ని కరిగించి మట్టి, మైనం కలిపి తయారు చేసిన అచ్చులలో పోత పోసేవారు. కత్తి, ఉలి, కొక్కెం, కొడవలి, రంపం, గొడ్డలి వంటి పని ముట్లు తయారు చేశారు. ఐతే అవి నేడు మనం ఉపయోగించే వాటిలాగా లేవు. (చూ.2.6 – కంచు అద్దం, రంపం). ఇవి గాక మేకులు, దబ్బనాలు, బరమా, బాణపు ములికి, బల్లెపుమొన, వంటి చిన్న సైజు పనిముట్లు, ఆయుధాలు తయారు చేయగలిగారు. రాగి, కంచు పాత్రల వాడకం కూడా ఉన్నప్పటికీ అది ప్రధానంగా ధనవంతుల ఇళ్ల వరకే పరిమితం.

ఉత్తర సింధు ప్రాంతంలో విస్తారంగా చెకుముకి రాళ్లు లభ్యం అయ్యేవి. రాగి, కంచు పరికరాలను ఉపయోగించి ఈ చెకుముకి రాళ్లను కావల్సిన ఆకృతులు వచ్చేలా చెక్కేవారు. ఉత్తర సింధు ప్రాంతంలోని రోహ్రి లేదా సుక్కుర్ పర్వత ప్రాంతాల్లో ఈ రాతిపనిముట్ల తయారీ పెద్ద ఎత్తున జరిగేది. అక్కడి నుండి మొహెంజుదారో వంటి పట్టణాలకు ఈ పనిముట్లను నావల ద్వారా రవాణా చేసేవారు. రంగురాతి పూసలకు సన్నని రంధ్రాలు దొలిచే రాతి ములికి సాధనాలు పెద్ద సంఖ్యలో ఇక్కడ లభించాయి.

వడ్రంగి పని కూడా బాగా సాగింది. చన్హుదారో ప్రాంతంలో బళ్లు, రథాలు తయారు చేసినట్టు అక్కడ దొరికిన మట్టి నమూనాలు సూచిస్తున్నాయి. నాగళ్లు కూడా తయ తయారు చేసేవారు. అయితే కర్రతో చేసిన అసలు పరికరాలు శిథిలమైపోయాయి. నమూనాలే దీనికి ఆధారం. రథాలకు ఇరువైపులా చక్రాలు అమర్చడం, అందుకోసం ఇరుసు తయారు చేయడం ఉత్పత్తిలో ఒక పురోగతి. ఐతే బళ్లకు అమర్చిన చక్రాలు ఏక ఫలకంలాగా ఉండేవి. అంటే అప్పటికింకా ఆకులు అమర్చిన (స్పోక్స్) చక్రాల తయారీ లేదనుకోవాలి.

చూ. 2.7 (ఎ), 2.7 (సి)

సింధు ప్రజలు సరుకులను దూరప్రాంతాలకు చేరవేయడానికి నావలను ఉపయోగించినట్టు మనం నిర్ధారించవచ్చు. సరుకులతో ఉండే నావలకు తెరచాపలు కూడ ఉండేవి. ఇప్పుడు నదులలో ఉపయోగిస్తున్న తెప్పల మాదిరిగా ఇవి ఉండేవి. తవ్వకాలలో బైటపడ్డ ఒకసీలు మీద ఒక నౌకా చిత్రం లభించింది. చూ.(2.8)

వినిమయ వస్తువులలో ప్రధానంగా ఉత్పత్తి అయినవి మట్టితో చేసిన పాత్రలు. ఇవి దృఢంగా, పెద్దపెద్ద సైజులలో ఉండేవి. దళసరిగా ఉండే, కాల్చిన కుండల, మట్టిపాత్రల శిధిలాలు రకరకాలు ఆకారాలలో లభించాయి. వీటిని తయారు చేయడానికి కుమ్మరి కుమ్మరి సారెను ఉపయోగించారు. వీటి వినియోగం ఎక్కువగా ఉండేది. పెద్దపెద్ద కుమ్మరి కొలిమిల ఆనవాళ్ళను బట్టి ఈ నిర్ధారణకు రావచ్చు. ఈమట్టి పాత్రలలో కొన్నింటిపై రంగులుపూసి రకరకాల బొమ్మలను చిత్రీకరించేవారు.




చూ. 2.9(ఎ), 2.9(బి)

ప్రత్యేమైన నైపుణ్యంతో తయారు చేసే మట్టి గాజులను స్త్రీలు ధరించేవారు. చేతితో నూలు వడికేందుకు జేగురు మట్టితో చేసిన రాట్నాలను వినియోగించారు. దాదాపు ప్రతీ ఇంటిలోనూ స్త్రీలు నూలువడికే వారని చెప్పవచ్చు. కర్రమగ్గాలు వాడిన దాఖలాలైతే లేవు.

తవ్వకాలలో బైటపడ్డ ఆనవాళ్లను బట్టి పట్టణాలను, నగరాలను ప్లాను ప్రకారం నిర్మించేమేరకు సింధునాగరికత కాలంలో భవన నిర్మాణ రంగం అభివృద్ధి అయిందని చెప్పవచ్చు. ఇళ్ల నిర్మాణానికి కాల్చిన ఇటుకలను వినియోగించేవారు. మొత్తం సింధునాగరికత ప్రాంతం అంతటా 7 సెం. మీ మందం, 15 సెం. మీ వెడల్పు, 31 సెం.మీ పొడవు గల ఇటుకలనే వినియోగించడం విశేషం. దీనివలన గోడల నిర్మాణంలో ఒక వరస అడ్డంగా, దానిపైవరస నిలువుగా ఇటుకలను పేర్చడం సాధ్యపడుతుంది. ఆ గోడలు దృఢంగా నిలవగలుగుతాయి. ఇప్పటికీ ఇటుకలతో గోడలు కట్టేటప్పుడు ఇదే పద్ధతిని అనుసరిస్తారు. స్నానాలకు నిర్మించిన పెద్దపెద్ద నీటి తొట్టెలు (ప్రస్తుత కాలపు స్విమ్మింగ్ పూల్ మాదిరి) తవ్వకాలలో బైటపడ్డాయి. నీరు ఇంకిపోకుండా ఉండేందుకు గానుగసున్నం, జిప్సం, తారువంటివి వినియోగించారు. సింధునాగరికత ధ్వంసమైన తర్వాత దాదావు 3000 సంవత్సరాలు గడిచిన తర్వాత మాత్రమే మళ్లీ గానుగసున్నం, జిప్సం, తారు, భవన నిర్మాణంలో వినియోగించబడ్డాయి.

నూతులను, డ్రెయినేజి కాల్వలను

> **❝ ప్రధానంగా రాతిపనిముట్లనే వినియోగించేవారు. చెకుముకిరాయితో చేసిన పనిముట్ల తయారీ, రాగి పనిముట్లు తయారు చేసే కొలిమి వినియోగం ఉండేవి. రంగురాళ్లతో, శంఖాలతో చేసిన ఆభరణాలు వినియోగించారు. ఆ భరణాలపై వివిధ జంతువుల బొమ్మల్ని చిత్రీకరించారు. దూర ప్రాంతాలతో వ్యాపార సంబంధాలు నెలకొల్పినట్లు ఈ వివరాలు స్పష్టం చేస్తున్నాయి. ఒక్కోప్రాంతం10-12 ఎకరాల విస్తీర్ణంలో ఉండడం బట్టి నగరీకరణ విప్లవం ఇంకా తొలిదశలోనే ఉన్నట్టు భావించాలి. ❞**







(వీటికి పై కప్పులు కూడా ఉండే విధంగా – ఆధునిక కాలంలో తూముల మాదిరిగా) ఇటుకలతో నిర్మాంచారు.

చూ. 2.2బి (దిగువ మొహంజూదారో పట్టణపు ప్లాను)

చూ. 2.14 (మొహంజూదారో స్విమ్మింగ్‌పూల్)

ఆభరణాల తయారీలో రంగురాళ్లతో బాటు వెండి, బంగారం కూడా వినియోగించారు. వెండి పాత్రలను కూడ ధనవంతులు వినియోగించేవారు. పింగాణీ తయారీ కూడ నేర్చుకున్నారు. నీలమణి, మరకతం, కెంపు, వంటి రంగురాళ్లతో పూసలు చేసి, వాటికి రంధ్రాలు చేసి హారాలుగా అలంకారాలకు వినియోగించేవారు. ఈ రంగురాళ్లను పొదిగిన పింగాణీ పాత్రలు కూడ తవ్వకాలలో లభించాయి. సింధు పరీవాహక ప్రాంతం వెంబడి, ముఖ్యంగా గుజరాత్



ప్రాంతంలో ఈ రంగురాళ్ల ఆభరాణాలను తయారు చేసే కర్మాగారాలు ఉండిన ఆధారాలు లభించాయి.

అభ్రకం మాదిరిగా తళతళ మె ఒక విధమైన రాయి (దీనిని సోప్‌స్టోన్ లే స్ఫియటైట్ అంటారు. ఇది ఆకృతులను చెక్కడా వీలుగా మెత్తగా ఉండే ఖనిజం) ని పయోగించి సీళ్లు తయారు చేసేవారు. ఆన నాగరికతకు సంబంధించిన లిఖిత పూ ఆధారాలు ఈ సీళ్లే. వీటిపై జంతు ఆకృతులతో బాటు కొన్ని సంజ్ఞలు కూడా చెక్కబడివున్నాయి. సింధు పరీవాహక ప్రాంతం అంతటా ఒకే తరహాలో, ఒకే నిర్ణీతమైన సైజులో ఉండే సీళ్లు లభ్యం కావడం విశేషం. బహుశా ఈ సీళ్లు సంపదను లేదా విలువను సూచించే అధికారిక చిహ్నాలు అయివుండొచ్చు. ఇప్పటికి కూడా ఆ సీళ్లపైన ఉండే లిపి, సంజ్ఞలు ఏ అర్థాలను సూచిస్తున్నాయో పరిశోధకులు నిర్ధారించలేక పోతున్నారు. ఒకసారి అది నిర్ధారించగలిగితే ఆ కాలం నాటి సమాజాన్ని, ప్రజల ఆలోచనలను మరింత వివరంగా తెలుసుకోగలుగుతాం.

చూ. 2.11 (హరప్పాలో లభించిన సీలు, దానిముద్ర యొక్క ఫోటో)

ఒక్క మొహంజొదారోలోనే ఇటువంటి సీళ్లు 1200 వరకు దొరికాయి. వీటిలో కొన్నిటిని పింగాణీ, చలువరాయి, జేగురురాయి, వెండి ండే డా లో రు ది.



FIG. 2.8 River vessel on Indus seal.
(After S. Ratnagar)




> " వ్యవసాయం విస్తరించడానికి ఎడ్లు, నాగలి తోడ్పడ్డాయి. ప్రధానంగా నదీ తీరాల వెంబడి గ్రామాలు విస్తరించినా, వర్షాధార వ్యవసాయంతో పాటు బావులు తవ్వడం మొట్టమొదటిగా సింధు నాగరికతలోనే మొదలైంది. అప్పటికి ఇంకా కప్పీల వాడకం తెలియదు గనుక బావుల నుండి నీరు తోడడానికి 'మోట' పద్ధతిలో ఎడ్ల వినియోగం సాధ్యం కాదు. అందుచేత ఏతాముల ద్వారా నీటిని బావుల నుండి తోడేవారు. "



హరప్పానగరం సుమారు 375 ఎకరాల విస్తీర్ణం కలిగివుండేది. మొహంజూదారోలో దాదాపు 85,000 మంది, హరప్పాలో 65,000 మంది జనాభా ఆ నాగరికత ఉచ్ఛదశలో ఉన్నప్పుడు నివసించివుండొచ్చని చరిత్రకారులు అంచనా వేశారు. నిస్సందేహంగా ఇది చాలా పెద్ద సంఖ్య. మనం నేటికి 4,500 సంవత్సరాలకు పూర్వపుకాలం గురించి చర్చిస్తున్నాం. అప్పటి ఉత్పత్తి స్థాయి, పరికరాల స్థాయిలను దృష్టిలో ఉంచుకుంటే ఇవి ఆనాటి కాలంలో ప్రపంచంలోని ఆధునిక నగరాలని గట్టిగా చెప్పవచ్చు. ఇంత పెద్ద నగరాలు కాకపోయినా సింధునదీ తీరం వెంబడి దిగువన గుజరాత్ వరకు పలు నగరాలు 150 ఎకరాల నుండి 600 ఎకరాల వరకు విస్తీర్ణంతో ఏర్పడినట్టు తవ్వకాలలో బైటపడింది.




ఈ నగరాలన్నీ నదుల వరద ప్రవాహాలను తట్టుకొనగలిగేలా నిర్మించారు. ఎత్తైన అరుగులు నిర్మించి వాటిపైన కట్టడాలని నిర్మించారు. ఒక ప్లాను ప్రకారం నగరాలను, రోడ్లను, డ్రెయినేజిని నిర్మించారు. ఈ రోడ్లపై ఎడ్లబళ్లు ఎదురెదురుగా ఆటంకం లేకుండా పోగలిగేవి. 30 అడుగుల రోడ్లు ప్రధాన రహదారులుగా ఉండేవి.

ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తే యజమానితోబాటు ఆయనవద్ద పనిచేసే సేవకులకు కూడ ఆ గృహాలలో వసతి ఉండేలా పెద్ద, చిన్న సైజు గదులతో ఆ ఇళ్లు కనపడ్డాయి. ఉమ్మడి కుటుంబాలు ఉండగలిగే పెద్ద పెద్ద ఇళ్లు కూడ ఉన్నాయి. కొన్ని చిన్న చిన్న ఇళ్లు వరసగా ఒకే దగ్గర ఉండడం బట్టి కూలీల ఇళ్లు వేరేగా కూడా ఉండేవని తెలుస్తోంది. మొహంజొదారో నగరంలో సుమారు 2000 – 3000 మధ్య సంఖ్యలో ఇళ్లు, సుమారు 700 బావులు ఉండేవి. పలు ఇళ్లల్లోనే స్నానపుగదులు, మరుగుదొడ్లు కూడ వుండేవి. వీటి నుండి మురుగు నీరు పోవడానికి ప్రధాన డ్రెయినేజికి తూముల ద్వారా వీటిని కలిపారు.

హరప్పా, మొహంజొదారోలతో బాటు ధోలావిరా అనే మరో నగర అవశేషాలు రన్ ఆఫ్ కచ్ (గుజరాత్) దీవిలో బైటపడ్డాయి. వాననీటిని పదిలం చేసుకునే విధంగా ఇక్కడ ప్లాను చేయడం విశేషం. కాళీబంగన్(రాజస్తాన్), చాన్హుదారో (సింధురాష్ట్రం) లోథల్(గుజరాత్) వంటి ఇతర పట్టణాలు కూడ తవ్వకాలలో వెలుగు చూశాయి. లోథల్ వద్ద చిన్నపాటి ఓడరేవు కూడ ఉండేది. సముద్రపు పోటువున్నపుడు ఆ నీటితో డాక్‌యార్డు (ఓడలు నిలిచేస్థలం)ను నింపివుంటారని భావిస్తున్నారు.

ఇంత స్థాయిలో నగరాల నిర్మాణం జరిగిందంటే ఈ నగర ప్రజలకు సరిపడా ఆహారధాన్యాలను ఉత్పత్తి చేసి అందించే గ్రామీణ ప్రాంతాలు పరిసరాల్లో ఉండాలి. ఉత్పత్తి అయ్యే రకరకాల సరుకులను బట్టి వాణిజ్యం కూడా బాగా జరిగివుండాలి. అ వివరాలు వచ్చే వ్యసంలో తెలుసుకుందాం. ❊

మతతత్వం

# బ్రిటిష్ వారికి లొంగిపోయిన సావర్కర్

ఎ. కోటిరెడ్డి



రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

సంఘ్ పరివార్ సావర్కర్‌ను జాతీయ స్వాతంత్ర్యం కోసం పోరాడిన నాయకుడని ప్రచారం చేస్తున్నది. కాని స్వాతంత్ర్య పోరాటంలో సావర్కర్ జాతీయోద్యమానికి వ్యతిరేకంగా, బ్రిటిష్ వారికి అనుకూలంగా పనిచేశాడు. బ్రిటిష్ వారి ప్రయోజనాలు నెరవేరుస్తానని వాగ్దానం చేసి జైలునుండి బయటపడ్డాడు. వలస పాలకుల ప్రయోజనాల కోసం పని చేశాడు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నందుకుగానూ బ్రిటిష్ ప్రభుత్వం సావర్కర్‌కు 50 సంవత్సరాల కారాగారశిక్ష విధించి, అండమాన్ దీవులకు పంపింది. బ్రిటిష్ అధికారులకు క్షమాదాన పత్రాలు రాసిచ్చిన ఆయన 13 సంవత్సరాలలోనే జైలునుండి విడుదలైనాడు. తన లొంగుబాటుకు ప్రతిఫలంగా జైలులో ఉన్నకాలంలో కూడా ఆయన అధికారుల నుండి అనేక రాయితీలు పొందాడు. అప్పటి వరకు ఉన్నత వర్గాలకు పరిమితమైన జాతీయోద్యమం గాంధి నాయకత్వంలో సామాన్య ప్రజలలోకి విస్తరించటంతో జాతీయోద్యమాన్ని విచ్ఛిన్నం చేయటానికి హిందుత్వ భావజాలంతో ఉన్న సావర్కర్ తమకు బాగా వినియోగపడతాడని బ్రిటిష్ వారు గ్రహించారు. హిందువులు మాత్రమే ఒకజాతి అని ప్రచారం చేయటం వలన ముస్లింలు దూరమౌతారని, హిందు మెజారిటీ వలన తమ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని, బ్రిటిష్ వారి వలననే తమ ప్రయోజనాలు కాపాడబడతాయని ముస్లింలు భావిస్తారని ఆంగ్లేయులు యోచించారు. అందుకోసం ఉపయోగపడతాడని సావర్కర్‌ను ప్రధానభూభాగానికి తరలించి, ఆయన తన సిద్ధాంతాలను రాసుకోవటానికి, ప్రచారం చేసుకోవటానికి అన్ని సదుపాయాలు కల్పించారు. ఆయన అనుయాయులు రావటానికి, ఆయనతో చర్చించటానికి అవకాశమిచ్చారు. 1920లో జరిగిన నాగపూర్ కాంగ్రెస్ మహాసభలో కాంగ్రెస్‌ను ఉన్నతవర్గాలకు పరిమితమైన స్థితి నుండి ప్రజాపార్టీగా మార్చటానికి తీసుకున్న నిర్ణయాలు హిందు, ముస్లిం మతోన్మాదులు ఇరువురికీ అసంతృప్తిని కలిగించాయి. జిన్నా కాంగ్రెస్ నుండి రాజీనామా చేశాడు. హిందు మతోన్మాదంతో ఉన్నవారు ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టటానికి పూనుకున్నారు. ఆ విధంగా హిందు, ముస్లిం మతోన్మాదులు ఉభయులూ బ్రిటిష్ వారి "విభజించి పాలించు" విధానం విజయవంతం కావటానికి దోహదం చేశారు. ఈ విధమైన పరిణామాలు జరుగుతున్న క్రమంలో బ్రిటిష్ వారు సావర్కర్‌ను 1921 మేనెలలో అండమాన్ జైలు నుండి ప్రధాన భూభాగానికి తీసుకువచ్చారు. ఐదు సంవత్సరాల పాటు ప్రభుత్వ ఆమోదం లేకుండా ఎటువంటి రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనరాదని షరతు విధించి, 1924లో ఎరవాడ జైలు నుండి విడుదల చేశారు. ఆ షరతు ఉన్నప్పటికీ తమ విధానాలకు అనుగుణంగా భారతీయులలో చీలికలు తీసుకువస్తున్నందున ఆయన మతోన్మాద విధానాలను ప్రచారం చేసుకోవటానికి బ్రిటిష్ వారు అవకాశం కల్పించారు.

మహాత్మాగాంధి హత్యలో ఆర్ఎస్ఎస్ ప్రమేయాన్ని గురించి 1948, ఫిబ్రవరి 17వ తేదీన హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రధాని నెహ్రూకు ఈ విధంగా లేఖరాశాడు," సావర్కర్ నాయకత్వంలోని మతమౌఢ్యంతో కూడిన విభాగం మహాత్ముని హత్యకు పథకం రూపొందించి అమలుచేసింది".

రక్షణమంత్రితో సహా ప్రస్తుత బిజెపి ప్రభుత్వంలోని మంత్రులు, ఆ పార్టీ నాయకులు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను విముక్తి చేయటానికి సిద్ధంగా ఉన్నామని, ఎపుడైనా ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవటం కోసం దాడి జరగవచ్చని ప్రకటనలు చేస్తున్నారు. కాని వాస్తవం ఏమిటంటే బిజెపి, సంఘ్ పరివార్‌లు ఆకాశానికెత్తుతున్న సావర్కర్ ముస్లింలీగ్ వలెనే రెండు దేశాల సిద్ధాంతాన్ని ఆమోదించి, అందుకోసం ప్రచారం చేశాడు. మతం ప్రాతిపదికగా జాతి ఉంటుందన్న సిద్ధాంతాన్ని అంగీకరించి, ప్రచారం చేస్తున్న సంఘ్ పరివార్ ముస్లింలు మెజారిటీగా ఉన్న పిఒకెను స్వాధీనం చేసుకుంటామని చెప్పటం వంచన కాదా?

**హిందుస్థాన్ రిపబ్లికన్ ఆర్మీకి వ్యతిరేకం**

సుభాష్ చంద్రబోస్‌ను కూడా హిందుత్వ అనుకూలుడుగా చూపటానికి సంఘ్ పరివార్ ప్రయత్నాలు చేస్తున్నది. కాని దేశవిముక్తి కోసం సుభాష్ చంద్రబోస్ చేస్తున్న కృషికి వ్యతిరేకంగా బ్రిటిష్ వారికి మద్దతిచ్చిన చరిత్ర సావర్కర్‌ది. సాయుధసైన్యాన్ని సమకూర్చుకొని, భారతదేశం నుండి బ్రిటిష్‌వారిని తరిమివేయటానికి సుభాష్ చంద్రబోస్ ప్రయత్నం చేస్తుంటే మరోవైపున సావర్కర్ భారతీయులందరూ సైన్యం, నౌకా, వైమానిక దళాలలో చేరి, బ్రిటిష్ వారి తరపున పోరాడాలని పిలుపునిచ్చాడు. 1941లో జరిగిన హిందు మహాసభ 23వ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ రక్షణ బలగాలలో చేరి, బ్రిటిష్ వారి తరపున పోరాడటానికి హిందువులందరినీ ఉత్సాహపరచాలని కార్యకర్తలకు పిలుపునిచ్చాడు. రెండవ ప్రపంచయుద్ధ కాలంలో బ్రిటిష్ వారిని బలపరిచాడు. అన్ని రంగాలలోనూ బ్రిటిష్ ప్రభుత్వాన్ని బలపరచాలని తన అనుయాయులకు విజ్ఞప్తి చేశాడు. హిందువులను బ్రిటిష్ సైనికదళాలలో చేర్చటానికి రిక్రూట్‌మెంట్ కేంద్రాలను నిర్వహించాడు. కేవలం హిందు మహాసభ కృషిద్వారానే లక్షమంది సైన్యంలో చేరారని ఆయన చెప్పాడు. ఆ తర్వాత ఈ బ్రిటిష్ సైనికదళాలే నేతాజీ నేతృత్వంలోని ఇండియన్ నేషనల్ ఆర్మీ సైనికులు వేలాది మందిని

**"దేశంలో బ్రిటిష్ వారికి లొంగిపోయి పరిపాలిస్తున్న హిందురాజులకు సావర్కర్ గట్టి మద్దతుదారుగా ఉన్నాడు. 1857 తిరుగుబాటును అణచివేయటానికి మద్దతు ఇచ్చిన వారినే బ్రిటిష్ వారు సంస్థానాధీశులుగా కొనసాగనిచ్చారు. ఈ సంస్థానాధీశులు ప్రజలపై అనేక విధాలుగా దోపిడీ, అత్యాచారాలు కొనసాగించేవారు. హిందు మహాసభ ఈ దమనకాండను ఖండించకపోగా దేశభక్తులను చంపించిన సంస్థానాధీశునికి మద్దతు తెలిపింది."**

ఊచకోత కోశాయి. అనేకమందిని వికలాంగులను చేశాయి.

దీనికి ప్రతిగా బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారిక యుద్ధకమిటీలలో హిందు మహాసభ నాయకులకు స్థానం కల్పించింది. సైన్యంలో చేరిన హిందువులు బ్రిటిష్ వారి సైనిక క్రమశిక్షణ పద్ధతులకు కట్టుబడి ఉండాలని చెప్పాడు. రెండవ ప్రపంచయుద్ధ సమయంలో వివిధ విప్లవ సంస్థలు, సుభాష్ చంద్రబోస్ సోవియట్ యూనియన్ నుండి సహాయం పొందటానికి ప్రయత్నం చేశారు. అటువంటి ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సావర్కర్ బ్రిటిష్ వారిని హెచ్చరించాడు.

ముస్లింలు ఈ దేశానికి చెందినవారు కాదని, వారు ఇతర ప్రాంతాల నుండి వచ్చారని, వారి పుణ్యభూమి వేరని, వారి పుణ్యభూమికే వారి విధేయత ఉంటుందని ప్రచారం చేస్తున్నారు. కాని నేపాల్ రాజు పట్ల సావర్కర్, హిందు మహాసభఅటువంటి విధేయతనే ప్రదర్శించారు. నేపాల్ రాజు భారతదేశాన్ని కూడా పాలించాలని సావర్కర్, హిందు మహాసభ కోరాయి. నేపాల్ రాజు భారతదేశంలోనూ, ప్రపంచమంతటా ఉన్న హిందువులకు రాజుగా ఉండాలని చెప్పాడు. నేపాల్ రాజు ఫోటోను పతి హిందు మహాసభ సమావేశం వద్ద పెట్టి శుభాకాంక్షలు తెలిపేవారు. ఆయనకు విధేయత ప్రకటిస్తూ తీర్మానాలు చేసేవారు. నేపాల్ హిందువులకు పవిత్రభూమి అని సావర్కర్ ప్రకటించాడు. బ్రిటిష్‌వారి చేతుల నుండి జారిపోవటానికి ముందే భారతదేశాన్ని నేపాల్ రాజుకు అప్పగించమని సావర్కర్ బ్రిటిష్ రాణికి విజ్ఞప్తి చేశాడు.

సావర్కర్ భారత్‌ను అప్పగించమంటున్న నేపాల్ రాజులే 1857లో జరిగిన మొదటి స్వాతంత్ర్య పోరాటాన్ని అణచటంలో బ్రిటిష్ వారికి తోడ్పడ్డారు. ఢిల్లీ, రోహిల్‌ఖండ్, ఔధ్‌లను నేపాల్ రాజు పంపిన గూర్ఖా సైన్యం మద్దతుతోనే బ్రిటిష్ వారు జయించగలిగారని నాటి బ్రిటిష్ ప్రభుత్వ డాక్యుమెంట్లు వెల్లడిస్తున్నాయి. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా భారతీయులు చేస్తున్న తిరుగుబాటును అణచటానికి నేపాల్ రాజు జంగ్ బహదూర్ 50 వేలమంది గూర్ఖా సైనికులను పంపించాడు. ఆనాడు బ్రిటిష్ అధికారులు రూపొందించిన నివేదికల ప్రకారం అజాంఘర్, గోరఖ్‌పూర్, బారాబంకి, బస్తి, బహ్రైచ్, బులంద్‌షహర్, బదౌన్ తదితర ప్రాంతాలలో విప్లవకారులను అణచివేయటంలో నేపాల్ రాజు పంపిన గూర్ఖా సైన్యం నిర్ణాయక పాత్ర పోషించింది. గూర్ఖా సైనికులు వందలాది



వినాయక దామోదర సావర్కర్

మంది విప్లవకారులను చంపివేశారు. పోరాటాన్ని అణచివేసిన తర్వాత అయోధ్య, గోరఖ్‌పూర్ మీదుగా తిరుగు ప్రయాణంలో గ్రామాలు, పట్టణాలను కొల్లగొడుతూ, ప్రజలపై అత్యాచారాలను కొనసాగిస్తూ, భారతదేశంలో దోచుకున్న సంపదను లెక్కలేనన్ని బళ్ళలో నేపాల్‌కు తరలించుకుపోయారు. భారతీయుల స్వాతంత్ర్య పోరాటాన్ని అణచటానికి నేపాల్ రాజు చేసిన సహాయానికి ప్రతిగా భారత్‌లోని విశాలమైన తెరాయ్ ప్రాంతాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నేపాల్ రాజుకు బహుమతిగా ఇచ్చింది. ఈ వాస్తవాలన్నీ తెలిసిన తిరుగుబాటు ప్రముఖ నాయకులలో ఒకడైన నానాసాహెబ్ జాతినుద్దేశించి రాసిన లేఖలో ఈ విధంగా పేర్కొన్నాడు. " తిరుగుబాటును అణచగల శక్తి బ్రిటిష్ వారికి లేదు. గూర్ఖా సైనికులు, స్థానికరాజుల సహకారంతో మాత్రమే బ్రిటిష్ వారు తిరుగుబాటును అణచివేయగలిగారు".

### బ్రిటిష్ తొత్తులైన హిందురాజులకు సావర్కర్ మద్దతు

దేశంలో బ్రిటిష్ వారికి లొంగిపోయి పరిపాలిస్తున్న హిందురాజులకు సావర్కర్ గట్టి మద్దతుదారుగా ఉన్నాడు. 1857 తిరుగుబాటును అణచివేయటానికి మద్దతు ఇచ్చిన వారినే బ్రిటిష్ వారు సంస్థానాధీశులుగా కొనసాగనిచ్చారు. ఈ సంస్థానాధీశులు ప్రజలపై అనేక విధాలుగా దోపిడీ, అత్యాచారాలు కొనసాగించేవారు. హత్యలు, అత్యాచారాలు, వికాలాంగులను చేయటం జరుగుతుండేది. ప్రజాస్వామిక, మానవ హక్కులు కావాలని ఆందోళన చేస్తున్న రాజకీయ కార్యకర్తలను తీవ్ర నిర్బంధానికి గురిచేసేవారు. జాతీయోద్యమ కారులపై కేసులు పెట్టేవారు. తమ సంస్థానాలలో త్రివర్ణ పతాకాన్ని ఎగురనిచ్చేవారు కాదు. మైసూరు సంస్థానంలో మువ్వన్నెల జెండాను ఎగురవేసి, శాల్యూట్ చేసినందుకు హిందురాజు సైనికులు జరిపిన కాల్పులలో 26 మంది చనిపోగా, అనేకమంది వికలాంగులు కావటం హిందురాజుల పాలనలో ఉన్న ప్రాంతాలలో జరుగుతున్న దారుణ హింసాకాండకు ఒక ఉదాహరణ మాత్రమే. హిందు మహాసభ ఈ హత్యాకాండను ఖండించకపోగా దేశభక్తులను చంపించిన సంస్థానాధీశునికి మద్దతు తెలిపింది. సంస్థానాలను పాలిస్తున్న రాజులు స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామిక విలువలను అమలుచేయటానికి సిద్ధం కాలేదు. తమ నిరంకుశ పరిపాలనను కొనసాగించాలనే కోరికతో వారు ఉన్నారు. హిందు మహాసభ, ఆర్ఎస్ఎస్, సంస్థానాధీశుల మధ్య సంబంధాలు ఉన్నాయి. గాంధీజీ హత్యానంతరం ఆర్ఎస్ఎస్, హిందు మహాసభకు సన్నిహితంగా ఉండే గ్వాలియర్, అల్వార్, భరత్‌పూర్ తదితర సంస్థానాలలో స్వీట్లు పంచుకున్నారు.

భారతీయుల, వారిలో అధికసంఖ్యలో ఉన్న హిందువుల కష్టాలను తొలగించాలంటే బ్రిటీష్ పాలనను, వారి తాబేదారులుగా ఉన్న స్థానిక పాలకులను తొలగించాలి. కాని ఆర్ఎస్ఎస్, హిందు మహాసభలు స్థానిక నిరంకుశ పాలకులతో కుమ్మక్కై వారి పాలనను

> **“ బ్రిటిష్ వారు తమ ప్రయోజనాలకు అనుగుణంగా సావర్కర్ వినియోగించుకున్నారు. 1911 జూన్‌లో అండమాన్ జైలుకు తీసుకు వెళ్ళిన కొద్ది నెలల్లోనే క్షమాభిక్ష కోరుతూ బ్రిటిష్ వారికి పిటీషన్ పెట్టుకున్నాడు. 1920వ సంవత్సరం వరకూ మరో నాలుగు పిటీషన్లు పెట్టుకున్నాడు. సావర్కర్ జైలులో ఉంటేనే విప్లవకారులను అణచివేయటం సులభం అని బ్రిటీష్ వారు భావించారు తరువాత జాతీయోద్యమాన్ని చీల్చడానికి చక్కగా ఉపయోగపడతాడని ఆయనను విడుదల చేశారు. ”**

పునరుద్ధరించాలని డిమాండ్ చేశాయి. ఆ విధంగా ప్రజలకు వ్యతిరేకంగా స్థానిక రాజులకు, వారికి రక్షణగా ఉన్న బ్రిటీష్ వారికి మద్దతు తెలిపారు. హిందు మహాసభ, స్థానిక పాలకులకు మధ్య ఉన్న అనుబంధం జాతీయోద్యమానికి వారి వ్యతిరేకతను స్పష్టం చేస్తున్నది. సంస్థానాలలో ప్రజాస్వామిక హక్కులను అమలుచేయాలని కాంగ్రెస్ ఆందోళన ప్రారంభించినపుడు హిందు మహాసభ ఆ ఉద్యమాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది.

అండమాన్ జైలుకు తీసుకొచ్చిన వేలాదిమంది విప్లవకారులు, స్వాతంత్ర్యపోరాట యోధులను జైలులో తీవ్రమైన హింసలకు గురిచేశారు. భారతదేశంలో బ్రిటిష్ పాలనను అంతం చేయటం లక్ష్యంగా బెంగాల్‌లో ఏర్పడిన అనుశీలన్ సమితి సభ్యుడైన చక్రవర్తిని జైలులో పెట్టిన చిత్రహింసలను ఈ విధంగా వర్ణించారు. “చక్రవర్తికి జైలులో కొబ్బరికాయలపై పీచుతీసే పనిని అప్పగించారు. ఆయన తనకు ఆస్మా ఉన్నదని, అనారోగ్యంగా ఉన్నానని జైలర్‌కు చెప్పగా ‘ ‘ఇది అండమాన్’ అని జైలర్ కఠినంగా బదులిచ్చాడు. ఆయన ఒకరోజు ఆస్మాతో ఇబ్బంది పడుతుండగా పక్కవారు కొందరు ఆయనను తీసుకెళ్ళి ఆసుపత్రిలో చేర్చారు. డాక్టరు ఆయనను ఇన్ పేషెంట్‌గా చేర్చుకున్నాడు. మరుచటి రోజు చక్రవర్తి ఆసుపత్రిలో ఉన్నాడన్న విషయం తెలుసుకున్న జైలర్ ఆగ్రహోదగ్రుడయాడు. తక్షణమే ఆయనను ఆసుపత్రి నుండి పంపాలని ఆదేశించటంతో పాటు, ‘ దేశంలో నువ్వు అశాంతిని సృష్టించావని తెలియదా’, నీవు ఇపుడు ఇక్కడ పాలు తాగాలని ప్రయత్నిస్తున్నావు’ అని చక్రవర్తిని దూషించాడు. చక్రవర్తి ఆరోగ్యం పూర్తిగా దిగజారిపోయింది. ఆ రాత్రంతా ఆయన దగ్గుతూనే ఉన్నాడు. ఉమ్మివేసుకోవటానికి పాత్ర అడిగితే నిరాకరించారు. రాత్రంతా దగ్గిన తర్వాత ఆయన నిద్రపోగా, ఆయన బతికి ఉన్నాడో, చనిపోయాడో తెలుసుకోవటం కోసం జైలర్ తరచుగా ఆయన శరీరాన్ని తాకి చూసేవాడు”. విప్లవకారులు, స్వాతంత్ర్య సమరయోధులను అండమాన్ జైలులో ఇంత నిర్దాక్షిణ్యంగా శిక్షిస్తున్న రోజులలో బ్రిటిష్ ప్రభుత్వం నుండి సావర్కర్ 37 సంవత్సరాల శిక్షాకాలానికి మినహాయింపు పొందాడు!

**క్షమాభిక్ష పిటీషన్‌లపై తప్పుడు ప్రచారం**

తనను చిత్రహింసలు పెడుతున్న, రాజకీయ కార్యాచరణకు దూరం చేసిన బ్రిటిష్ జైలు నుండి బయటపడి, రాజకీయాలలో, జాతీయోద్యమంలో పాల్గొని దేశవిముక్తి కోసం పనిచేయాలని సావర్కర్ భావించాడని, అందుకోసం క్షమాభిక్ష పిటీషన్‌ను సాకుగా వినియోగించుకున్నాడని ఆయన అనుయాయులు ప్రచారం చేస్తున్నారు. తనను విడుదల చేయటం కోసం బ్రిటిష్ ప్రభుత్వం విధించిన షరతులకు అంగీకరిస్తూ 1923 డిసెంబర్ 27వ తేదీన సావర్కర్ సంతకం చేశాడు. 1924 జనవరి 24వ తేదీన ఆయనను విడుదల చేశారు. సావర్కర్‌ను తిరిగి 1934లో మరోసారి జైలులో నిర్బంధించినపుడు ఆ సంవత్సరం మే 8వ తేదీన బ్రిటిష్ వారికి మరొక క్షమాభిక్ష పిటీషన్‌ను ఇచ్చాడు. బ్రిటిష్ అధికారిపై కాల్పులు జరిపిన వారితో తనకు సంబంధం లేదని, ప్రభుత్వం యొక్క ముందస్తు అనుమతి లేకుండా తాను ఎటువంటి రాజకీయ, సామాజిక కార్యకలాపాలలోనూ పాల్గొనబోనని పిటీషన్‌లో పేర్కొన్నాడు.

బ్రిటిష్ వారు తమ ప్రయోజనాలకు అనుగుణంగా సావర్కర్ వినియోగించుకున్నారు. 1911 జూన్‌లో అండమాన్ జైలుకు తీసుకు వెళ్ళిన కొద్ది నెలల వ్యవధిలోనే అదే సంవత్సరంలో క్షమాభిక్ష కోరుతూ బ్రిటిష్ వారికి పిటీషన్ పెట్టుకున్నాడు. 1920వ సంవత్సరం వరకూ మరో నాలుగు పిటీషన్లు పెట్టుకున్నాడు. కాని అపుడు బ్రిటిష్ వారు సావర్కర్‌ను విడుదల చేయలేదు. సావర్కర్‌లో వచ్చిన మార్పు తెలియని దేశ, విదేశాలలోని విప్లవకారులు సావర్కర్ పేరు చెప్పుకొంటూ విప్లవ కార్యకలాపాలలో పాల్గొంటున్నారు. సావర్కర్ క్షమాభిక్ష కోసం బ్రిటిష్ అధికారులతో చర్చలు జరిపినపుడు అదే విషయాన్ని సావర్కర్‌తో చెప్పారు. సావర్కర్ జైలులో ఉంటేనే విప్లవకారులను అణచివేయటం సులభం అని బ్రిటీష్ వారు భావించారు. కాబట్టి సావర్కర్‌ను జైలులోనే ఉంచారు. 1920లో కాంగ్రెస్ ప్రజా కార్యక్రమం తీసుకొని వివిధ వర్గాలు, తరగతుల ప్రజలను సమీకరించటం ప్రారంభించిన తర్వాత జాతీయోద్యమాన్ని చీల్చటం కోసం బ్రిటీష్ వారు చేస్తున్న ప్రయత్నాలకు సావర్కర్ చక్కగా ఉపయోగపడతాడు. కాబట్టి ఆయనను తక్షణమే విడుదల చేశారు.

1913లో ఆయన పెట్టుకున్న క్షమాభిక్ష పిటీషన్‌ను బ్రిటిష్ ప్రభుత్వం తిరస్కరించటమే ఆయన వీరత్వానికి నిదర్శనమని హిందుత్వవాదులు ప్రచారం చేస్తున్నారు. తనకు విధించిన 50 సంవత్సరాల శిక్షలో సావర్కర్ 13 సంవత్సరాలు మాత్రమే జైలులో గడిపాడు. కాని సావర్కర్‌తో పాటు వందలాది మంది విప్లవకారులు తీవ్రమైన హింసను, కష్టాలను భరిస్తూ తమకు విధించిన శిక్షాకాలాన్ని పూర్తి చేశారు. అసమానమైన త్యాగాలు చేసి అమరత్వం పొందిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, అష్ఫఖుల్లాఖాన్, చంద్రశేఖర్ ఆజాద్, రాంప్రసాద్ బిస్మిల్, రోషన్‌సింగ్, అసంఖ్యాకులైన గదర్ పార్టీ వీరులు, బెంగాల్ “టెర్రరిస్టులు”, తదితరులు బ్రిటిష్‌వారిని క్షమాభిక్ష అడగలేదు. బ్రిటిష్‌వారిని దేశం నుండి తరిమివేయాలన్న తమ కార్యక్రమాన్ని ఏ మాత్రం సడలించుకోలేదు. తమ వ్యక్తిగత స్వేచ్ఛ కోసం దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని పణంగా పెట్టటానికి వారు అంగీకరించలేదు.

జైలులో బ్రిటిష్ అధికారుల హింసాత్మక ప్రవర్తన, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించకపోవటం, పూర్తిగా నాసిరకం ఆహారం పెట్టటానికి నిరసనగా ఖైదీలు ఆందోళన చేయాలని నిర్ణయించుకున్నారు. తన క్షమాభిక్ష పిటీషన్‌లు, అందుకనుగుణంగా బ్రిటిష్ వారితో సామరస్యంగా వ్యవహరించటం వలన తనకు వచ్చిన రాయితీలు పోతాయని సావర్కర్ ఆ పోరాటంలో పాల్గొనలేదు. సావర్కర్, ఆయనకు అనుయాయులుగా ఉన్న కొందరు పాల్గొనకపోవటంతో ఆ పోరాటాన్ని గురించి తప్పుడు ప్రచారం చేయటం, దానిని అణచివేయటం బ్రిటిష్ ప్రభుత్వానికి సులభమైంది. క్షమాభిక్ష పిటీషన్‌లు ఇచ్చిన తర్వాత బ్రిటిష్‌వారు జైలులో సావర్కర్‌కు గుమాస్తా పని ఇచ్చారు. తర్వాత ఆయిల్ డిపోలో ఫోర్‌మెన్ పని ఇచ్చారు.

"భారతీయుల ఐక్యతను విచ్ఛిన్నం చేయటానికి ముస్లీం లీగ్ వలెనే సావర్కర్ కూడా పూనుకున్నాడు. వలస పాలకులైన బ్రిటీష్ వారిని వ్యతిరేకించటమనేది ఆయన విధానాలలో లేదు. ముస్లీంలు, క్రైస్తవులు, కాంగ్రెస్ నాయకులు ఆయన శత్రువులు. బ్రిటీష్ వారు ఆయన శత్రువుల జాబితాలో లేరు. భారత ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేయటం ద్వారా తమ అధికారాన్ని కాపాడుకోవాలని ఎత్తులు వేస్తున్న బ్రిటీష్ వారికి సావర్కర్ విధానం బాగా ఉపయోగపడింది."

### సావర్కర్ నుండి స్ఫూర్తిపొందిన ముస్లీం మతోన్మాదులు

గాంధి, నెహ్రూల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ముస్లింలీగ్ మతోన్మాద రాజకీయాలకు లొంగిపోతున్నదని, దీనిని అడ్డుకొనే రాజకీయ పార్టీ ఏదీలేకపోవటంతో సావర్కర్ హిందువులను సమీకరించటానికి పూనుకున్నాడని ప్రజలను నమ్మించటానికి సంఘ్ పరివార్ ప్రయత్నం చేస్తున్నది. చరిత్రను పరిశీలించినపుడు సావర్కర్ తన చర్యల ద్వారా ముస్లీంలీగ్ ప్రచారం చేసిన రెండుజాతుల సిద్ధాంతానికి తాత్విక భూమికను సమకూర్చాడని స్పష్టమౌతున్నది. అంతేకాక ముస్లీంలీగ్ భాగస్వామ్యంతో ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వాలలో ఆయన నాయకత్వంలోని హిందు మహాసభ భాగస్వామి అయింది. ముస్లీంలీగ్, ఇతర ముస్లీం మతోన్మాద సంస్థల వలెనే సావర్కర్ కూడా రెండు జాతుల సిద్ధాంతాన్ని ప్రచారం చేశాడు. భారతదేశంలో పరస్పరం భిన్నమైన రెండు జాతులు నివసిస్తున్నాయని 1937లో అహ్మదాబాద్‌లో జరిగిన హిందు మహాసభ సమావేశంలో ఆయన చెప్పాడు. 1940లో లాహోర్‌లో జరిగిన ముస్లీంలీగ్ మహాసభలో జిన్నా రెండు జాతుల తీర్మానాన్ని ప్రవేశపెడుతూ సావర్కర్ మాటలను ఉదహరించాడు. 1943, ఆగస్టు 15న నాగపూర్‌లో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన ఈ విధంగా చెప్పాడు. "జిన్నా చెబుతున్న రెండు జాతుల సిద్ధాంతంతో నాకేమీ విభేదం లేదు. హిందువులు ఒకజాతి. హిందువులు, ముస్లీంలు వేరువేరు జాతులన్నది చారిత్రక వాస్తవం". ప్రత్యేకంగా హిందువులకు ఒకదేశం ఉండాలన్న వాదనను బలపరుస్తూ ఆయన ఈ విధంగా చెప్పాడు. " భూమండలంలో హిందువులకు ప్రత్యేకదేశం ఉండాలి. ఒక బలమైన ప్రజల వారసులుగా, హిందువులుగా మనం అభివృద్ధి చెందాలి''. హిందు మతోన్మాదం, జాతీయవాదం ఒకటేనని, హిందువుల ప్రయోజనాలకు, జాతి ప్రయోజనాలకు మధ్య వైరుధ్యం లేదనిచెప్పాడు. హిందువులందరికీ హిందు మహాసభ, ముస్లీంలందరికీ ముస్లీంలీగ్ ప్రాతినిధ్యం వహిస్తున్నాయని ప్రచారం చేశాడు. జాతీయోద్యమాన్ని విచ్ఛిన్నం చేయటం కోసం బ్రిటిష్ ప్రభుత్వం హిందువుల ప్రతినిధిగా హిందు మహాసభను, ముస్లీంల ప్రతినిధిగా ముస్లీంలీగ్‌ను గుర్తించింది. ఆ విధంగా గుర్తించినందుకు బ్రిటీష్ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపాడు. ముస్లీంల ప్రయోజనాలను




మహాత్మాగాంధీ, ఆయనను హత్యచేసిన హిందూమతోన్మాది నాథూరామ్ గాడ్సే

ముస్లీంలీగ్ వ్యక్తీకరిస్తుందని ప్రచారం చేస్తున్న బ్రిటీష్ ప్రభుత్వ విధానానికి అనుగుణంగా ఆయన వ్యవహరించాడు. అదేవిధంగా హిందువుల ప్రతినిధిగా హిందు మహాసభను గుర్తించాలని చెప్పాడు.

సావర్కర్ ఈ విధానాన్ని భాషలకు కూడా వర్తింపచేశాడు. హింది హిందువుల భాష అని, ఉర్దు ముస్లీంల భాష అని ముస్లీంలీగ్ నాయకుల వలెనే ఆయన కూడా ప్రచారం చేశాడు. ముస్లీంలీగ్‌తో ఎటువంటి సంబంధాలు పెట్టుకోరాదని 1942లో కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. సావర్కర్ నాయకత్వంలోని హిందు మహాసభ సింధ్ ప్రావిన్స్, బెంగాల్‌లలో ముస్లీంలీగ్ నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వాలలో భాగస్వామి అయింది. దీనిని సావర్కర్ బలపరిచాడు. సావర్కర్, హిందు మహాసభ మరో ప్రముఖ నాయకుడైన మూంజీలు పంజాబ్ ప్రభుత్వంలో చేరాల్సిందిగా ముస్లీంలీగ్‌ను ఆహ్వానించారు. వివిధ ప్రావిన్స్‌లలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ముస్లీంగ్రూపులతో కలిసి తమ పార్టీ వ్యవహరించాలని సావర్కర్ చెప్పాడు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా హిందు, ముస్లీం మతోన్మాదులు ఇద్దరూ కలిసి వ్యవహరించారని ఈ వివరాలు స్పష్టం చేస్తున్నాయి.

భారతీయుల ఐక్యతను విచ్ఛిన్నం చేయటానికి ముస్లీంలీగ్ వలెనే సావర్కర్ కూడా పూనుకున్నాడు. వలస పాలకులైన బ్రిటీష్ వారిని వ్యతిరేకించటమనేది ఆయన విధానాలలో లేదు. ముస్లీంలు, క్రైస్తవులు, కాంగ్రెస్ నాయకులు ఆయన శత్రువులు. బ్రిటీష్ వారు ఆయన శత్రువుల జాబితాలో లేరు. భారత ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేయటం ద్వారా తమ అధికారాన్ని కాపాడుకోవాలని ఎత్తులు వేస్తున్న బ్రిటీష్ వారికి సావర్కర్ విధానం బాగా ఉపయోగపడింది.

సావర్కర్ క్రైస్తవ వ్యతిరేక ప్రచారం కూడా చేశాడు. క్రైస్తవులు హిందువులను మతం మార్చుకోమని ప్రోత్సహిస్తున్నారని, మతం మారితే జాతి కూడా మారుతుందని చెప్పాడు. హిందువులు క్రైస్తవ విద్యాలయాలు, ఆసుపత్రులను బహిష్కరించాలని, క్రైస్తవమత ప్రమాదం నుండి దేశాన్ని రక్షించాలని ప్రచారం చేశాడు. కాంగ్రెస్‌ను గుడ్డిగా వ్యతిరేకించిన

> "హిందు, ముస్లీం మతోన్మాదాలను సన్నిహితంగా పరిశీలిం చిన డా. బి ఆర్ అంబేద్కర్ ఈ విధంగా చెప్పాడు," ఒకరినొకరు వ్యతిరేకించుకున్నట్లు కనిపిస్తున్న జిన్నా, సావర్కర్‌లు ఆశ్చర్యకరంగా రెండు జాతుల సిద్ధాంతంపై ఒకరినొకరు పూర్తిగా బలపరచుకొంటున్నారు. తాము వేర్వేరు జాతులనే విషయంలో ఇరువురూ గట్టిగానే పట్టుపడుతున్నారు. రెండు దేశాలుగా ఉండే విషయంలో షరతులు, ఇతర అంశాలపైనే పట్టుపడుతున్నారు". "

సావర్కర్ సిక్కులు ప్రత్యేకజాతి అని, వారికి ప్రత్యేక సిక్కుదేశం ఉండాలని చెప్పాడు.

హిందు, ముస్లీం మతోన్మాదాలను సన్నిహితంగా పరిశీలించిన డా. బి ఆర్ అంబేద్కర్ ఈ విధంగా చెప్పాడు," ఒకరినొకరు వ్యతిరేకించుకున్నట్లు కనిపిస్తున్న జిన్నా, సావర్కర్‌లు ఆశ్చర్యకరంగా రెండు జాతుల సిద్ధాంతంపై ఒకరినొకరు పూర్తిగా బలపరచుకొంటున్నారు. తాము వేర్వేరు జాతులనే విషయంలో ఇరువురూ గట్టిగానే పట్టుపడుతున్నారు. రెండు దేశాలుగా ఉండే విషయంలో షరతులు, ఇతర అంశాలపైనే పట్టుపడుతున్నారు". ముస్లీంల విషయంలో వ్యవహరిస్తున్న తీరుపై సావర్కర్‌ను ఇలా ప్రశ్నించాడు," ముస్లీంలు ఒక ప్రత్యేకజాతి అని సావర్కర్ అంగీకరిస్తున్నాడు. వారికి ప్రత్యేక జెండా ఉండటాన్ని అంగీకరిస్తున్నాడు. కాని ముస్లీంజాతికి ప్రత్యేకంగా ఒక దేశం ఉండటాన్ని వ్యతిరేకిస్తున్నాడు. హిందుజాతికి ప్రత్యేకంగా ఒకదేశం ఉండటాన్ని అంగీకరించినపుడు, ముస్లీంలు తమజాతికి ప్రత్యేకంగా ఒకదేశం ఉండాలనే వాదనను ఆయన ఎలా వ్యతిరేకిస్తాడు". హిందువులకు ప్రత్యేకహక్కులుండాలని, ముస్లీంలు హిందువులకు లంగివుండాలంటున్న సావర్కర్ విధానాలతో దేశం విచ్ఛిన్నమయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నదని ఆయన చెప్పాడు.

**మనుస్మృతిని అమలుచేయాలన్న సావర్కర్**

సావర్కర్ హేతువాద దృక్పథంతో వ్యవహరించాడని, అంటరానితనాన్ని నిర్మూలించాలని చెప్పాడని, శాస్త్రీయ దృక్పథాన్ని అనుసరించాడని ప్రచారం చేస్తున్నారు. కాని వాస్తవంగా సావర్కర్ మనుస్మృతిని బలపరిచాడు. మనుస్మృతి హిందువులకు పవిత్రగ్రంథం అని చెప్పాడు. " వేదాల తర్వాత మనుస్మృతి హిందుజాతి పూజించే గ్రంథం. మనుస్మృతి పురాతన కాలం నుండి మన సంస్కృతి-సాంప్రదాయాలు, ఆలోచన,



భగత్ సింగ్

ఆచరణలకు మార్గదర్శిగా ఉంది. మనజాతి మానసిక చైతన్యం, పవిత్రభావంతో ముందుకు సాగటానికి ఈ గ్రంథం శతాబ్దాల నుండి మార్గదర్శిగా ఉంది. ఈ రోజుకు కూడా కోట్లాది మంది హిందువులు తమ జీవితాలలో, ఆచరణలో మనుస్మృతిలోని నిబంధనలనే అమలుచేస్తున్నారు. ఈ రోజు మనుస్మృతి హిందువుల చట్టం. అది మౌలికమైనది" అని సావర్కర్ చెప్పాడు. మనుస్మృతిలోని అంశాలను చట్టాలుగా అమలు చేయాలన్న సావర్కర్ కలలు ఎపుడు నెరవేరితే అపుడు దేశంలో దళితులు, మహిళల అభివృద్ధికి తలుపులు మూసుకుపోతాయి. దళితులు, మహిళలను గురించి మనుస్మృతిలో చెప్పిన అంశాలను పరిశీలిస్తే వారి జీవితాలు ఏ స్థితికి దిగజారతాయో స్పష్టమౌతుంది.

**మనుస్మృతి- దళితులు, మహిళలు**

బ్రహ్మ నోటినుండి బ్రాహ్మణులు, భుజాల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు పుట్టారని మనుస్మృతి చెబుతున్నది. పై మూడు కులాలకు సేవచేసే ఒకే కర్తవ్యాన్ని దేవుడు శూద్రులకు నిర్దేశించాడు. దిగువ కులాలకు చెందిన వ్యక్తి ఉన్నత కులాలకు చెందిన వారిని అవమానిస్తూ మాట్లాడినట్లైతే అతని నాలుక కోయాలి. శూద్రులు అహంకారంతో బ్రాహ్మణులకు తమ కర్తవ్యాన్ని గుర్తు చేయటానికి ప్రయత్నిస్తే రాజు అతని నోట్లో, చెవుల్లో మరుగుతున్న నూనె పోయించాలి. దిగువ కులాల వ్యక్తి ఉన్నత కులాలకు చెందిన వ్యక్తులతో సమానస్థాయి ఆసనంలో కూర్చుంటే రాజు అతని మోకాళ్ళ చిప్పలు తొలగించి, దేశబహిష్కారశిక్ష విధించాలి. బ్రాహ్మణుల పేరులోని మొదటి భాగం గౌరవాన్ని సూచిస్తుంది. క్షత్రియుని పేరులో మొదటి భాగం అధికారాన్ని సూచిస్తుంది. వైశ్యుల పేరులోని మొదటి భాగం సంపదను సూచిస్తుంది. శూద్రుల పేరును గురించి పట్టించుకోవలసిన పనిలేదని చెప్పింది. బ్రాహ్మణుల పేరులోని రెండవ భాగం సంతోషాన్ని, క్షత్రియుల పేరులోని రెండవ భాగం రక్షణను, వైశ్యుల పేరులోని రెండవభాగం అభివృద్ధిని, శూద్రుల పేరులోని రెండవభాగం సేవలను గురించి తెలియచేస్తాయని పేర్కొంది.

బ్రాహ్మణులకు సేవ చేయటమే శూద్రులకు అతిగొప్ప వృత్తి. దీనితో పాటు మరేమి చేసినా అది అతనికి ఫలితాన్నివ్వదు. వారి ఆహారంలో మిగిలిన భాగాలు, వారి పాతబట్టలు, వారి ధాన్యంలోని పనికిరాని భాగం, వారి కుటుంబంలో వినియోగించుకున్న పాత సామాన్లను వారికి ఇవ్వాలి. తాను ధనం సంపాదించుకోగలిగినప్పటికీ శూద్రుడు ధనం సంపాదించరాదు. సంపదను పోగుచేసుకున్న శూద్రుడు బ్రాహ్మణులకు చాలా కష్టాన్ని కలిగిస్తాడు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల వలన శూద్ర మహిళ పిల్లలను పొందితే వారికి వంశపారంపర్యంగా వస్తున్న ఆస్తులపై హక్కులు రావు. తండ్రి ఏమిస్తే అదే అతని ఆస్తి అవుతుంది.

**మహిళలను గురించి:** "ఒక బాలిక, యువతి, వయసు పైబడిన మహిళ తన స్వంత ఇంటిలోనైనప్పటికీ స్వతంత్రంగా ఏమీచేయరాదు. ఇంద్రియ సౌఖ్యాలను పొందాలని మహిళలు భావిస్తే వారు ఒకరి అదుపులో ఉండాలి. మహిళను బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో పుత్రులు రక్షించాలి. మహిళ ఎప్పుడూ స్వతంత్రంగా ఉండరాదు. రాత్రైనా, పగలైనా మహిళలు తమ కుటుంబంలోని పురుషుల రక్షణలో ఉండాలి. మహిళలు ఎప్పుడూ

స్వాతంత్ర్యానికి అర్హులు కారు. మహిళలకు ప్రత్యేకంగా ఉండే చెడ్డ ఆలోచనలకు వ్యతిరేకంగా నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఆ విధంగా లేకపోతే రెండు కుటుంబాలకు వారు అపఖ్యాతిని తెస్తారు. అన్ని కులాలలోనూ దీనిని అత్యంత ప్రధానమైన కర్తవ్యంగా భావించి, బలహీనమైన భర్తలు కూడా వారి భార్యలను కాపలా కాయటానికి పూనుకోవాలి. తనభార్యను ఎవరైతే జాగ్రత్తగా కాపలా కాస్తాడో అతను తన పిల్లలు, తన కుటుంబం, తన స్వచ్ఛతను, ఉన్నత స్థాయికి చేరే అవకాశాలను కాపాడుకుంటాడు. ఒకని భార్య ఇతరుల సంపర్కానికి గురైతే ఆమె కనే బిడ్డ కూడా అపవిత్రమౌతుంది. కాబట్టి తనబిడ్డను స్వచ్ఛంగా ఉంచుకోవటం కోసం అతను తన భార్యను జాగ్రత్తగా కాపలా కాయాలి.

"ఎవరూ తనభార్యను బలవంతంగా ఎల్లప్పుడూ కాపలా కాయలేడు. ఈ కింది పద్ధతులను అవలంభించటం ద్వారా అతను కాపలా కాయవచ్చు. గృహానికి సంబంధించిన అన్నింటినీ పరిశుభ్రంగా ఉంచిన తర్వాత, మతపరమైన కార్యక్రమాలను పరిపూర్తి చేసిన తర్వాత, తనకు ఆహారాన్ని సిద్ధం చేయటం, ఇంటిని, పాత్రలను తగిన విధంగా ఉంచిన తర్వాత తన కుటుంబానికి అవసరమైన వనరులను సమీకరించటంలో భాగస్వామిని చేయవచ్చు. ఈ ప్రపంచంలో వారినెంతగా కాపలా కాసినప్పటికీ భర్తలపై భార్యలకు ఉన్న భావాల వలన, వివిధ సందర్భాలలో మార్పులు చెందే భావావేశాల వలన, సహజంగానే వారికి ఉండే హృదయలేమి వలన వారు తమ భర్తలకు విధేయంగా ఉండరు. మహిళలను సృష్టించేటపుడు మనువు వారికి పడుకోవటం కోసం మంచం, ఆభరణాలు, తమస్థానంపై ప్రేమను కల్పించాడు. అశుభ్రమైన కోరికలు, కోపం, అగౌరవం, అసూయ, చెడు ప్రవర్తనను వారికి కేటాయించాడు. పవిత్ర గ్రంథాలలో చెప్పిన ఉన్నతమైన కార్యక్రమాలను మహిళలు నిర్వహించకూడదని చట్టంలో పేర్కొన్నారు. వేదాలపై మహిళలకు తగినంత పట్టు, అవగాహన లేనందున వారు అబద్ధాలంత కలుషితంగా ఉంటారు".

సావర్కర్ జీవితాంతం మనువు చెప్పిన సూత్రాలకు కట్టుబడి ఉన్నాడు. 1940లో మధురలో జరిగిన హిందు మహాసభ 22వ సమావేశంలో ఈ విధంగా పేర్కొన్నాడు." మనువు హిందువులకు చట్టాలను ఇచ్చాడు.మానవ సంబంధమైన పాఠాలను మరొకసారి మనం పునరర్థం చేసుకొంటే హిందుజాతి మరొకసారి అజేయమైనదిగా రుజువు చేసుకొంటుందని చెప్పాడు. సావర్కర్ అంటరానివారితో సామూహిక భోజనాలను ఏర్పాటు చేశాడని, వారి నివాస గృహాలకు వెళ్ళాడని ప్రచారం చేస్తున్నారు. కంటితుడుపుగా జరిగిన ఇటువంటి కార్యక్రమాలలో కూడా హిందు మహాసభను భాగస్వామిని చేయటం కాకుండా తన వ్యక్తిగతస్థాయిలో పాల్గొన్నాడు.

❝ గాడ్సే, అతనితో ఉన్న సావర్కర్ అనుయాయులు గాంధిజీని హత్యచేసిన కేసులో సందేహరహితమైన సాక్ష్యాలు లేవని శిక్షవిధించకుండా వదిలేసిన ఒకేఒక్కడు సావర్కర్. 1938-46 మధకాలంలో సావర్కర్, గాడ్సేల మధ్య నడచిన లేఖలు సావర్కర్‌ను గాడ్సే తన గురువుగా అంగీకరించాడని స్పష్టం చేస్తున్నాయి. కాని 1948, నవంబరు 20వ తేదీన సావర్కర్ కోర్టులో ఇచ్చిన సాక్ష్యంలో గాడ్సేతో తనకు ఈ మధ్యకాలంలోనే పరిచయం అయిందని చెప్పాడు! ఎంతనయవంచన!! ❞



ఇండియన్ నేషనల్ ఆర్మీ పేరేడ్‌లో సుభాష్ చంద్రబోస్

1939లో దళితుల దేవాలయ ప్రవేశాన్ని సనాతన హిందువులు వ్యతిరేకిస్తున్నపుడు అంటరానివారికి దేవాలయ ప్రవేశం కోసం రూపొందిస్తున్న బిల్లుకు తాము మద్దతివ్వబోమని, ఉన్నత కులాల వారి సెంటిమెంటును దెబ్బతీయబోనని చెప్పాడు.

**గాంధిజీ హత్యకేసు**

గాడ్సే, అతనితో ఉన్న సావర్కర్ అనుయాయులు గాంధిజీని హత్యచేసిన కేసులో సందేహరహితమైన సాక్ష్యాలు లేవని శిక్ష విధించకుండా వదిలేసిన ఒకేఒక్కడు సావర్కర్. 1938-46 మధకాలంలో సావర్కర్, గాడ్సేల మధ్య నడచిన లేఖలు సావర్కర్‌ను గాడ్సే తన గురువుగా అంగీకరించాడని స్పష్టం చేస్తున్నాయి. కాని 1948, నవంబరు 20వ తేదీన సావర్కర్ కోర్టులో ఇచ్చిన సాక్ష్యంలో గాడ్సేతో తనకు ఈ మధ్యకాలంలోనే పరిచయం అయిందని చెప్పాడు! ఎంతనయవంచన!! ఈనాడు సావర్కర్‌ను తమ గురువుగా ప్రచారం చేసుకుంటున్న ఆర్ఎస్ఎస్ గాంధిజీ హత్యకేసు విచారణ సందర్భంలో సావర్కర్‌తో తమకు ఎటువంటి సంబంధం లేదని చెప్పింది. సావర్కర్ విషయంలో వ్యవహరిస్తున్న తీరుతో ఆర్ఎస్ఎస్ అవకాశవాదం బట్టబయలవుతున్నది. ప్రస్తుతం ఆర్ఎస్ఎస్ చెబుతున్న ప్రకారం సావర్కర్ గొప్ప జాతీయవాది, ఆయన బోధించిన హిందుత్వ భారత జాతీయవాదం. సావర్కర్ కలలు కన్న భారతదేశాన్ని తాము రూపొందిస్తామని చెబుతున్నారు. మరోవైపున చరిత్రను చూస్తే గాంధిజీ హత్యకేసులో సావర్కర్ ముద్దాయిగా ఉన్న సమయంలో తమకు ఆయనతో సంబంధాలు ఉన్నట్లు చెప్పుకోవటానికి ఆర్ఎస్ఎస్ సిద్ధపడలేదు. ఆర్ఎస్ఎస్ గతకొద్దికాలం నుండి గాంధిజీ హత్యలో సావర్కర్ ప్రమేయాన్ని తిరస్కరించటం ప్రారంభించింది. అయితే ఇక్కడొక సమస్య ఉంది. గాంధిజీ హత్యలో సావర్కర్ పాత్ర లేనట్లైతే 1948లో సావర్కర్‌తో తమకు సంబంధాలు

“ సావర్కర్ జాతి విద్వేషానికి, కులతత్వానికి పూర్తిగా బద్ధుడైన వ్యక్తి. ఆ వివరాలన్నీ ఆయనకు సంబంధించిన డాక్యుమెంట్లలో ఉన్నాయి. అవి బట్టబయలైతే ప్రజలు సావర్కర్‌ను వ్యతిరేకించ టంతో పాటు హిందుత్వకు తీవ్రమైన నష్టం జరుగుతుంది. ఆ రచనలు వెల్లడై, ఆయన భావాలేమిటో ప్రజలకు స్పష్టమైతే ఆయనను భారతప్రజలు ఆమోదించరు. అందువలననే ఆయన అనుయాయులు ఆ సమాచారం ప్రజలకు వెల్లడి కాకుండా లైబ్రరీలకే పరిమితం చేస్తున్నారు. ”

లేవని ఎందుకు చెప్పారన్న ప్రశ్నకు ఆ సంస్థ సమాధానం చెప్పాలి. ఆర్‌ఎస్‌ఎస్ ఎన్ని పిల్లిమొగ్గలు వేస్తున్నప్పటికీ గాంధీజీ హత్యలో సావర్కర్‌తో పాటు ఆర్‌ఎస్‌ఎస్‌కు కూడా ప్రమేయమున్నదని వల్లభాయ్ పటేల్ భావించాడు. 1948, సెప్టెంబరు 11వ తేదీన గోల్వాల్కర్‌కు రాసిన లేఖలో అదే విషయాన్ని ప్రస్తావించాడు. గాంధీజీ హత్య తర్వాత ఆర్‌ఎస్‌ఎస్ మిఠాయిలు పంచి పెట్టటంతో ఆ సంస్థపై ప్రజలకు వ్యతిరేకత పెరిగిందని పేర్కొన్నాడు.

గాంధి హత్యకేసులో సావర్కర్ దోషి అని రుజువు కాకపోవటంతో కోర్టు ఆయనను నిర్దోషిగా విడుదల చేసిందని, కానీ కొందరు ఇప్పటికీ సావర్కర్ దోషి అని ప్రచారం చేస్తుంటారని సంఘ్ పరివార్ ఆరోపిస్తున్నది. కానీ గాంధీజీ హత్యకేసుకు సంబంధించి ఈనాటికీ సమాధానం చెప్పాల్సిన అంశాలు ఉన్నాయి. న్యాయపరమైన బాధ్యతల రీత్యా చూసినపుడు అప్రూవర్‌గా మరిన దిగంబర్ బాడ్జె ఇచ్చిన సాక్ష్యం కుట్రలో సావర్కర్ భాగస్వామి అని స్పష్టం చేస్తున్నది. సావర్కర్‌ను సాక్ష్యం లేక విడుదల చేయలేదు. బాడ్జె ఇచ్చిన సాక్ష్యాన్ని రుజువు చేయటానికి తగిన ఆధారాలు లేకపోవటంతో సావర్కర్ విడుదలయ్యాడు. గాడ్సే సావర్కర్‌కు అత్యంత విధేయుడైన అనుచరుడని సావర్కర్ జీవితచరిత్ర రాసిన ధనుంజయ్ కీర్ పేర్కొన్నాడు. గాంధీజీ హత్యలో సావర్కర్‌తో పాటు ఆర్‌ఎస్‌ఎస్‌కు కూడా సంబంధం ఉన్నదని హోంమంత్రి సర్దార్ పటేల్‌కు స్పష్టమైంది. కాబట్టి ఆర్‌ఎస్‌ఎస్‌పై కూడా చర్యతీసుకోవటం అనివార్యం అయిందని పటేల్ ప్రకటించాడు.

ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించిన హెడ్గేవార్‌కు సావర్కర్‌తో సన్నిహిత సంబంధాలున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్‌ను ఏర్పాటు చేయటానికి ముందు హెడ్గేవార్ సావర్కర్‌తో విస్తృతంగా చర్చించాడు. 1940లో తను చనిపోవటానికి ముందు ఆర్‌ఎస్‌ఎస్‌కు తన తరువాతి సర్‌సంఘ్ చాలక్‌గా ఎం ఎస్ గోల్వాల్కర్‌ను నియమించాడు. గోల్వాల్కర్ సర్ సంఘ్‌చాలక్‌గా ఉన్న సమయంలో కూడా సావర్కర్‌కు, ఆయనకు మధ్య ఇదేవిధమైన సంబంధాలు కొనసాగాయి. 1923లో రత్నగిరి జైలులో ఉన్నపుడు సావర్కర్ హిందుత్వ గ్రంథాన్ని రచించాడు. ఈ పుస్తకాన్ని రహస్యంగా? బయటికి తరలించి ప్రచురించారు. వాస్తవంగా బ్రిటీష్ వారికి తెలియకుండా ఈ పుస్తకాన్ని బయటికి తరలించటం అసంభవం. మొదట రచయిత పేరు ఒక మరాఠా అని ముద్రించిన తర్వాత, వి వి కేల్కర్ అనే మహారాష్ట్ర న్యాయవాది సావర్కర్ పేరుతోనే ముద్రించాడు. ఇతంతా బ్రిటిష్ ప్రభుత్వానికి తెలుసు. అయినా పుస్తకాన్ని నిషేధించలేదు. సావర్కర్‌పై ఏవిధమై చర్యా తీసుకోలేదు.

హిందుయిజం అని సాధారణంగా చెబుతున్నదానితో హిందుత్వ ఏకీభవించదని సావర్కర్ చెప్పాడు. ఆయన ఈ వివరణ ఇచ్చేనాటికి హిందుయిజం, హిందుత్వల మధ్య వైవిధ్యం అంతరించింది. హిందుత్వ రాజకీయ హిందుయిజంగా రూపుదాల్చింది. ఆర్యుల వారసులైన హిందువులకు పితృభూమి, పుణ్యభూమి భారతదేశమేనని, ముస్లింలు, క్రైస్తవులను భారతీయులుగా పరిగణించరాదన్నాడు. ముస్లింలంతా ఏకీకృతంగా లేరని, వారిమధ్య అనేక వైవిధ్యాలున్నాయని, వారి సంస్కృతి, సాంప్రదాయాలు, అలవాట్లు, ఆచారాలు, నమ్మకాలు, భాష తదితరాలలో చాలా భిన్నత్వం ఉందని సావర్కర్‌కు తెలుసు. ఒకమతంగా ఇస్లాంను గురించి కూడా ముస్లింలలోని వివిధ ప్రాంతాల వారికి భిన్నమైన అభిప్రాయాలున్నాయి. పురాతన కాలం నుండి సిక్కులు, జైనులు, బౌద్ధులను హిందువులుగా భావిస్తున్నారని, కాబట్టి వారంతా హిందువులుగా పరిగణించబడతారని చెప్పాడు. జాతి, సంస్కృతి, జాతీయత రీత్యా వారంతా హిందువులేనని పేర్కొన్నాడు. ఉన్నతమైన జాతి ప్రజల నుండి హిందుజాతి అభివృద్ధి చెందిందని, చాతుర్వర్ణ వ్యవస్థ వలన మనుగడ సాగిస్తున్నదని, హిందువులు ప్రపంచాన్నంతా పాలిస్తారని సావర్కర్ వాదించాడు. సావర్కర్ ప్రవచించిన హిందుత్వలో హిట్లర్, ముస్సోలినీలను స్తుతించాడు. ఫాసిజాన్ని విమర్శించటాన్ని సావర్కర్ వ్యతిరేకించాడు. నెహ్రూ ఫాసిజాన్ని విమర్శించినపుడు సావర్కర్ వెంటనే నెహ్రూను విమర్శించాడు. యూదులకు వ్యతిరేకంగా హిట్లర్ చేస్తున్న హింసాత్మక కార్యకలాపాలన్నింటినీ సమర్థించాడు. భారతదేశంలోని ముస్లింలకు వ్యతిరేకంగా అలాగే వ్యవహరిస్తామని చెప్పాడు. దేశంలో నివసిస్తున్న మెజారిటీ జాతి ప్రజలతో దేశం ఏర్పడుతుందని చెప్పాడు. సావర్కర్ కులాన్ని సమర్థించాడు. కులవ్యవస్థ అమలు జరిగితేనే భారతదేశం బలమైన దేశంగా రూపొందుతుందని చెప్పాడు.

సావర్కర్ జాతి విద్వేషానికి, కులతత్వానికి పూర్తిగా బద్ధుడైన వ్యక్తి. ఆ వివరాలన్నీ ఆయనకు సంబంధించిన డాక్యుమెంట్లలో ఉన్నాయి. అవి బట్టబయలైతే ప్రజలు సావర్కర్‌ను వ్యతిరేకించ టంతో పాటు హిందుత్వకు తీవ్రమైన నష్టం జరుగుతుంది. ఆ రచనలు వెల్లడై, ఆయన భావాలేమిటో ప్రజలకు స్పష్టమైతే ఆయనను భారతప్రజలు ఆమోదించరు. అందువలననే ఆయన అనుయాయులు ఆ సమాచారం ప్రజలకు వెల్లడి కాకుండా లైబ్రరీలకే పరిమితం చేస్తున్నారు.

సూడో సెక్యులరిజం, ఓటుబ్యాంకు రాజకీయాలని లౌకికవాదులపై సంఘ్ పరివార్ దాడి చేస్తుంటుంది. చరిత్రను పరిశీలించినపుడు సంఘ్ పరివార్ చెందిన వారే సూడో జాతీయవాదులని, వారివే ఓటుబ్యాంకు రాజకీయాలని స్పష్టమౌతున్నది. హిందుత్వవాదులు వలసపాలన కాలంలో బ్రిటిష్‌వారితో రాజీపడి, జాతీయోద్యమాన్ని విచ్ఛిన్నం చేయటానికి పూనుకున్నారు. కేవలం ఓట్లకోసమే, అధికారం కోసమే మెజారిటీగా ఉన్న హిందువులను తమ వెనుక సమీకరించుకోవటానికి మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారు. తన భావజాలంతో సంబంధం లేనివారిని, తన కార్యక్రమాలను వ్యతిరేకించిన కాంగ్రెస్ అగ్రనాయకులలో ఒకడైన సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను తనవారిగా చెప్పుకొనేందుకు సంఘ్ పరివార్ చేస్తున్న ప్రయత్నం జాతీయోద్యమానికి, లౌకిక భారత జాతీయతకు దూరంగా ఉన్న ఆ సంస్థ దయనీయ స్థితిని తెలియజేస్తున్నది.

❋

ఈ మాసం ప్రత్యేకం

# జెఎన్‌యు ప్రజాస్వామ్య సంస్కృతిపై దాడి



రచయిత ప్రజాశక్తి ఢిల్లీ ప్రతినిధి

**జె జగదీష్**

ప్రతిష్ఠాత్మక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ (జెఎన్‌యు) మరోసారి దేశంలో చర్చనీయాంశంగా మారింది. అక్కడి విద్యార్థుల ఆందోళన దేశంలో ఉన్నత విద్యా సంస్థలకు, చివరి పార్లమెంట్‌కు కూడా చేరింది. ఆ ఆందోళన ఏదో జెఎన్‌యులో పెంచిన ఫీజులు తగ్గించాలని జరుగుతుందనుకోలేము. దేశంలోని ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం జరిగే ఉద్యమంగా చెప్పుకోవాలి. ఎందుకంటే కేంద్రంలోని మోడీ సర్కార్ గద్దెనెక్కిన తరువాత ప్రభుత్వ విద్యపై దాడి పెరిగింది. ఒకవైపు విద్యా రంగంలోని శాస్త్రీయ భావాలను తొక్కిపెట్టి, హిందూత్వ భావాలకు తలుపులు తెరుస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసి, ప్రైవేట్, కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తున్నది. ఈ ప్రభుత్వ హయంలో అన్ని వ్యవస్థలు ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. అందులో భాగంగానే విద్యారంగం కూడా తీవ్రమైన ప్రమాదాన్ని ఎదుర్కొంటుంది. దీనిపై జెఎన్‌యు విద్యార్థులు పోరాటం చేస్తున్నారు.

ప్రస్తుత మోడీ సర్కార్ జెఎన్‌యును లక్ష్యంగా చేసుకొని వికృత చర్యలకు పాల్పడుతున్నది. ఈ వికృత చర్యలకు వ్యతిరేకంగా అక్కడి విద్యార్థులు గొంతెత్తుతున్నారు. ఆ మాటకొస్తే దేశమంతా స్పందించే విధంగా ఉద్యమిస్తున్నారు. తమ యూనివర్శిటీపై జరుగుతున్న దాడి, ప్రభుత్వ విద్యా వ్యవస్థపై జరుగుతున్న దాడిగా దేశానికి వివరిస్తున్నారు. జెఎన్‌యు విద్యార్థుల ఆందోళన చాలా విద్యా సంస్థల విద్యార్థులకు ప్రేరణ, విద్యార్థి లోకానికి నూతనోత్సాహం ఇచ్చింది.

**జెఎన్‌యుపై కుట్రలు ఎందుకు?**

జెఎన్‌యుపై బిజెపి సర్కార్ కుట్ర పన్నుతుంది. అక్కడ ఏదో ఒక సమస్యను సృష్టించి, దాన్ని గురించిన నకిలీ వార్తలను బిజెపి తన ఫెయిడ్ సోషల్ మీడియా ఆర్మీతో విస్తృత ప్రచారం చేయిస్తున్నది. ఆ విద్యార్థులను దేశద్రోహులుగా ముద్ర వేస్తున్నది. జెఎన్‌యుపై దేశవ్యతిరేక శక్తిగా దుష్ప్రచారం చేస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని సంఘపరివార్ ఎందుకు ఇలాంటి కుయుక్తులకు పాల్పడుతున్నది? ఎందుకంటే దేశానికి జెఎన్‌యు ఒక ఐకాన్‌గా ఉన్నది. ఆ మాటకొస్తే, ప్రపంచంలో కూడా ఒక ప్రసిద్ధి చెందిన విద్యాసంస్థ. అంతేకాదు దేశానికి అనేక మంది రాజకీయ నేతలను, విద్యావేత్తలను, రచయితలను, కవులను, బ్యూరోక్రాట్లను, శాస్త్రవేత్తలను, మేధావులను అందించింది. ఇద్దరు జెఎన్‌యు పూర్వ విద్యార్థులు ప్రస్తుత మోడీ ప్రభుత్వంలో కేంద్ర మంత్రులుగా ఉన్నారనేది జెఎన్‌యుకు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేసే బావతు తెలుసుకోవాలి. అలాగే జెఎన్‌యులో ప్రజాస్వామ్య వాతావరణం పరిఢవిస్తుంది. అక్కడి పరిశోదనలు దేశ అవసరాలను తీరుస్తాయి. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లకు వారు పరిష్కారాలు చూపుతున్నారు. భావప్రకటనా స్వేచ్ఛకు చిరునామాగా ఉంటుంది. అన్ని సైద్ధాంతిక భావాలకు నిలయమైన జెఎన్‌యులో నిరంతరం చర్చోపచర్చలు జరుగుతాయి. సమాజంలోని రుగ్మతలపై చర్చలు జరిగే విజ్ఞాన కేంద్రంగా జెఎన్‌యుకు గుర్తింపు ఉంది. అలాంటి విద్యా సంస్థపై హిందూత్వ శక్తుల కన్ను పడింది. అక్కడి ప్రజాస్వామ్య, స్వేచ్ఛయుత వాతావరణం సంఘపరివార్ శక్తులకు గిట్టదు. ఎందుకంటే చర్చలకు, ప్రజాస్వామ్య వాతావరణానికి విరుద్ధమైన సిద్ధాంతాన్ని వారు ఆచరిస్తారు. ప్రశ్నించే తత్వం వారికి ఇష్టముండదు. కనుకనే ఆ విద్యా సంస్థపైన, అక్కడి విద్యార్థులపైన తీవ్రమైన దాడికి పూనుకుంటున్నారు. జెఎన్‌యును పూర్తిగా జాతి వ్యతిరేక కేంద్రంగా ప్రచారం చేస్తున్నారు. అక్కడి విద్యార్థులు ఫీజుల పెంపుపై ఆందోళన చేస్తే, దానికి వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అలా ప్రచారం చేసే సోషల్ మీడియా పెయిడ్ గుంపు, విద్య సరుకు కాదనేది తెలుసుకోవాలి. దేశంలోని ప్రజలకు విద్యను అందించాల్సిన ప్రాథమిక బాధ్యత ఎన్నికైన ప్రభుత్వానిదేనని రాజ్యాంగం పేర్కొంది. ఈ సోషల్ మీడియా గుంపు కనీసం ఈ చిన్న విషయం కూడా తెలుసుకోకుండా అబద్ధాలను ప్రచారం చేస్తున్నది.

బిజెపి కోరుకునే హిందూ రాజ్యస్థాపన కోసమే మోడీ ప్రభుత్వం జెఎన్‌యుపై దాడికి పూనుకొంటున్నది. హేతువాదానికి మారుపేరుగా ఉన్న జెఎన్‌యును విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర పన్నారు. సంఘపరివార్ శక్తులు మేధోపరమైన చర్చలకు సిద్ధపడటం లేదు. దుష్ప్రచారమే విజయం సాధించేందుకు వారు ఎన్నుకున్న ఏకైక మార్గం. అందుకే వారు ఉన్నత విద్య, పరిశోధనా సంస్థలను లక్ష్యంగా చేసుకున్నారు. ఇది చాలా పెద్ద ఎజెండాలో భాగంగా జరుగుతున్నది. ఇది భారతదేశ భవిష్యత్తుకు చాలా ప్రమాదకరమైంది. జెఎన్‌యులో నిరంతరం విభిన్న రాజకీయ చర్చలు జరుగుతాయి. ఇలాంటి ఉన్నతమైన విద్యాసంస్థను మోడీ సర్కార్ టార్గెట్ చేయడాన్ని ప్రశ్నించే గొంతుకలపైనా, ప్రజాస్వామ్య హక్కులపైనా దాడిగా చూడాలి.

**జెఎన్‌యు విద్యార్థి ఉద్యమ చరిత్ర**

సామాజిక న్యాయం, లౌకిక, ప్రజాతంత్ర హక్కులు వంటి రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలే లక్ష్యంగా జెఎన్‌యు నేషనల్ యూనివర్శిటీగా 1969లో పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పాటు అయింది. అయితే ఇక్కడ కొన్ని వర్గాలు మాత్రమే చదువుకునేందుకు వీలుండేది. 1970లో జెఎన్‌యు అడ్మినిస్ట్రేషన్‌కు ప్రత్యామ్నాయంగా జెఎన్‌యుఎస్‌యు అడ్మిషన్ విధానాన్ని తయారు చేసింది. వెనకబడిన, అణగారిన వర్గాలతో పాటు వివిధ వర్గాల విద్యార్థులకు అవకాశం కల్పించే విధంగా విస్తృత అవగాహన ఈ ప్రత్యామ్నాయ విధానంలో పేర్కొన్నారు. అయితే ఈ అడ్మిషన్ విధానాన్ని అమలు చేసేందుకు వర్శిటీ అడ్మినిస్ట్రేషన్ సిద్ధపడలేదు. దాంతో విద్యార్థులు ఉద్యమాలు చేయాల్సి వచ్చింది. వైస్‌చాన్సలర్‌ను ఘెరావ్ చేశారు. అడ్మినిస్ట్రేషన్ తప్పని సరి పరిస్థితుల్లో జెఎన్‌యుఎస్‌యు తయారు చేసిన

> **“ ఇప్పటి వరకు హాస్టల్ రూమ్ రెంట్, హాస్టల్ మెస్ చార్జీలు చెల్లిస్తే సరిపోతుంది. ఇప్పుడు హాస్టల్ మెస్ వర్కర్స్, ఇతర వర్కర్స్ జీతాలు, కరెంట్ బిల్లు, వాటర్ బిల్లు అన్ని విద్యార్థులే చెల్లించాలి. హాస్టల్ ఫీజు వెయ్యి శాతం పెరిగింది. డబుల్ రూమ్‌లో ఒక విద్యార్థికి రెంట్ గతంలో రూ.10 ఉంటే, ఇప్పుడు రూ.300 చేశారు. ”**

అడ్మిషన్ విధానాన్ని ఆమోదించింది. ఈ ఉద్యమం విజయంతో 1972-73 విద్యా సంవత్సరంలో నూతన అడ్మిషన్ పాలసీ అమలులోకి వచ్చింది. ఈ విద్యార్థి ఉద్యమ విజయంతో దేశంలో విభిన్న వెనుకబడిన ప్రాంతాలు, తరగతులకు చెందిన విద్యార్థులు జెఎన్‌యులో అడ్మిషన్ పొందేందుకు అవకాశం లభించింది. 1973లో రెండో విద్యార్థి ఉద్యమం జరిగింది. మెస్ బిల్లు కేవలం రూ.100 మాత్రమే ఉండాలని, అంతకంటే ఎక్కువ ఉండకూడదని, అధికంగా వచ్చిన దాన్ని యూనివర్సిటీయే భరించాలని, మరికొన్ని డిమాండ్లతో ఉద్యమం జరిగింది. దశలవారీగా జరిగిన ఈ ఉద్యమం తీవ్రరూపం దాల్చి, కొన్ని కోర్కెలను సాధించుకున్నది. అప్పటి నుండి మెస్ బిల్లులు బాగా తగ్గించారు. ఇలా నాటి నుండి నేటి వరకు జెఎన్‌యు సమరశీల ఉద్యమాలకు కేంద్ర బిందువుగా మారింది.

### కార్పొరేట్లకు రాయితీలు... విద్యార్థులపై భారాలు

ఒక వక్క మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు లక్షల కోట్లు రాయితీలు ఇస్తున్నది. మరోపక్క విద్యార్థులపై ఫీజుల భారాలు వేస్తున్నది. విద్యా రంగానికి సంబంధించిన రూ.94,036 కోట్ల నిధులు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి రూ. 7,298 కోట్లు ఖర్చు చేయలేదని 2019 ఫిబ్రవరిలో కాగ్ స్పష్టం చేసింది. ఇలా విద్యా రంగానికి కేటాయించిన అరకొర నిధులను కూడా సకాలం ఖర్చు చేయటం లేదు. దీనిపై విద్యార్థులు ఆందోళనలు చేస్తే వారిపై దాడికి పూనుకుంటుంది. విద్యార్థులపై భారాలు వేసి, విద్యకు దూరం చేసేందుకు ప్రయత్నిస్తున్నది. ఫలితంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థ పూర్తిగా నాశనం అవుతున్నది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలను ప్రోత్సహిస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు అడ్డగోలుగా అనుమతులు ఇస్తున్నారు. విదేశీ యూనివర్సిటీలకు తలుపులు బార్లా తెరిచారు. ఇటు విద్యా రంగానికి నిధులు ఇవ్వటానికి తమ వద్ద డబ్బు లేదని చెబుతున్న ప్రభుత్వం, కార్పొరేట్లకు లక్షల కోట్లు రాయితీలు ఇస్తున్నది. ఆయా కార్పొరేట్లకు రూ.4 లక్షల కోట్లు పన్ను రాయితీలు ఇచ్చారు. కార్పొరేట్లు బ్యాంకుల వద్ద తీసుకొని చెల్లించని రుణాలు రూ.5.7 లక్షల కోట్లు ఉన్నాయి. ఆ సొమ్మును వారివద్ద నుంచి వసూలు చేయకుండా మోడీ సర్కార్ ఎన్‌పిఎ లుగా మార్చింది. వాటిని వారి వద్ద నుంచి వసూలు చేసి ప్రభుత్వ విద్యకు వాడాల్సిన అవసరం ఉంది. ఫీజులు పెంపు అనేది జెఎన్‌యుకు మాత్రమే పరిమితం కాలేదు. జెఎన్‌యుతో పాటు ఐఐటి వంటి ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో కూడా ఫీజులను పెంచారు. దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి.

### జెఎన్‌యు హాస్టల్ మాన్యువల్‌లో పేర్కొన్న అంశాలు

ఇప్పటి వరకు హాస్టల్ రూమ్ రెంట్, హాస్టల్ మెస్ చార్జీలు చెల్లిస్తే సరిపోతుంది. ఇప్పుడు హాస్టల్ మెస్ వర్కర్స్, ఇతర వర్కర్స్ జీతాలు, కరెంట్ బిల్లు, వాటర్ బిల్లు అన్ని విద్యార్థులే చెల్లించాలి. హాస్టల్ ఫీజు వెయ్యి శాతం పెరిగింది. డబుల్ రూమ్‌లో ఒక విద్యార్థికి రెంట్ గతంలో రూ.10 ఉంటే, ఇప్పుడు రూ.300 చేశారు. సింగిల్ రూమ్‌లో రెంట్ రూ.20 ఉంటే, దాన్ని రూ. 600 చేశారు. హాస్టల్ సఫాయి, హాస్టల్ వర్కర్స్ జీతాలను విద్యార్థులు భరించాలి. వీరికి జీతాలు గతంలో యూనివర్సిటీ చెల్లించేంది. ఇప్పుడు విద్యార్థులనే కట్టమంటున్నారు. వీటికి నెలకు రూ.1,700 కట్టాలి. ఇది మరో రెండు నెలల్లో ఇంకా పెరుగుతుంది. వాటర్, విద్యుత్‌కు సంబంధించి మీటర్లు పెడతారు. దానికనుగుణంగా విద్యార్థులే బిల్లులు కట్టాలి. ఇతర ఎస్టాబ్లిష్‌మెంట్ ఛార్జీలు ఏడాదికి రూ.2,200, మెస్‌కు నెలకు రూ.3000, యాన్యువల్ ఫీజు రూ.300 ఉంటుంది. ఇలా ఏడాది ఏడాదికి రూ.27,600 చెల్లిస్తున్నారు. ఫీజులు పెంపుతో అది కాస్తా రూ.61,000లకు పెరుగుతుంది. ఇది ఇంతటితో ఆగిపోకుండా ప్రతిఏడాది 10 శాతం ఫీజులు పెంచడం జరుగుతుంది. ఫీజులు కట్టేందుకు గడువు నెలలో 24 తేది ఉండేది. అప్పటికీ కట్టకపోతే అక్కడి నుంచి రోజుకు రూపాయి లెక్క పెరుగుతుంది. దీన్ని ప్రస్తుత మాన్యువల్‌లో ఫీజులు కట్టేందుకు గడువు 15 తేదికి తగ్గించారు. 30 తేది తరువాత రూమ్ లాక్ చేస్తారు. హాస్టల్‌లో ఉండటానికి వీలు లేదు. ఫైన్ కూడా రూ.1 నుంచి రూ.25కు పెంచారు. ఒక వేళ నిర్ణీత సమయంలో ఫీజులు చెల్లించకపోతే డిఫాల్టర్ల పేరుతో హాస్టల్ నోటీసు బోర్డులో విద్యార్థుల పేర్లు ప్రదర్శిస్తారు. ఇప్పటి వరకు అలాంటి సంస్కృతి జెఎన్‌యులో లేదు. ఎవరి బిల్లు వారు చెల్లిస్తారు. అది వారికి మాత్రమే తెలుస్తుంది. అదేదో వీరు దొంగలు పారిపోతారన్నట్లు డిఫాల్టర్ల లిస్టు పెడతామని చెప్పడం దారుణం. ఇది విద్యార్థులను మోరల్‌గా క్రుంగదీసేది. డిఫాల్టర్ల లిస్టు సహజంగా బ్యాంకులకు కోట్ల రూపాయలు ఎగ్గొట్టిన వారికి వర్తిస్తుంది. అలాంటి భయంకరమైన విధానాన్ని పేద, మధ్యతరగతి విద్యార్థులపై ప్రయోగించేందుకు జెఎన్‌యు అడ్మినిస్ట్రేషన్ ఆలోచన చేసింది.

ఈ హాస్టల్ మాన్యువల్‌లో రిజర్వేషన్ల విధానాన్ని పూర్తిగా అదృశ్యం చేశారు. ఇప్పటి వరకు డ్రస్ కోడ్ విధానమేలేని జెఎన్‌యులో కొత్తగా డ్రస్‌కోడ్ విధానాన్ని తీసుకొచ్చారు. జెఎన్‌యు లైబ్రరీ, రీడింగ్ రూమ్‌లు 24 గంటలు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు లైబ్రరీని రాత్రి 10:30 గంటలకు మూసివేస్తారు. హాస్టల్‌కు రాత్రి 11:00 లోపు చేరుకోవాలి. విద్యార్థులు ఒక రోజు హాస్టల్ నుంచి బయటకు వెళ్లాలన్నా హాస్టల్ వార్డెన్‌ల అనుమతి తీసుకోవాలి. లేకపోతే బయటకు వెళ్లడానికి లేదు. అది పిహెచ్‌డి, ఎంఫిల్ స్కాలర్లకు కూడా వర్తిస్తుంది. ఒకవేళ వార్డెన్ అందుబాటులో లేకపోతే పరిస్థితేంటి? అనే దానిపై మాన్యువల్‌లో పేర్కొనలేదు. అసలు పిహెచ్‌డి, ఎంఫిల్ పరిశోధన విద్యార్థుల పనిలో ఎక్కువ భాగం సమాజంలోనే చేయాల్సి ఉంటుంది. ఒకవేళ వార్డెన్ అనుమతితో బయటికెళ్లినా, రాత్రి 11:00 లోపే రావాలి. లేకపోతే హాస్టల్‌లో అడుగు పెట్టడానికి లేదు. మునుపెన్నడూ లేని ఇలాంటి నిబంధనలు విద్యార్థులను టార్గెట్ చేసే విధంగా ఉన్నాయి.

### 70 శాతం మంది చదవులకు స్వస్తి చెప్పాల్సి వస్తుంది

ప్రస్తుతం పెంచిన ఫీజుల వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొందరు మధ్యలోనే తమ చదువులకు స్వస్తి చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్శిటీ అధికారిక వివరాల ప్రకారం వర్శిటీలో బిపిఎల్ (ఏడాది కుటుంబ ఆదాయం రూ.1,44,000) చెందిన వారే 40 శాతం మంది విద్యార్థులు ఉన్నారు. అది ఏడాది కుటుంబ ఆదాయం రూ.2,50,000 ఉన్న విద్యార్థులు దాదాపు 60 నుంచి 70 శాతం మంది ఉన్నారు. వీరిలో ఎక్కువమంది తమ ఉన్నత చదువులను మధ్యలోనే స్వస్తి పలకాల్సి వస్తుంది. అలాగే భవిష్యత్‌లో ఈ పేద వర్గాల నుంచి విద్యార్థులు జెఎన్‌యులో చేరేందుకు అవకాశం ఉండదు.

### ఫీజుల పెంపుకు చెప్పే కారణాల్లో వాస్తవం లేదు

హాస్టల్ ఫీజులు పెంపుకు వర్శిటీ అడ్మినిస్ట్రేషన్ చెబుతున్న కారణాల్లో వాస్తవం లేదని స్పష్టం. ఎందుకంటే వారు చెప్పేది వాస్తవానికి పూర్తి భిన్నంగా ఉంది. "ఇది వరకు యుజిసి నిధులు ఇచ్చేది. ఇప్పుడు ఇవ్వటం లేదు. దీంతో దాదాపు రూ.10 కోట్లు లోటు ఏర్పడుతుంది. కనుక విద్యార్థులు చెల్లించాలి" అని అడ్మినిస్ట్రేషన్ చెబుతున్నది. కానీ వర్శిటీ చేసే వృధా ఖర్చులను మాత్రం చెప్పటం లేదు. ఇది వరకు జెఎన్‌యు అప్లికేషన్లకు రూ.5 కోట్లు వచ్చేది. అందులో రూ.3 కోట్లు పరీక్షల నిర్వహణకు అయ్యేది. రూ.2 కోట్లు అడ్మిషన్ పొంది విద్యార్థులకు మీన్స్ ఇన్ మెరిట్ (ఎంసిఎం) స్కాలర్‌షిప్ రూపంలో తిరిగి ఇచ్చేవారు. ఇప్పుడు ఆన్‌లైన్ ఎగ్జామ్ విధానాన్ని తీసుకొచ్చారు. దానికి రూ.12 కోట్లు ఖర్చు అవుతుంది. దీనిబట్టీ దాదాపు రూ.7 కోట్లు అనవసరంగా అదనపు ఖర్చు చేస్తున్నారు. గతంలో సెక్యూరిటీకి దాదాపు రూ.8 కోట్లు అయ్యేది. అయితే ఇప్పుడు సెక్యూరిటీ ఏజెన్సీని మార్చి అడ్మినిస్ట్రేషన్ ముఖ్యులు తమకు సంబంధించిన సెక్యూరిటీ ఏజెన్సీకి ఇచ్చారు. ఇప్పుడు దాదాపు రూ.16 నుంచి రూ.17 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అంటే దాదాపు రూ.8 కోట్లు అదనంగా ఖర్చు చేస్తున్నారు. అది కూడా గతం కంటే వచ్చే సెక్యూరిటీ సిబ్బంది సంఖ్య ఇప్పుడు తక్కువగా ఉన్నది. గతంలో 450 మంది సెక్యూరిటీ సిబ్బంది వచ్చేవారు. ఇప్పుడు కేవలం 250 మంది మాత్రమే వస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బంది లేరనే సాకుతో హాస్టల్స్ మూసేందుకు కుట్ర జరుగుతున్నది. పరీక్ష నిర్వహణ, సెక్యూరిటీకి సంబంధించి దాదాపు రూ.15 కోట్లు అదనంగా ఖర్చు జరుగుతుంది. అంటే వర్శిటీకి ఏర్పడుతున్న రూ.10 కోట్లు విద్యార్థులు చెల్లించాలని చెబుతున్న అడ్మినిస్ట్రేషన్, అనవసరంగా రూ.15 కోట్లు ఖర్చు చేస్తుంది. ఈ అదనపు అనవసర ఖర్చు ఆపితే, యూనివర్శిటీలో విద్యార్థులు ఫీజులు పెంచకుండానే, వర్శిటీకి ఐదు కోట్లు మిగులు ఏర్పడుతుంది. కానీ వర్శిటీ తన అనవసరపు ఖర్చును చూపకుండా, లోటు పేరుతో పేద, మధ్య తరగతి విద్యార్థులపై భారం వేసేందుకు యోచించడం దారుణం. అంతేకాదు యూనివర్శిటీ ఆదాయం, వ్యయాలకు సంబంధించిన వార్షిక నివేదికను గత రెండేళ్లుగా అడ్మినిస్ట్రేషన్ ఇవ్వటం లేదు. విద్యార్థులు అడిగినప్పటికీ నివేదికను బహిరంగ పరచటం లేదు. ఆ నివేదిక బహిరంగ పరిస్తే ఇంకా ఎన్ని వృధా ఖర్చులు తేలుతాయో...!

"హాస్టల్ ఫీజులు పెంపుకు వర్శిటీ అడ్మినిస్ట్రేషన్ చెబుతున్న కారణాల్లో వాస్తవం లేదని స్పష్టం. ఎందుకంటే వారు చెప్పేది వాస్తవానికి పూర్తి భిన్నంగా ఉంది. "ఇది వరకు యుజిసి నిధులు ఇచ్చేది. ఇప్పుడు ఇవ్వటం లేదు. దీంతో దాదాపు రూ.10 కోట్లు లోటు ఏర్పడుతుంది. కనుక విద్యార్థులు చెల్లించాలి" అని అడ్మినిస్ట్రేషన్ చెబుతున్నది. కానీ వర్శిటీ చేసే వృధా ఖర్చులను మాత్రం చెప్పటం లేదు."




దేశ ప్రజలందరి దృష్టినాకర్షించిన జెఎన్‌యు విద్యార్థుల ఆందోళన

### అసలేం జరిగిందంటే..?

హాస్టల్ ఫీజులు పెంచుతూ, అలాగే విద్యార్థులపై ఆంక్షలు విధిస్తూ డ్రాఫ్ట్ హాస్టల్ మాన్యువల్ అక్టోబర్ 3న వెబ్‌సైట్‌లో పెట్టారు. డ్రాఫ్ట్ హాస్టల్ మాన్యువల్‌పై అక్టోబర్ 18 లోపు ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదులు, అభిప్రాయాలు, సూచనలు, సలహాలు ఇవ్వొచ్చని పేర్కొంది. అక్టోబర్ 22 ఇంటర్ హాల్ అడ్మినిస్ట్రేషన్ (ఐహెచ్ఎ) కమిటీ సమావేశం ఉందని, అందులో ఫిర్యాదులు, అభిప్రాయాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని వర్శిటీ అడ్మినిస్ట్రేషన్ పేర్కొంది. జెఎన్‌యుఎస్‌యుతో పాటు దాదాపు మూడు వేల మంది విద్యార్థులు ఈ మెయిల్ ద్వారా ఫిర్యాదులు, అభిప్రాయాలు, సలహాలు, సూచనలు చేశారు. వారి ఫిర్యాదులను కనీసం పరిగణలోకి తీసుకోలేదు. కానీ అక్టోబర్ 22న జరగాల్సిన ఐహెచ్ఎ కమిటీ సమావేశాన్ని, అకస్మాత్తుగా అక్టోబర్ 28 వాయిదా వేశారు. ఆరోజు ప్రొఫెసర్‌లు, ఐహెచ్ఎ కమిటీలో సభ్యులుగా విద్యార్థుల ప్రతినిధులైన అన్ని హాస్టల్స్ అధ్యక్షులు, జెఎన్‌యుఎస్‌యు కార్యవర్గ సభ్యులు ఉంటారు. అక్టోబర్ 28న ఐహెచ్ఎ సమావేశం జరుగుతుందని హాస్టల్స్ అధ్యక్షులకు, జెఎన్‌యుఎస్‌యు కార్యవర్గ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అయితే పదే నిమిషాల్లో సమావేశాన్ని వర్శిటీ అడ్మినిస్ట్రేషన్ ముగించింది. చట్ట వ్యతిరేకంగా హాస్టల్ మాన్యువల్ డ్రాఫ్ట్‌ను ఆమోదించింది. ఈ వ్యవహారం మొత్తం చూసే వర్శిటీ డీన్ విద్యార్థులకు అందుబాటులో లేరు. విద్యార్థి ప్రతినిధి సభ్యులు నిర్ణీత సమయంలోనే ఆ సమావేశానికి వెళ్లారు. అయితే వారు వెళ్లే సరికే, సమావేశం ముగిసినట్లు, డ్రాఫ్ట్ ఆమోదం

"విద్యార్థుల ఉద్యమం ఉధృతం కావడంతో నవంబర్ 13న యూనివర్శిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసి) భేటీ జరిగింది. సాధారణంగా ఈసి సమావేశం యూనివర్శిటీలోని అడ్మినిస్ట్రేషన్ భవన్‌లో జరుగుతుంది. అయితే చివరి నిమిషంలో అక్కడ నుంచి యూనివర్శిటీకి 20 కిలోమీటర్ల దూరంలో నిర్వహించారు."

పొందినట్లు అధికారులు పేర్కొన్నారు. పది నిమిషాల్లో సమావేశం ఎలా పూర్తి చేస్తారని విద్యార్థి నేతలు ప్రశ్నించారు. అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఎలాంటి సమాధానం ఇవ్వకుండా అక్కడ నుంచి నిష్క్రమించారు. దీంతో విద్యార్థులంతా వైస్ చాన్సలర్, రెక్టార్, డీన్‌లను కలిసేందుకు ప్రయత్నించారు. కానీ ఎవ్వరూ అందుబాటులోకి రావటం లేదు.

మరోవైపు అన్ని హాస్టల్స్ విద్యార్థి సంఘ అధ్యక్షులు ఆయా హాస్టల్ వార్డెన్లను పిలిచి, జనరల్ బాడీ సమావేశం(జిబిఎం) నిర్వహించారు. ఈ జిబిఎంలో అడ్మినిస్ట్రేషన్ తీసుకున్న మాన్యువల్ వద్దని ఏకగ్రీవంగా తీర్మానాలు చేసి, వాటిని వర్శిటీ అధికారులకు పంపించారు. జెఎన్‌యులోని అన్ని హాస్టళ్ళను ఐదు విభాగాలుగా విభజించారు. ఒక్కో విభాగానికి ఒక్కో ప్రవోస్టు ఉంటారు. వార్డెన్లపై అధికారులైన ప్రవోస్టులతో కూడా విద్యార్థులు సమావేశం అయ్యారు. అడ్మినిస్ట్రేషన్ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ సమావేశంలోనే ఈ మాన్యువల్‌ను ముగ్గురు వార్డెన్లు తిరస్కరించారు. వారి ఎదుట విద్యార్థులు తమ ఆవేదన వెళ్ళబుచ్చారు. దీంతో ఇద్దరు ప్రవోస్టులు రాజీనామా చేశారు. ముగ్గురు ప్రవోస్టులు ఆ నిర్ణయాలను వ్యతిరేకించారు. వైస్ చాన్సలర్ యూనివర్శిటీకి బయట ఉంటున్నారు. ఆయన అడ్మినిస్ట్రేషన్ భవన్‌కు కూడా రావటం లేదు. అక్టోబర్ 20 నుంచి వైస్ చాన్సలర్‌ను కలిసేందుకు విద్యార్థులు వెతుకుతున్నారు. కానీ ఇప్పటి వరకు కలవలేదు. అక్టోబర్ మూడు నుంచి ఆందోళన జరుగుతునే ఉంది. అక్టోబర్ 28 నుంచి క్లాసులు బంద్ చేసి ఉద్యమాన్ని ఉధృతం చేశారు. అక్టోబర్ 29న డిన్ ఆఫ్ స్టూడెంట్స్ కార్యాలయానికి జెఎన్‌యుఎస్‌యు తాళం వేసి నిరసన తెలిపారు. నవంబర్ 4న విద్యార్థులంతా స్థానిక వసంత్ కుంజ్ పోలీస్ స్టేషన్‌కు ర్యాలీగా వెళ్లి వైస్‌చాన్సలర్ అదృశ్యం అయ్యారని, ఆయనను వెతికిపెట్టాలని ఫిర్యాదు చేశారు. కాని మీడియా నుంచి పెద్ద స్పందనేమీ రాలేదు.

నవంబర్ 11 నాటికి అది కాస్తా ఉద్రిక్తంగా మారింది. ఆరోజున జెఎన్‌యు అడ్మినిస్ట్రేషన్ 2018-19 బ్యాచ్ పిజి విద్యార్థులకు పట్టాలు, పిహెచ్‌డి, ఎంఫిల్ పూర్తి చేసిన వారికి డాక్టరేట్లు ఇచ్చేందుకు యూనివర్శిటీ వెలుపల స్థానిక ఎఐసిటిఈ ఆడిటోరియంలో స్నాతకోత్సవం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి రమేష్ పోఖ్రియాల్ నిశాంక్, యూనివర్శిటీ చాన్సలర్, వైస్ చాన్సలర్ జగదీష్ కుమార్, రెక్టార్ తదితరులు పాల్గొన్నారు. వైస్ చాన్సలర్ వచ్చి విద్యార్థులతో చర్చించాలని, ఐహెచ్ఎ మాన్యువల్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. వేలాది మంది ఢిల్లీ పోలీసులు, సిఆర్‌పిఎఫ్ బలగాలు శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై నీటి ఫిరంగులు ప్రయోగించడం, లాఠీచార్జి చేయటంతో అనేక మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. బయట ఆందోళన కొనసాగుతుండగానే జెఎన్‌యుఎస్‌యు కార్యవర్గ సభ్యులు లోపలకు వెళ్లి ఎంహెచ్‌ఆర్డీ మంత్రి రమేష్ పోఖ్రియాల్‌కు వినతిపత్రం అందించారు. మరోవైపు డాక్టరేట్లు, పట్టాలు అందుకునేందుకు వచ్చిన జెఎన్‌యు పూర్వ విద్యార్థులు సైతం విద్యార్థుల ఆందోళనకు మద్దతిచ్చారు. స్నాతకోత్సవ హాల్‌లో పూర్వ విద్యార్థులు నిరసన తెలిపారు. వైస్ చాన్సలర్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆందోళనతో మీడియా స్పందించింది.

### ఫీజుల పెంపు వెనక్కి తీసుకున్నట్లు అవాస్తవ ప్రచారం

విద్యార్థుల ఉద్యమం ఉధృతం కావడంతో నవంబర్ 13న యూనివర్శిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసి) భేటీ జరిగింది. సాధారణంగా ఈసి సమావేశం యూనివర్శిటీలోని అడ్మినిస్ట్రేషన్ భవన్‌లో జరుగుతుంది. అయితే చివరి నిమిషంలో అక్కడ నుంచి యూనివర్శిటీకి 20 కిలోమీటర్ల దూరంలో నిర్వహించారు. ఈసి కమిటీలో ఫ్యాకల్టీకి సంబంధించి ముగ్గురు సభ్యులుంటారు. వారికి వేదిక మారుస్తున్నట్లు చివరి నిమిషంలో సమాచారం అందించారు. దీంతో వారు హాజరుకాలేకపోయారు. వారు హాజరుకాకుడదనే సమాచారం అందించడంలో జాప్యం చేశారు. ఒకవేళ వారు సమావేశానికి హాజరైతే, విద్యార్థుల పక్షాన నిలదీస్తారని ఇలా చేశారు. ఈ సమావేశంలో ఫీజులు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఎంహెచ్‌ఆర్డీ కార్యదర్శి ఆర్. సుబ్రహ్మణ్యం, యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ జగదీష్ కుమార్ పేర్కొంటూ ట్వీట్ చేశారు. ఎంహెచ్‌ఆర్డీ కార్యదర్శి ఆర్. సుబ్రహ్మణ్యం ట్వీట్‌ను ఆధారంగా చేసుకొని, ఫీజుల పెంపును వెనక్కి తీసుకున్నట్లు అన్ని జాతీయ మీడియా సంస్థలు పేర్కొన్నాయి. వాస్తవానికి ఫీజులు పెంపు వెనక్కి తీసుకోలేదు. సింగిల్ రూమ్ ఉన్న విద్యార్థికి గతంలో రూ. 20 ఉంటే, దాన్ని రూ.600లకు పెంచారు. ఈసి సమావేశంలో రూ.600ల నుంచి రూ.300లకు తగ్గించారు. అలాగే రూమ్‌లో ఇద్దరు విద్యార్థులుంటే (డబుల్ రూమ్), ఒక్కో విద్యార్థికి గతంలో రూ.10 ఉండేది. ఇప్పుడది రూ.300 పెంచారు. దాన్ని కాస్తా రూ.150కు తగ్గించారు. అంతేతప్ప ఫీజుల పెంపు వెనక్కి తీసుకోలేదు. దీని ప్రకారం రూ.20 నుంచి రూ.300లకు, రూ.10 నుంచి రూ.150లకు ఫీజులు పెరిగాయి. మరోవైపు మెస్ ఛార్జీలు గతంలో దాదాపుగా రూ.3,200 ఉంటే, దాన్ని ప్రస్తుతం రూ.5,500లకు పెంచారు. అలాగే సర్వీస్ చార్జీలు(హాస్టల్ వర్కర్స్ జీతాలు, ఇతర సేవలకు) గతంలో ఉండేవి కావు. కానీ ప్రస్తుతం రూ.1,700కు పెంచారు. వాటర్, విద్యుత్ చార్జీలు దాదాపు రూ.700కు పెంచారు. ఈ రెండింటికి అదనంగా వసూలు చేస్తున్నారు. మెస్‌చార్జీలు, సర్వీస్ చార్జీలు, వాటర్, విద్యుత్ చార్జీలను తగ్గించలేదు. అది కూడా రూమ్ చార్జీలు పెంచిన దాన్ని కాస్తా తగ్గించి, దాన్నే ఫీజుల పెంపును వెనక్కి తీసుకున్నట్లు ప్రచారం చేస్తున్నారు. ఈసి తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జెఎన్‌యుఎస్‌యు ఆందోళన కొనసాగించింది. ఈసి ప్రతులను దగ్ధం చేసింది. నవంబర్ 17న పార్లమెంటేరియన్లతో జెఎన్‌యుఎస్‌యు సభ నిర్వహించింది. సిపిఎం, సిపిఐ, ఆర్జెడి ఎంపిలు సభలో పాల్గొని, జెఎన్‌యు వైఖరిని విమర్శించారు.

### లాంగ్‌మార్చ్‌తో దేశవ్యాప్త చర్చ

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైయ్యే రోజున నవంబర్ 18న "ప్రభుత్వ విద్యను కాపాడాలి" అంటూ జెఎన్‌యు నుంచి పార్లమెంట్ వరకు లాంగ్ మార్చ్‌కు పిలుపు ఇచ్చారు. వేలాది మంది ఢిల్లీ పోలీసులు, సిఆర్‌పిఎఫ్ బలగాలు నవంబర్ 17 రాత్రి యూనివర్శిటీని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఉదయం అయ్యే సరికి బారికేడ్లతో అన్ని గేట్లు మూసివేసి, వర్శిటీలో 144వ సెక్షన్ విధించారు. పోలీసుల వలయాలను చేధించి ముందుకు సాగారు. యూనివర్శిటీ నుంచి బయట పడేందుకు దాదాపు గంట సేపు పట్టింది. రెండు మూడు బారికేడ్లను దాటుకొని ఆర్కేపురం, ఎయిమ్స్, సఫ్దర్‌జంగ్ మీదుగా జోర్‌బాగ్ వరకు దాదాపు తొమ్మిది కిలోమీటర్లు లాంగ్‌మార్చ్ సాగింది. జోర్‌బాగ్ నుంచి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థులను పోలీసులు అడ్డుకుని, లాఠీలతో దాడికి పూనుకున్నారు. దీంతో విద్యార్థులంతా జోర్‌బాగ్ ప్రాంతంలో ప్రధాన రోడ్డుపైనే కూర్చొని ఆందోళన చేశారు. రాత్రి ఏడు గంటల వరకు విద్యార్థులు అక్కడే కూర్చొని ఉన్నారు. దీంతో పోలీసులు వారిని చెదరగొట్టేందుకు వీధిలైట్లు ఆపి మళ్లీ లాఠీచార్జ్‌కు పూనుకున్నారు. ఇలా పలు దఫాలు లాఠీచార్జ్ జరిగింది. విద్యార్థులపై లాఠీలను ప్రయోగిస్తూ అత్యంత దుర్మార్గంగా విరుచుకుపడటంతో అనేక మంది విద్యార్థులు తీవ్రగాయాల పాలయ్యారు. కొంత మంది విద్యార్థులకు తీవ్రంగా రక్తం కారుతున్నా వదలకుండా పోలీసులు అమానుషంగా వ్యవహరించారు. మానవత్వం మంటగలిపే విధంగా విద్యార్థినీలపై మగ పోలీసులు ప్రతాపం చూపించారు. దివ్యాంగ విద్యార్థులను కూడా వదలకుండా దాడికి పూనుకున్నారు. మరోవైపు జెఎన్‌యుఎస్‌యు అధ్యక్షురాలు ఐషీ ఘోష్, ఎస్ఎఫ్ఐ కేంద్ర కార్యవర్గ సభ్యుడు నితీష్ నారాయణలతో పాటు 120 మంది విద్యార్థి నేతలను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అంతేకాక మోడీ సర్కార్ పార్లమెంట్‌కు సమీపంలో ఉన్న మెట్రో స్టేషన్లను మూసి వేసి, విద్యార్థులు రాకుండా అడ్డుకునేందుకు యత్నించింది. ఈ లాంగ్‌మార్చ్‌తో జెఎన్‌యు వ్యవహారంపై దేశవ్యాప్త చర్చ జరిగింది. కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విరుచుకుపడ్డాయి. సిపిఎం ఎంపి కెకె రాగేష్‌తో పాటు వివిధ పార్టీల నేతలు పార్లమెంట్‌లో ఈ అంశాన్ని లేవనెత్తారు. జెఎన్‌యుకు దేశవ్యాప్తంగా అన్ని వర్గాల నుంచి అపూర్వ సంఘీభావం లభించింది. జెఎన్‌యు విద్యార్థుల పోరాటానికి సోషల్ మీడియాలో అపూర్వ మద్దతు లభించింది. నవంబర్ 18న "ఎమర్జెన్సీ ఇన్ జెఎన్‌యు", నవంబర్ 19న "టాక్స్‌పేయర్స్ విత్ జెఎన్‌యు" యాష్ ట్యాగ్‌లతో ట్విట్టర్‌లో అత్యధిక ట్రెండింగ్ అయ్యాయి.

"తమ సమస్యలపై ఆందోళన చేసిన విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు నవంబర్ 19న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఐపిసి 186, 353, 332, 188, 147, 148, 149, 151, 34 సెక్షన్‌ల కింద కేసుతో పాటు ప్రభుత్వ ఆస్తి నష్టానికి సంబంధించిన కేసు నమోదు చేశారు. అలాగే సోమవారం విద్యార్థుల ఆందోళనపై కృష్ణఘర్ పోలీస్ స్టేషన్‌లో 186, 353 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు."

### విద్యార్థులపై ఎఫ్ఐఆర్

తమ సమస్యలపై ఆందోళన చేసిన విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు నవంబర్ 19న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఐపిసి 186, 353, 332, 188, 147, 148, 149, 151, 34 సెక్షన్‌ల కింద కేసుతో పాటు ప్రభుత్వ ఆస్తి నష్టానికి సంబంధించిన కేసు నమోదు చేశారు. అలాగే సోమవారం విద్యార్థుల ఆందోళనపై కృష్ణఘర్ పోలీస్ స్టేషన్‌లో 186, 353 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. విద్యార్థులపై దాడి చేసి, వారిపైనే కేసు నమోదు చేయడం విమర్శల పాలయింది. అసలు ప్రజల ఆస్తికి ఎక్కడ నష్టం వాటిల్లిందో పోలీసులు తెలపలేదు. రోడ్డుపై ఆందోళన చేస్తే ప్రజా ఆస్తికి నష్టం ఎలా కలుగుతుంది? ప్రజాస్వామ్య దేశంలో ఆందోళన చేస్తే కేసులు నమోదు చేయడమా? అన్న ప్రశ్నలు వెల్లువెత్తాయి. అదే రోజున యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ రాజీనామా చేయాలంటూ జెఎన్‌యుటిఎ, జెఎన్‌యుఎస్‌యులు డిమాండ్ చేశాయి.

### జెఎన్‌యుపై ఎంహెచ్‌ఆర్డీ ఉన్నత స్థాయి కమిటీ

మరోవైపు విద్యార్థుల పోరాటానికి దిగొచ్చిన ప్రభుత్వం వారిని చర్చలకు పిలిచింది. ఎంహెచ్‌ఆర్డీ చర్చలకు ఆహ్వానించడంతో జెఎన్‌యుఎస్‌యు కార్యవర్గ సభ్యులు చర్చలకు హాజరయ్యారు. ఎంహెచ్‌ఆర్డీ సంయుక్త కార్యదర్శితో భేటీ అయిన విద్యార్థి నేతలు తమ డిమాండ్లను ఆయన ముందు ఉంచారు. అయితే ఇది అనాధికారిక సమావేశం, ఎంహెచ్‌ఆర్డీ కమిటీ వేసింది. ఆ కమిటీ మీతో అధికారిక సమావేశం నిర్వహిస్తుందని ఆయన చెప్పారు. అంతేతప్ప విద్యార్థి సమస్యపై ఎటువంటి చర్చ జరపలేదు. జెఎన్‌యులో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు యుజిసి మాజీ చైర్మన్ వి.ఎస్ చౌహాన్, ఎఐసిటిఈ చైర్మన్ అనిల్ సహస్రబుద్ధ, యుజిసి కార్యదర్శి రాజీనీష్ జైన్‌లతో కూడిన త్రిసభ్యఉన్నత స్థాయి కమిటీని ఎంహెచ్‌ఆర్డీ నియమించింది. ఎంహెచ్‌ఆర్డీ కార్యాలయం (శాస్త్రి భవన్)లో నవంబర్ 20న ఉన్నతస్థాయి కమిటీతో జెఎన్‌యుఎస్‌యు కౌన్సిల్ భేటీ అయింది. "చట్ట విరుద్ధమైన ఐహెచ్ఎ మాన్యువల్ ముసాయిదాను, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నిర్ణయాలను ఉపసంహరించుకున్నట్లు ఎంహెచ్‌ఆర్డీ ప్రకటించాలి. మాన్యువల్‌పై ఏదైనా నిర్ణయం తీసుకునేందుకు విద్యార్థులు, ప్రొఫెసర్ల నుంచి ఎన్నికైన జెఎన్‌యుఎస్‌యు, జెఎన్‌యుటిఎ ప్రతినిధుల భాగస్వామ్యం తప్పనిసరి చేస్తూ హామీ ఇవ్వాలి. ఉన్నతస్థాయి కమిటీ నిర్ణయాల పేరుతో జెఎన్‌యులో అమలు జరుగుతున్న ప్రక్రియను ధ్వంసం చేయకూడదు. విద్యార్థుల సమస్యలపై నిర్ణయాలు తీసుకునేటప్పుడు జెఎన్‌యుఎస్‌యును క్రియాశీల భాగస్వామిగా చేయాలి. జెఎన్‌యులో ఈ పరిస్థితులు నెలకొనడానికి బాధ్యుడు వైస్ ఛాన్సలర్, ఆయనను వెంటనే పదవి నుంచి తొలగించాలి" అని ఉన్నత స్థాయి కమిటీకి జెఎన్‌యుఎస్‌యు వివరించింది. అలాగే నవంబర్ 22న ఉన్నత స్థాయి కమిటీ యూనివర్శిటీలో మళ్లీ విద్యార్థులతో భేటీ అయింది. జెఎన్‌యుటిఎ నేతలతోనూ, ప్రొఫెసర్లతోనూ భేటీ అయింది. యూనివర్శిటీ డీన్లతో కూడా సమావేశం అయింది. అయితే వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌లు మాత్రం కమిటీతో భేటీ అయ్యేందుకు సిద్ధపడటం లేదు.

అందరికి నాణ్యమైన ఉచితవిద్య కోసం, ప్రజాస్వామ్య సూత్రాల పరిరక్షణ కోసం జెఎన్‌యు విద్యార్థులు గొంతెత్తుతున్నారు. ఆ విద్యార్థులకు దేశమంతా అండగా నిలవాలి.

❋

అధ్యయనం

# అయోధ్య తీర్పు విశ్వాసానిదే గెలుపు



రచయిత్రి ప్రముఖ పాత్రికేయురాలు

**టికె రాజలక్ష్మి**

ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ), అయోధ్యలో ఉన్న వివాదస్థలంలో తవ్వకాలు చేపట్టినప్పుడు సాధారణంగా జరిపే తవ్వకాల ప్రక్రియ నుండి ఎలా వైదొలగిందో, దొరికిన వాస్తవాంశాలను ఎలా మార్చిందో ఇద్దరు ప్రముఖ పురాతత్వ శాస్త్రవేత్తలు వెల్లడించారు. అయోధ్య వివాదస్థలం విషయంలో తీర్పు వెల్లడించినపుడు సుప్రీంకోర్టు న్యాయమూర్తులందరూ ఐక్యంగా పురాతత్వశాస్త్ర పరిశోధనలలో దొరికిన ఆధారాల కన్నా నమ్మకాలకు, విశ్వాసాలకు అధిక ప్రాధాన్యత నిచ్చారు. మసీదు కింద జరిపిన తవ్వకాలలో దొరికిన శిలా శాసనాలలోగాని, అప్పటి గ్రంథాలలో చూపించిన ఆధారాలు గాని అక్కడ ఒక గుడి ఉండేదని నిర్ధారించడానికి సరిపోవని 2010లో అలహాబాద్ హైకోర్టులోని లక్నో బెంచ్ తీర్పు తేల్చి చెప్పిన విషయం ప్రపంచ ప్రఖ్యాత చరిత్ర కారులందరికి తెలిసిన విషయమే.

సుప్రీంకోర్టు నియమించిన అయిదు గురు న్యాయమూర్తులు గల రాజ్యాంగ ధర్మాసనం, ఏ ఎస్ ఐ రిపోర్టు కేవలం మసీదు ఒక ఖాళీస్థలంలో నిర్మించబడలేదని, అంతకు ముందు అక్కడ ఇస్లామేతర కట్టడం ఒకటి ఉండేదని, తన తీర్పులో పేర్కొంది. "మతానికి సంబంధించిన పురాతన నిర్మాణం ఒకటి ఉందంటే దానర్థం విరోధ శక్తులు ఉన్న నిర్మాణాన్ని కూల్చి కట్టినట్టు కాదు." అని కూడా తీర్పులో చేర్చింది.

ఏ ఎస్ ఐ కోర్టుకి సమర్పించిన ఆధారాలు వివాదాస్పద స్థలం హిందువులకే చెందుతుందని చెప్పడానికి సరిపోవు అనికూడా ఆ తీర్పులో ఉంది. కానీ తీర్పు వెలువరించే సమయంలో న్యాయమూర్తులు, – జోసెఫ్ టిఫ్ఎం తెలార్, మొంట్గోమేరి మార్టిన్ లాంటి 18 శతాబ్దపు యాత్రికులు రాసుకున్న అనుభవాలను – అ) వివాదాస్పద స్థలం, రాముని జన్మస్థలం అని హిందువులు, నమ్మడం, విశ్వసించడాన్ని, ఆ) అక్కడే సీత వంట చేసే స్థలం, స్వర్గ ద్వారం, రాముని ఉయ్యాల ఉన్నట్టుగా భావించి ఆ స్థలాలను హిందువులు కొలిచేవారనడాన్ని, ఇ)తీర్థయాత్రలకు వచ్చినవారు అక్కడ ప్రదక్షిణలు చేసే అలవాటు ఉండేదనడాన్ని, ఈ) చారిత్రికంగా, బ్రిటీషు వారు అవధ్‌ని తమ రాజ్యంలో కలుపుకునే ముందు వరకు అక్కడ కొలుపులు ఉండేవని రాసినదాన్ని, 1857కి ముందు నిర్మించిన ఇటుకల కొలిమి ఉండడాన్ని – పరిగణనలోనికి తీసుకున్నారు.

**యాత్రికుల అనుభవాల నమోదు**

అంతేకాక, యాత్రికులు నమోదు చేసిన అనుభవాలను ఆ నాటి పరిస్థితుల ఆధారంగా అర్థం చేసుకోవాలని అన్నారు. అందువలన ఒకవైపు "వినికిడి మాటలను, పుక్కిటి పురాణాలను" పరిగణించకూడదంటూనే, టిఫ్ఎంతెలార్, మొంట్గోమేరి మార్టిన్ లు తమ అనుభవాలను పొందుపరచిన అంశాల ఆధారంగా తీర్పు వెలువడించారు. వారు నమోదు చేసిన అంశాలు, "మహా అయితే రికార్డులలో నమోదయిన అంశాలతో పోల్చి సరిచూసుకోవడానికి పనికి వస్తాయని," అన్నారు. కానీ వెలువరించిన తీర్పులో "ఆ ప్రయాణీకులు చూడనివాటిని, గమనించని వాటిని కూడా అక్కడున్న పరిస్థితుల దఅష్యా కోర్టు అర్థం చేసుకోవాలని" అన్నారు. టిఫ్ఎంతెలార్ తన అనుభవాలను నమోదు చేస్తున్న క్రమంలో అక్కడున్న మసీదు బాబరును నిర్మించినదా లేదా ఔరంగజేబు నిర్మించినదా నిర్ణయించుకోలేక పోయారన్నది స్పష్టంగా తెలుస్తున్నది. న్యాయనిర్ణేతలు కూడా తీర్పును నమ్మకాల ఆధారంగా, విశ్వాసాల ఆధారంగా ఇవ్వలేమని అన్నారు. నమ్మకాలూ విశ్వాసాలు పూజలు చేసే విధానాల ప్రకారం ఉంటాయి. వాటి ఆధారంగా స్థలం తమకు చెందాలని హిందువులు కోరుకుంటున్నారు. వివాదాస్పద స్థలంలో మసీదు ఉన్నప్పటికీ దొరికిన ఆధారాల ప్రకారం, "రామునిజన్మ స్థలంగా అక్కడ హిందువులు పూజించడాన్నీ ఎవరూ అడ్డుకోలేదు." 1856–57 సంఘటనలకు ముందు కూడా అక్కడ పూజలు జరుగుతుండేవి. అక్కడ ఒక మసీదు ఉన్నప్పటికీ రాముని జన్మభూమి అదే అన్న హిందువుల నమ్మకాన్ని అదేమాత్రం సడలించలేదు. పూజలు కొనసాగుతూనే ఉన్నాయి అన్నారు. అక్కడ రాముడు పుట్టినట్టు ఏరకమైన అధారాలు లేవని చరిత్రకారులు పదేపదే చెప్పినా కోర్టు నమ్మకాలు, విశ్వాసాలపై ఆధారపడింది. వాటిని ఏ మాత్రం ప్రశ్నించలేదని స్పష్టంగా తెలుస్తున్నది.

మసీదు లోపల ఉన్న కసౌటీ స్థంభం, మూడు గోపురాల ఆవల ఉన్న వరాహ, జయవిజయ, గరుడ శిల్పాల చెక్కడాలు అక్కడ వేల సంవత్సరాల కింద పూజలు జరిగాయనే వాస్తవాన్ని తెలియచేస్తున్నాయి. అవి కేవలం నమ్మకాలు కాదు అని తీర్పులో పేర్కొన్నారు. 1857లో అవధ్ బ్రిటిష్ రాజ్యంలో కలిపేయడానికి ముందు అక్కడ వాస్తవంగా హిందువులు పూజలు జరిపేవారని అనుకోడానికి ఎక్కువ ఆధారాలు ఉన్నాయి. ఈ ఆధారాలు ఎక్కువగా ఆ కాలంలో అక్కడ పర్యటించిన టిఫ్ఎంతెలార్ అనుభవాల నమోదే. పైగా 16 శతాబ్దం నుండి 1857 వరకు అక్కడున్న అంతర్గత నిర్మాణం తమ ఆధీనంలోనే ఉండేదని ముస్లింలు రుజువు చేసుకోలేక పోయారు అని చెప్పుకొచ్చారు.

2010లో హైకోర్టు తీర్పును విశ్లేషిస్తూ అలీఘర్ చరిత్రకారుల సంఘం ఒక పత్రాన్ని సమర్పించింది. టిఫ్ఎంతెలార్ అంతగా పేరుపొందిన యాత్రికుడు కానేకాదని, ఆతను అక్కడ మసీదుపై ఉన్న

ఏ శిలా శాసనాలను పరిగణలోనికి తీసుకోనే లేదని అందులో ఇర్ఫాన్ హబీబ్ పేర్కొన్నారు. కానీ సుధీర్ అగర్వాల్ (ఇది వరకు లక్నో బెంచ్ తీర్పు వెలువరించిన న్యాయమూర్తులతో ఒకరు) టిఫ్ఎంతెలార్‌ని "గొప్ప జ్ఞానిగా, భాషా కోవిదునిగా" పేర్కొన్నారు.

> "2003లోని ఏ ఎస్ ఐ తవ్వకాలకు ముందు, 1991లో ప్రముఖ చరిత్రకారులు, ఆర్ ఎస్ శర్మ, సూరజ్ భాన్, ఎం ఆర్థర్, డి ఎన్ ఝా ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించారు. భారతదేశ చరిత్రకారుల నివేదికగా పిలవబడే ఆ నివేదికలో "బాబ్రీ మసీదు నిర్మించడానికి ముందు అక్కడ ఉన్న స్థలంలో ఏ ఇతర కట్టడం పడగొట్ట బడలేదు. అక్కడ ఏ మందిరము నిర్మించబడి లేదని మా అధ్యయనాలు తెలియచేస్తున్నాయని రాశారు."

**అజ్ఞాత అనుబంధం**

ఉమ్మడి తీర్పుకు అంగీకరిస్తూనే అందులో ఒక జడ్జి, వివాదాస్పద నిర్మాణం రాముడు పుట్టిన చోటని హిందూభక్తులు ఎందుకు విశ్వసిస్తూన్నారో ప్రత్యేకమైన అనుబంధంగా చేర్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎవరి సంతకం లేని ఆ అనుబంధంలో ప్రఖ్యాతి పొందిన అయిదుగురు న్యాయమూర్తులతో ఒకరు, ఏ చారిత్రిక అధారాలు చూపకుండానే, అయోధ్య రామునితో ముడిపడి ఉన్నందువలన, హిందూ గ్రంథాలలో దానిని పవిత్ర నగరంగా భావించడం వలన దానిని రామ మందిర నిర్మాణానికి అప్పచెప్పాలని నిర్దిష్టంగా తేల్చి చెప్పారు. అందులో అలాహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి సుధీర్ అగర్వాల్‌ని కూడా ఉటంకించడం జరిగింది. (ముగ్గురు న్యాయ మూర్తులు వేరు వేరు తీర్పులు చెప్పారు. చరిత్ర కారులు ఈ అవగాహనకి ఏ రకమైన చారిత్రిక అధారాలు లేవని స్పష్టం చేసినప్పటికీ, అయితే చివరికి వచ్చిన తీర్పు ఎక్కువగా సుధీర్ అగర్వాల్ చారిత్రిక పరిస్థితిని అవగాహన చేసుకున్న దానిపైనే ఆధారపడి వచ్చింది.)



**1992 డిసెంబర్‌లో బాబ్రీ మసీదును పడగొడుతున్న ఆర్ఎస్ఎస్ కరసేవకులు**

2010-11లో ఇర్ఫాన్ హబీబ్ తయారు చేసిన "రామజన్మ భూమి బాబ్రీ మసీదు వివాదంలో, చరిత్ర, హై కోర్టు తీర్పు : ఒక విశ్లేషణ" అనే ఏ ఎం యు డాక్యుమెంట్‌లో జస్టిస్ సుధీర్ అగర్వాల్ ఇచ్చిన తీర్పులోని చరిత్రకి, పురావస్తు శాస్త్రానికి సంబంధించిన అన్ని ముఖ్యమైన అంశాలు తడిమారు. సుప్రీకోర్టు అనుబంధంలో ఈ వాదనలన్నీ ప్రతిబింబిస్తున్నాయి. ఆ డాక్యుమెంట్ ప్రకారం, ఏ ఎం యు చరిత్ర కారుల సంఘం 16వ శతాబ్దానికి ముందు ఉన్న ఏ సంస్కృత గ్రంథంలోనూ "కచ్చితంగా అయోధ్య రాముని జన్మస్థలమని చెప్పారని అలాహాబాద్ హైకోర్టు తీర్పులో ఉటంకించలేదు. కనీసం వాల్మీకి రామాయణంలో కూడా చెప్పలేదు. అయోధ్యను ఒక పవిత్రమైన తీర్థయాత్రా స్థలంగా కూడా చెప్పలేదు. "విశ్వహిందూ పరిషద్ వకీలు, ఎం ఎం పాండే, అయోధ్యలోనే రాముడు పుట్టాడనే హిందువుల నమ్మకాలతో ఏకీభవించే జస్టిస్ అగర్వాల్ కూడా దీనిని ఒప్పుకున్నారు. అక్బర్ పరిపాలన కాలమైన 1570లలో తులసీదాస్ రచించిన రామచరిత మానస్‌లో కూడా రామాజన్మ భూమి ప్రస్తావనే లేదు. కేవలం తులసీదాస్ రచించిన రామాయణంలోని ఉత్తరకాండలో తాను అవధ్‌కు వెళ్లినట్టు, అక్కడ జన్మ మహోత్సవం చూసినట్టు, అంటే రాముని జన్మదిన వేడుకలు చూసినట్టు చెప్పిన విషయాన్ని అలహాబాద్ హైకోర్టు ముందు పెట్టారు.

తులసీదాస్ కాలంలో కనుక రామ జన్మ భూమిగా అయోధ్య గుర్తింపబడి ఉంటే, రాముడు పుట్టినచోట ఒక మసీదు ఉండడాన్ని చూసి ఇంతటి పవిత్రస్థలంలో ఒక మసీదు నిర్మించి దాని పవిత్రతకు ముప్పు కలిగించినందుకు తులసీదాస్ ఖచ్చితంగా విచారించి ఉండేవాడు కదా! అని ఇర్ఫాన్ హబీబ్ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.

భారతదేశానికి చైనా నుంచి 7 వ శతాబ్దపు తొలిరోజులలో, అంటే హర్షవర్ధనుడు పాలించే కాలంలో వచ్చిన హ్యూయన్ సాంగ్ గాని, 11వ శతాబ్దంలో రాయబడిన 'అల్బెరూనిస్ కితాబ్ ఇ హింద్' లోగాని రాముడు అయోధ్యలో జన్మించాడని సంబరాలు జరుపుకోవడాన్ని ప్రస్తావించలేదు. అయోధ్యని ఒక ముఖ్యమైన పట్టణంగా, మార్గంగా అల్బెరూనీస్ పేర్కొన్నారు గాని అయోధ్యకి రామునికి సంబంధం ఉన్నట్టు ఎక్కడా ప్రస్తావించలేదు. మథురకి కఋష్ణుడికి సంబంధం ఉన్నట్టు స్పష్టంగా చెప్పాడు అని ఇర్ఫాన్ హబీబ్ అంటున్నారు.

ఈ అనుబంధంలో 8వ శతాబ్దానికి చెందిన స్కంద పురాణం నుంచి కూడా వక్కాణించారు. "స్కంద పురాణంలో, రాముడి జన్మ స్థలమైన అయోధ్యను దర్శించడం హిందువులకు అత్యంత పవిత్ర కార్యమని, అది మోక్షాన్ని ప్రసాదిస్తుందని" ఉండడాన్ని ప్రస్తావించారు. ఏ ఎం యు చరిత్ర కారుల సంఘం, సంస్కృత గ్రంథాలలో ఒకటైన స్కంద పురాణం కూడా 30కి పైగా ఉన్న పవిత్ర స్థలంలో అయోధ్య ఒకటని పేర్కొంది. అందులోకూడా

**"1528కి మూడు వందల ఏళ్ళకి ముందు అయోధ్య లేక అవధ్ ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతం. హిందువులు కూడా నివసించేవారు. అక్కడ దొరికిన ఎముకలు అక్కడి ప్రజల ఆహారపు అలవాట్ల వలన ఈ విషయం స్పష్టంగా తెలుస్తున్నది. ఖచ్చితంగా ముస్లింలు అధికంగా ఉండడం వలననే వివాదాస్పద స్థలంలో అన్ని ఎముకలు దొరికాయి."**

"రామ – జమ్మ" అని అన్నారు. రామ – జమ్మకి అనేక అర్థాలు ఉన్నాయి.

వి ఎచ్ పి కి సాక్షిగా వ్యవహరించిన డాక్టర్ టి పి వర్మ, ఒక ప్రాచీన లిపి శాస్త్రంలోనూ సంస్కృతంలోనూ నిష్ణాతుడు. అతనుకూడా స్కంద పురాణం 400 సంవత్సరాలకు ముందు లేదని ఒప్పుకున్నారు. 17వ శతాబ్దానికి, లేదా 18శతాబ్దానికి ముందు అయోధ్యని రాముని జన్మభూమిగా ఎవరూ చూపిన ఆధారాలు లేవని వివాదాస్పద స్థలంలో గాని అయోధ్యలో వేరే ఏచోటైనా గాని రాముడు పుట్టాడని నిర్ధారించే దాఖలాలు లేవని, కనీసం అయోధ్య రాముని రాజ్యంగా కూడా గుర్తించబడలేదని చెప్పారు.

కేవలం 16వ శతాబ్దం చివరి రోజుల్లో మాత్రమే అయోధ్యకి మొట్టమొదటి సారిగా బాగా గుర్తింపు ఇవ్వబడింది. అయోధ్య రాముని జన్మభూమిగా గుర్తించడాన్ని అనేకమంది చరిత్రకారులు సవాలు చేశారు. 2003లో ని ఏ ఎస్ ఐ తవ్వకాలకు ముందు, 1991లో ప్రముఖ చరిత్రకారులు, ఆర్ ఎస్ శర్మ, సూరజ్ భాన్, ఎం ఆర్థర్, డి ఎన్ ఝా ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించారు. భారతదేశ చరిత్రకారుల నివేదికగా పిలవబడే ఆ నివేదికలో "బాబ్రీ మసీదు నిర్మించడానికి ముందు అక్కడ ఉన్న స్థలంలో ఏ ఇతర కట్టడం పడగొట్ట బడలేదు. అక్కడ ఏ మందిరము నిర్మించబడి లేదని మా అధ్యయనాలు తెలియచేస్తున్నాయని రాశారు. అక్కడ తవ్వకాలు జరిపి వివాదాస్పద స్థలంలో" ఏ హిందూ దేవాలయం అయినా ఉందా, హిందూ నిర్మాణం అయినా ఉందా, బాబ్రీమసీదు హిందువుల గుడిని కూల్చి కట్టడం జరిగిందా అనే అంశాలను పరిశీలించాలని'' 2001 ఆగస్టు 1న అలహాబాద్ హైకోర్టు ఏ ఎస్ ఐ ని కోరింది.

1993లో డి. మండల్ అనే పేరుపొందిన పురావస్తు శాస్త్రవేత్త 'అయోధ్య: విధ్వంసం తరువాత పురావస్తు శాస్త్రం' అనే పుస్తకాన్ని ప్రచురించడం ఇందుకు కారణం. అందులో పురావస్తు పరిశోధనలో అయోధ్యలో కొన్ని స్తంభాల మూలాలు బయట పడ్డాయని, అవి విధ్వంసం చేయబడిన గుడి రాతి స్తంభాలను బలంగా ఉంచేందుకు ఉపయోగ పడేవని వ్రాయటం గురించి ప్రస్తావించారు. విధ్వంసానికి ముందు జరిగిన తవ్వకాలలో స్థంబాల మూలాలుగా చెప్పబడుతున్న ఫోటోలను ప్రచురించారు. విధ్వంసం జరిగిన తరువాత కొంతమంది పురావస్తు శాస్త్ర వేత్తలు కనుగొన్నట్టుగా చెప్పుకుంటున్న స్తంభాల మూలాలు, పడగొట్టబడిందని చెప్పుకుంటున్న గుడి స్తంభాల మూలాలు కనీసం ఒకే స్థాయిలో కూడా లేవని, అందువలన "రాతిపొరల అధ్యయనం ప్రకారం అక్కడ గుడి ఉండగల అవకాశాలు అసాధ్యమైన "విషయంగా తేల్చారు. మూకదాడుల తరువాత వెలువడ్డ "వాస్తవాలు" ఏమేరకు నిజమో అనికూడా మండల్ సంశయించారు. 1993 ప్రచురణను, ఆ తరువాతి కాలంలో కేసు న్యాయస్థానం పరిధిలో ఉన్నందున పుస్తకాన్ని, వెనక్కు తీసుకుంటున్నట్టు ప్రకటించారు. తవ్వకాలు 2003 మార్చిలో మొదలయ్యాయి. ఆరు నెలల తరువాత ఏ ఎస్ ఐ సమర్పించిన నివేదికలో సమాధానం చెప్పిన అంశాలకంటే కంటే ప్రశ్నలు లేవనెత్తిన అంశాలే ఎక్కువ వున్నాయి. మసీదుకింద ఒక గుడి ఉండేదని నిరూపించ డానికి తవ్వకాలలో ఏ రకమైన భౌతిక రుజువులు చూపలేకపోయింది.

**కనిపించిన ఆధారాలను విస్మరించడం**

ఏ ఎస్ ఐ తవ్వకాలు జరుపుతున్నప్పుడు మండల్, షెరీన్ రత్నగర్ అనే పురాతత్వ శాస్త్రవేత్తలను వివాదాస్పద స్థలంలోకి వెళ్ళడానికి కోర్టు అనుమతించింది. వారిద్దరూ కలిసి రచించిన "2007 తవ్వకాల తరువాత పురాతత్వ శాస్త్రం" అనే గ్రంథంలో తవ్వకాలు, కొన్ని నిర్ణయాలు కూడా సాధారణ పద్ధతులకు భిన్నంగా జరిగాయని రాశారు. అక్కడ కనుగొన్న వస్తువులు – ఎముకలు, మెరుగులు పెట్టిన పాత్రలు, కొన్ని పెంకులను దాచేశారు. మెరుగుపెట్టబడిన వస్తువులు మొగలులు, మొగలుల తరువాతి కాలం అయిన సుల్తానేట్‌కి సంబంధించినవి. ఇవి పరిశోధనలలో అత్యంత కీలకమైన అంశాలు. ఈ దొరికిన వస్తువులకు సంబంధించి ఏ రికార్డు లేదు. ఎముకలు అన్ని పొరలలోనూ కనిపించాయి. కొన్నిటికి గాట్లు కూడా ఉన్నాయి. ఆ కాలంలో ప్రజలు తినే ఆహారం ఎలాంటిదో అనే విషయం మాత్రమే ఇవి తెలియచేస్తాయి. పశువుల ఎముకలు ఒక గుడికి సంబంధించిన అవశేషాలు, ముఖ్యంగా వైష్ణవ గుడికి సంబంధించినవి అయుండే అవకాశమే లేదు. ఈ ఎముకలతోనే భూమి పూడ్చబడి ఉంది. గుడి కట్టడానికి ఎముకలున్న మట్టినయితే వాడారు కదా! 1528కి మూడు వందల ఏళ్ళకి ముందు అయోధ్య లేక అవధ్ ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతం. హిందువులు కూడా నివసించేవారు. అక్కడ దొరికిన ఎముకలు అక్కడి ప్రజల ఆహారపు అలవాట్ల వలన ఈ విషయం స్పష్టంగా తెలుస్తున్నది. ఖచ్చితంగా ముస్లింలు అధికంగా ఉండడం వలననే వివాదాస్పద స్థలంలో అన్ని ఎముకలు దొరికాయి. మసీదు నిర్మాత పర్షియా భాషలో రాసిన శిలా శాసనాన్ని చారిత్రిక పరిశోధకులు కనుగొన్న విషయాలను లక్నో బెంచ్‌లోని ముగ్గురు న్యాయమూర్తులులో ఇద్దరు పరిగణించలేదని సహమత్ వారు ప్రచురించిన బుక్‌లెట్‌లో ఇర్ఫాన్ హబీబ్ రాసారు. దొరికిన శిలాశాసనంలో బాబర్ సైన్యాధికారి మీర్ బాకీ మసీదును నిర్మించినట్టు స్పష్టంగా ఉంది. అందులో గుడిని పడగొట్టినట్టు రాయలేదు. నిజానికి ఆలా గుడిని పడగొట్టి ఉంటే దానిని వారు గర్వంగా చెప్పుకుని ఉండేవారు. నిర్మాత తన గొప్పదనాన్ని చాటుకునే ప్రయత్నం చేసేవాడు. వీటితో పాటు మెరుగుపెట్టబడిన వస్తువులు, పెంకులు సాంస్కతిక రంగాన్ని తెలిపే సాక్ష్యాలు అవన్నీ ముస్లింల నివాసాన్ని, సుల్తానేట్ కాలంలో ప్రజల ఆవాసాన్ని తెలియ చేస్తున్నాయి" అంటారు మండల్. 2007లో ప్రచురించబడిన పుస్తకానికి షెరీన్ రత్నగర్ రాసిన ముందు మాటలో భూమి పొరలలో కనిపించిన వాస్తవాలను అసంబద్ధంగా చూపించారు అని రాశారు. ఈ విషయాలన్నీ ప్రజల ముందే ఉన్నాయి. అయినా దేశంలోని అత్యున్నత న్యాయస్థానంతో సహా ఎవరూ పట్టించుకునే ప్రయత్నం చేయలేదు. అలహాబాద్ హైకోర్టు ముందు ఎంతోమంది పురావస్తు శాస్త్రవేత్తలు సాక్ష్యాలు చెప్పారు. కానీ నమ్మకం, విశ్వాసం ముందు సాక్ష్యం, శాస్త్ర పరిశోధన ఓడిపోయింది.

**(అనువాదం: కె ఉషారాణి)**

# బ్రస్సెల్స్‌లో కారల్‌మార్క్స్

ఎం శివరామకృష్ణన్



బ్రస్సెల్స్‌లో కారల్ మార్క్స్ కమ్యూనిస్టు ప్రణాళిక రాసిన భవనం

దేశాన్ని విడిచి వెళ్ళమని ఫ్రెంచ్ ప్రభుత్వం ఆదేశించడంతో 1845 ఫిబ్రవరి ప్రారంభంలో కార్ల్ మార్క్స్ బెల్జియం రాజధాని బ్రస్సెల్స్ కి చేరుకున్నారు. కార్మికులు ప్రబలంగా ఉన్న ప్రాంతంలో ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. బెల్జియం అప్పటికే ప్రపంచంలో అత్యంత అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాలలో ఒకటిగా నిలిచి ఉంది. యంత్రాల ద్వారా పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తున్న దేశం. ఇంజనీరింగ్, వస్త్ర, హస్తకళలు, సాంప్రదాయ కుటీర పరిశ్రమల దేశంగా బెల్జియం అభివ ృద్ధి అయింది. కార్మికులు అతి తక్కువ వేతనాలతో రోజుకు 14 గంటలు పని చేయాల్సిన పరిస్థితి. పరిశ్రమల్లో మహిళలు, బాల కార్మికులు పెద్ద సంఖ్యలో పనిచేస్తున్నారు. సెయింట్ సైమన్, ఫోరియర్ సిద్ధాంతాలు, బ్యూనోటి వంటి ఉహోజనిత కమ్యూనిస్టు ఆలోచనల ప్రభావం కార్మికులపై ఉంది.

ఉహోజనిత సోషలిజం ప్రభావంతో ఉన్న కొద్దిమంది అతివాద ప్రతిపక్ష సభ్యులు ప్రజాస్వామ్య ప్రభుత్వానికి అనుకూలంగా బెల్జియం శ్రామికులలో ప్రచారం చేశారు. పోలాండ్, ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్ దేశాల నుండి వలస వచ్చిన రాజకీయ నాయకులు ప్రగతిశీల ఆలోచనల ప్రాధాన్యత గురించి బెల్జియం ప్రజలకు తెలియజేయడానికి సహాయపడ్డారు.

బెల్జియం ప్రభుత్వం మార్క్సకి, అతని కుటుంబానికి ఆశ్రయం ఇచ్చినప్పటికీ, మార్క్స విప్లవాత్మక రాజకీయాలను చూసి భయపడింది. మార్క్సను ప్రమాదకరమైన కమ్యూనిస్టుగా, ప్రజాస్వామ్యవాదిగా ముద్రవేసింది. 1845, మార్చి 22న పోలీసు విచారణకు హాజరు కావాలని మార్క్స కి పోలీసులు సమన్లు ఇచ్చారు. మార్క్సని పిలిపించుకొని ప్రస్తుత రాజకీయాలపై బెల్జియంలో ఎటువంటి కరపత్రాలు, వ్యాసాలు ప్రచురించబోమని హామీ తీసుకొని ఒప్పందంపై సంతకం చేయించుకున్నారు. ఈ షరతులకు లోబడి మార్క్స బెల్జియంలో ఉండటానికి పోలీసులు అనుమతించారు. మార్క్సను బహిష్కరించాలని ప్రష్యన్ ప్రభుత్వం ఫ్రెంచ్ ప్రభుత్వాన్ని ఒత్తిడి చేసింది. ప్రష్యన్ ప్రభుత్వం బెల్జియం ప్రభుత్వంతో కూడా అదే దుర్మార్గపు ఆటను ప్రారంభించింది. ప్రష్యన్ ప్రభుత్వం ఒత్తిడికి లొంగిన బెల్జియం ప్రభుత్వం కూడా మార్క్సను బహిష్కరించింది. మార్క్స నిరంతరం ముప్పుతో జీవించాల్సి వచ్చింది. ఇంత నిర్భంధంలో ఉన్నప్పటికీ, బెల్జియం, రష్యా నుండి వచ్చిన జర్మన్ సోషలిస్టులు, ఫ్రెంచ్ విప్లవకారులు, పోలాండ్ ప్రజాస్వామ్యవాదులు సమావేశమవ్వడానికి మార్క్స ఇల్లే ప్రధాన కేంద్రంగా ఉండేది. వారు తరచూ తాత్విక, రాజకీయ, సాహిత్య అంశాలపై గంటలు తరబడి చర్చించేవారు. వీరిలో చాలా మంది విప్లవాత్మక వలసవాదులు, ప్రగతిశీల బెల్జియన్ మేధావులున్నారు.

1845, ఏప్రిల్ నాటికి ఫెడరిక్ ఏంగెల్స్ బార్మెన్ నుండి బ్రస్సెల్స్‌కు చేరుకున్నారు. మార్క్స కుటుంబం అతనికి హృదయ పూర్వకంగా స్వాగతం పలికింది. మార్క్స నివాసం ఉంటున్న ప్రాంతంలోనే ఏంగెల్స్ ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. 1844, సెప్టెంబర్ నెలలో పారిస్‌లో ఉన్న మార్క్సను కలిసిన తరువాత ఏంగెల్స్ బార్మెన్‌కు చేరుకున్నాడు. జర్మనీ అంతటా భూస్వామ్య వ్యతిరేక శక్తుల ప్రగతిశీల రాజకీయ కార్యకలాపాలను కారల్‌మార్క్స పరిశీలించారు. ప్రష్యన్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది. ఈవ్యతిరేకత క్రమంగా మధ్యతరగతి ప్రజల్లోకి విస్తరించింది. దేశంలోని అన్ని ప్రాంతాల్లో పెట్టుబడిదారులు రైనిష్ ప్రష్యా ప్రాంతంలో సమావేశాలు జరిపారు. ఈ సమావేశాల్లో విస్తృత వర్గాల ప్రజలు రాజ్యాంగం ప్రవేశపెట్టడానికి అనుకూలంగా మాట్లాడారు. పత్రికా స్వేచ్ఛను సమర్థించారు. భూస్వామ్య దాస్య గొలుసులను తొలగించాలని పిలుపునిచ్చారు. రైన్ ప్రావిన్స్‌లో జరుగుతున్న పరిణామాలన్నింటినీ గమనించిన ఏంగెల్స్ వెంటనే ఉద్యమంలో భాగస్వామి అయ్యారు. రైన్‌ల్యాండ్‌లోని సోషలిస్టులతో సంబంధాలు పెట్టుకున్నారు.

అక్టోబర్ నెలలో ఏంగెల్స్ కొలైన్ వెళ్ళి సోషలిస్ట్ సమావేశాలలో విస్త ృతంగా పాల్గొన్నారు. కొలైన్‌లో చాలా రోజులు ఉండి న్యాయవాదులు, వైద్యులు, కళాకారులు, అధికారులతో ముచ్చటించాడు. ప్రజలను భూస్వామ్య వ్యతిరేక ఉద్యమంలోకి తీసుకురావడం ఏంగెల్స్ పర్యటన

> 1528కి మూడు వందల ఏళ్ళకి ముందు అయోధ్య లేక అవధ్ ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతం. హిందువులు కూడా నివసించేవారు. అక్కడ దొరికిన ఎముకలు అక్కడి ప్రజల ఆహారపు అలవాట్ల వలన ఈ విషయం స్పష్టంగా తెలుస్తున్నది. ఖచ్చితంగా ముస్లింలు అధికంగా ఉండడం వలననే వివాదాస్పద స్థలంలో అన్ని ఎముకలు దొరికాయి.

ముఖ్య ఉద్దేశ్యం. భూస్వామ్య వ్యతిరేక పోరాటాన్ని విప్లవాత్మక ఉద్యమంగా మార్చడమే ఏంగెల్స్ లక్ష్యం. ఆ తరువాత ఏంగెల్స్ ఎల్బర్ ఫీల్డ్ ప్రాంతంలో జరుగుతున్న ప్రజాస్వామ్య ఉద్యమం గురించి ప్రచారాన్ని తీవ్రం చేశారు. సోషలిస్టు నాయకుల్లో ముఖ్యుడైన మోసెస్ హెస్‌తో కలిసి ఏంగెల్స్ బహిరంగ సభలను నిర్వహించారు.

పెట్టుబడిదారీ సమాజం కంటే కమ్యూనిస్టు సమాజం ఎంతో ఉన్నతమైనదే కాక చారిత్రక పరిణామాల ఫలితమని ఏంగెల్స్ స్పష్టం చేశాడు. కమ్యూనిస్టు సమాజంలో వైరి వర్గాలకు స్థానం ఉండదు. వ్యక్తి ప్రయోజనం వ్యవస్థ ప్రయోజనం మధ్య సమతౌల్యత సాధించడమే కమ్యూనిస్టు సమాజంలో మార్గదర్శక సూత్రం అవుతుంది. కమ్యూనిజం, శాంతి అవిభాజ్య సమాజ లక్షణాలుగా మారతాయి. కమ్యూనిస్టు సమాజం దురాక్రమణ దాడులకు దిగదు. కమ్యూనిస్టేతర సమాజం దాడికి పాల్పడితే కమ్యూనిస్టు సమాజంలోని పౌరులు తమ నిజమైన మాతృభూమిని కాపాడుకోవటానికి కంకణదారులవుతారు. వీరోచితంగా కర్తవ్య సాధనలో భాగస్వాములవుతారు. అటువంటి ప్రజల ముందు ఎంతటి శక్తివంతమైన శత్రుసైన్యం అయినా తల వంచక తప్పదు.

ఏంగెల్స్ యొక్క ప్రసంగాలు తీవ్ర ప్రభావాన్ని చూపాయి. కమ్యూనిజం ప్రాధాన్యతను ప్రపంచం దృష్టికి తీసుకురాగలిగారు. వుపర్ వ్యాలీలో కమ్యూనిజాన్ని చర్చనీయాంశం చేయడానికి ఏంగెల్స్ ప్రసంగాలు బాగా సహాయపడ్డాయి. ఎల్బర్ ఫీల్డ్ సమావేశాలు శ్రామికుల్లో గణనీయమైన ప్రతిస్పందనను తీసుకువచ్చాయి. కార్మికుల సమూహం నుండి ఎన్నుకోబడిన కార్మిక నాయకులు ఎల్బర్ ఫీల్డ్ సమావేశాల్లో తెలుసుకున్న విషయాలను, జరిగిన చర్చల సారాంశాన్ని తోటి కార్మికులకు తెలియజేసారు.

ప్రష్యన్ ప్రభుత్వం ఏంగెల్స్ రాజకీయ కార్యకలాపాలను నిశితంగా పరిశీలిస్తూ ఉన్నది. మారుతున్న రాజకీయ పరిస్థితులపై ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలోనే హోంమంత్రి ఎల్బర్ ఫీల్డ్ బార్మెన్‌లో జరగబోతున్న అన్నిరకాల సమావేశాలను నిషేధించాడు. లాడ్జీలు, నివాసప్రాంతాల్లో కమ్యూనిస్టు ప్రచారానికి అనుమతిస్తే జరిమానా లేదా జైలుకు పంపుతామని యజమానులను హెచ్చరించారు. ప్రష్యన్ ప్రభుత్వం కూడా ఇలాంటి సమావేశాలను చట్టవిరుద్ధమని ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో ఏంగెల్స్ తన వ్యూహాలను మార్చుకున్నారు. సోషలిస్టు గ్రూపులతో రహస్య సంబంధాలు పెట్టుకున్నారు. ఏంగెల్స్ బాన్, కోల్జెన్ మరియు ఇతర ప్రదేశాలను సందర్శించాడు. ప్రష్యాలో జరుగుతున్న పరిణామాల గురించి ఏంగెల్స్ క్రమం తప్పకుండా మార్క్సుకు ఉత్తరాల రూపంలో తెలియపరుస్తూ ఉన్నాడు. అదే సమయంలో ఏంగెల్స్ లండన్ మరియు పారిస్‌లోని లీగ్ ఆఫ్ జస్ట్ నాయకులతో, ఇంగ్లండ్‌లోని సోషలిస్టులతో, చార్టిస్టులతో తనకున్న పరిచయాలను కొనసాగించాడు. చార్టిస్టులు నడుపుతున్న 'ది న్యూ మోరల్ వరల్డ్' కోసం అనేక వ్యాసాలు రాశారు.

మార్క్స్ – ఏంగెల్స్ సంయుక్తంగా రాసిన " పవిత్ర కుటుంబం " పుస్తకం మొదటి కాపీని ఏంగెల్స్ మార్చి నెలలో అందుకున్నారు. పుస్తకాన్ని చూసి ఏంగెల్స్ చాలా ఉత్సాహపడ్డారు. " పవిత్ర కుటుంబం " పుస్తకం గురించి జర్మనీ పత్రికలలో అనేక సమీక్షలు వచ్చాయి. సమీక్షలు రాసిన వారిలో ఎక్కువ మంది మార్క్స్ – ఏంగెల్స్‌ల భౌతికవాద, సోషలిస్టు ఆలోచనలపై తీవ్రంగా దాడి చేశారు. ప్రగతిశీల స్వభావం ఉన్న ప్రజలు ఈ పుస్తకాన్ని మెచ్చుకున్నా ఏంగెల్స్ వెను వెంటనే " ఇంగ్లాండ్‌లో కార్మికవర్గ స్థితిగతులు " అనే పుస్తకాన్ని రాయడంలో మునిగిపోయాడు. ఇంగ్లాండ్‌లో ఉన్నప్పుడు కార్మికుల సమస్యల గురించి చేసిన అధ్యయనం ఆధారంగా పుస్తకాన్ని ప్రారంభించారు. పుస్తకం రాతప్రతిని మార్చి నాటికి పూర్తి చేసారు.

ఏంగెల్స్ తన రచనలతో, రాజకీయ పనులతో బిజీగా ఉండటంతో ఇంట్లో తండ్రి కోపాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. ఏంగెల్స్ తండ్రి తన కొడుకును వ్యాపారవేత్తగా చూడాలని, భారీగా డబ్బు సంపాదించాలని ఆశించాడు. కానీ ఏంగెల్స్ పూర్తిగా రాజకీయాలలో మునిగిపోవడాన్ని చూసి అతను నిరాశ చెందాడు. కొడుకును రాజకీయాలను విడిచిపెట్టమని నిరంతరం సలహాలు ఇచ్చాడు. కానీ ఏంగెల్స్ తండ్రి సలహాలను పట్టించుకోలేదు. తండ్రి, కొడుకుల మధ్య గొడవ చాలా నెలలు కొనసాగాయి. . వామపక్ష రచయిత కావాలనే తన జీవిత లక్ష్యాన్ని ఏంగెల్స్ తన తండ్రికి చెప్పాడు.

ఒక దశలో ఏంగెల్స్‌కు ఇంటిలో పరిస్థితి భరించలేనిదిగా మారింది. అతను తన ఇంటిని వదిలి వెళ్ళి బ్రసెల్స్ లోని మార్క్స్‌తో కలిసి పని చేయాలని నిర్ణయించుకున్నాడు. 1845, ఏప్రిల్ నెలలో ఏంగెల్స్ తన ఇంటిని వదిలి బ్రసెల్స్ చేరుకున్నారు. కొన్ని రోజుల తర్వాత ఏంగెల్స్ భార్య మేరీ కూడా తనతో కలిసి ఉండటానికి ఇంగ్లాండ్ నుండి బ్రస్సెల్స్‌కు వచ్చింది.

ఏంగెల్స్ బ్రస్సెల్స్‌కు రావటం మార్క్సును చాలా ఉత్సాహపరిచింది. శాస్త్రీయ కమ్యూనిజానికి తాత్విక పునాదిగా ఉన్న చరిత్ర గురించి, భౌతికవాద దృక్పథం గురించి, వాటిని అభివృద్ధి చేయవలసిన అవసరాన్ని గురించి మార్క్స్ ఏంగెల్స్‌తో చెప్పారు. మార్క్స్ ఆర్థికపరమైన అధ్యయనాలను తిరిగి ప్రారంభించగా, ఏంగెల్స్ ఇంగ్లాండ్ ఆర్థిక వ్యవస్థ, చరిత్రపై అధ్యయనాన్ని కొనసాగించాడు. అనేకమంది మేధావులు, విప్లవాత్మక వలసదారులు, బెల్జియం ప్రజాస్వామ్యవాదులపై మార్క్స్– ఏంగెల్స్‌లు కేంద్రీకరించి పనిచేయడం ప్రారంభించారు. ప్రష్యన్ సైన్యంలో పనిచేసి పదవి విరమరణ చేసిన మిలటరీ అధికారి జోసెఫ్ వీడమెయర్, విల్‌హెల్మ్ వోల్ఫ్, టైప్–సెట్టర్స్ వాలూ అండ్ బోర్న్, జర్మన్ కార్మికుడు జంగ్, ఫిలిప్ జిగాట్, విక్టర్ టెడెస్కో తదితరులు మార్క్స్– ఏంగెల్స్‌లు కేంద్రీకరించిన వారిలో ముఖ్యులు.

(యాన్ అవుట్ లైన్ హిస్టరీ ఆఫ్ ది కమ్యూనిస్ట్ మూమెంట్ ఆఫ్ ది వరల్డ్ – పార్ట్ – 1 (1844 –1917) గ్రంథం నుండి)

**(అనువాదం – కె.హరికిషోర్)**

# కమ్యూనిస్టు భావాల వ్యాప్తిలో ఎంఎన్ రాయ్ కృషి

(2వ పేజీ తరువాయి)

నాయకత్వంలోని గ్రూపు ద్వారానే వారి కార్యక్రమాలు నిర్వహించుకోవాలని నిర్ణయించారు. కొమింటర్న్‌లో అయన పాత్ర గుర్తించదగినది. 1926లో అయన ప్రిసీడియంకి ఎన్నికయ్యారు. ఇసిసిఐ, ప్రపంచ కాంగ్రెస్ రాజకీయ కార్యదర్శివర్గంలో కీలక బాధ్యతలు నిర్వహించారు.

1921 తర్వాతి కాలంలో రాయ్ భారతదేశంలో అప్పుడే రూపుదిద్దుకుంటున్న వివిధ కమ్యూనిస్టు గ్రూపులను, నాయకులను సంబోధిస్తూ అసంఖ్యాకంగా లేఖలు రాశారు. ప్రచురణలు చేశారు. 1922 మేలో, భారతదేశ స్వాతంత్ర్య రక్షకుడు అనే పత్రికని ప్రారంభించారు, ఆ తరువాత 1925 వరకు అదే పత్రిక, ది అడ్వాన్స్ గార్డ్ (ప్రగతిని కాపాడే పత్రిక), మాసెస్ ఆఫ్ ఇండియా (భారతదేశ ప్రజాసమూహం) లాంటి అనేక పేర్లతో ప్రచురించబడింది. భారతదేశ సమస్యలను చర్చిస్తూ భారతదేశం చేరిన తొలి కమ్యూనిస్టు పత్రిక ఇదే. బ్రిటీషువారు వెంటనే అప్రమత్తమయ్యారు. ఆ సంచికలు నిషేధించడమేకాదు, ప్రచురితమై భారతదేశం చేరుతున్న పత్రికలను స్వాధీనం చేసుకున్నారు.

అదేసమయంలో ఆయన 'మారుతున్న భారతదేశం' అనే గ్రంథాన్ని రచించారు. ఇందులో బ్రిటిష్ పాలనలోని భారతదేశం యొక్క ఆర్థిక రాజకీయ సైద్ధాంతికాంశాలను మార్క్సిస్టు దృక్పథంతో విశ్లేషించటానికి ప్రయత్నించారు. భారతదేశంలో కమ్యూనిజం వైపు చూస్తున్న వారిపై ఈ పుస్తకం ఎంతో ప్రభావాన్ని చూపింది. కొమింటర్న్ అధికార పత్రికైన 'ఇంప్రెకార్'లో కూడా భారతదేశానికి సంబంధించిన అనేక అంశాలపై క్రమం తప్పకుండా వ్యాసాలు రాశారు.



లెనిన్‌తో ఎంఎన్‌రాయ్ మొదటి సమావేశం

భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు కూడా ప్రణాళికలను పంపేవారు. 1921 లో అహ్మదాబాద్‌లో జరిగిన మహాసభకు మొదటిసారి ఒక ప్రణాళికను పంపించారు. ఆ తరువాత 1922లో గయలో జరిగినప్పుడు. 1923,1924లలో జరిగిన మహాసభలకు కూడా పంపారు.

మధ్య ఆసియా నుండి కేవలం ఉత్తరభారతదేశానికే కాక భారతదేశంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లడం కష్టమవుతున్నందువలన 1922 లో ఎంఎన్‌రాయ్ బెర్లిన్‌కి మకాం మార్చారు. 1921, 1923లో భారతదేశంలో పెరుగుతున్న కమ్యూనిస్టు గ్రూపులను కలవడానికి నళినీగుప్తను తన తరపున పంపించారు.

భారతదేశంలో కమ్యూనిస్టు కార్యకలాపాలు పెరుగుతున్నందువలన కొమింటర్న్, ఎంఎన్ రాయ్ నాయకత్వంలో సిపస్పి, క్లెమెన్స్ దత్‌లతో సిపిఐ విదేశీ బ్యూరోని ఏర్పాటు చేసింది. కొత్తగా ఏర్పడుతున్న కమ్యూనిస్టు గ్రూపులపై బ్రిటిష్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్బంధ విధానాలు, వారిపై మోపుతున్న రాజద్రోహ నేరాలు, కమ్యూనిస్టు కార్యకర్తలను జైళ్లలో కుక్కడం వగైరా చూసిన తరువాత కార్మిక కర్షక పార్టీని స్థాపించాలని, కాంగ్రెస్ జాతీయోద్యమంతో సహకరించాలని రాయ్ నిర్ణయించుకున్నాడు. బెంగాల్, బొంబాయి, పంజాబ్, ఆ తరువాత ఉత్తర్ ప్రదేశ్ లో కూడా అటువంటి వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీలు ఉద్భవించాయి.

రాయ్ కూడా నిందితునిగా ఉన్న 1924లో మోపబడిన కాన్పూర్ కుట్రకేసు తరువాత, 'జాతీయ విప్లవ పార్టీ' ని స్థాపించాలని రాయ్ పిలుపునిచ్చాడు. జాతీయ స్వతంత్రం, ఫ్యూడల్ ,భూస్వామ్య వ్యవస్థల రద్దు, భూమి, గనులు, ప్రజాసేవలను జాతీయం చేయడం, మత స్వేచ్ఛ ఈ పార్టీ విధానాలుగా ఉండాలని చెప్పాడు.

1926 వరకు భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీని, కార్మిక కర్షక పార్టీని అభివృద్ధి చేయడంలో ముఖ్యభూమిక పోషించారు. కమ్యూనిస్టు ఉద్యమం అభివృద్ధి

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

చెందుతున్న చైనాకు 1927లో కొమిన్‌టర్న్ ప్రతినిధివర్గంలో సభ్యునిగా ఎం ఎన్‌రాయ్‌ని పంపించారు. షాంఘై, కాంటన్‌లలో కమ్యూనిస్టులను ఊచకోత కోస్తున్న కొమింటాంగ్‌తో ఐక్యసంఘటనను ఏర్పాటు చేయటం కొమింటర్న్‌లో తీవ్రమైన చర్చకు దారితీసింది.

1927లో రాయ్ మాస్కో తిరిగి వచ్చారు. కానీ కొమిన్‌టర్న్ అభిమానాన్ని కోల్పోయారు. 1929 లో బెర్లిన్ వెళ్లిపోయారు. అక్కడ జర్మన్ ప్రతిపక్ష కమ్యూనిస్టులతో పనిచేయడం ప్రారంభించారు. 1929 డిసెంబర్‌లో కొమిన్‌టర్న్ నుండి బహిష్కరించారు.

1930లో భారతదేశం చేరుకున్నారు. 'రాయిస్ట్స్ ' అనే ఒక విధేయుల గ్రూపును ఏర్పాటు చేసుకుని కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేయడం ప్రారంభించారు. పెండింగ్‌లో ఉన్న పాతకేసులలో బ్రిటిష్ అధికారులు రాయ్‌ని అరెస్టు చేశారు. విచారణ అనంతరం 12 యేళ్ల జైలు శిక్ష పడింది కానీ అప్పీలు చేసుకున్న తరువాత ఆరేళ్లకి తగ్గించబడింది. 1936లో జైలు నుంచి బయటికి వచ్చాడు. సంఘాలలో, రాజకీయ పార్టీలలో పనిచేస్తున్న 'రాయిస్టులు' పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేకులుగా ఉండేవారు. సిపిఐని వ్యతిరేకించిన రాయ్ ఎన్నడూ సోవియెట్ యూనియన్‌ను విమర్శించలేదు. ఫాసిజాన్ని ఓడించడానికి స్టాలిన్ చేసిన ప్రయత్నాలకు మద్దతు పలికాడు కూడా. 1943 లో రాయ్ మార్క్సిజాన్ని వదిలిపెట్టి రాడికల్ హ్యూమనిజం (తీవ్ర మానవత్వవాదం) అనే కొత్త సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు.

రాయ్ మార్క్సిజాన్ని వదిలేసినప్పటికీ, భారతదేశంలో1921 నుండి 1926 మధ్య కాలంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని అభివృద్ధి చేయడానికి అయన చేసిన కృషిని ఎన్నడూ మరచిపోలేము.

### కాన్పూర్‌లో కమ్యూనిస్టుల సమావేశం

1925 డిసెంబర్ 26 నుండి 28 వరకు కాన్పూర్‌లో కమ్యూనిస్టుల మహాసభ జరిగింది. ఇదే భారతదేశ భూభాగంలో జరిగిన మొట్టమొదటి కమ్యూనిస్టు మహాసభ. దీనిని భారతదేశంలోని దాదాపు అన్ని కమ్యూనిస్టు గ్రూపులు హాజరయ్యాయి. కాంగ్రెస్ సమావేశాల సందర్భంగా 1925 జూన్ 18 వ తేదీతో ప్రచురించిన కరపత్రంలో దేశంలోని వివిధ కమ్యూనిస్టు గ్రూపుల సమావేశం కాన్పూర్‌లో జరపాలని మొదటగా సత్యభక్త ప్రకటించాడు. అప్పటికి ఆయన ఏ కమ్యూనిస్టు గ్రూపులోనూ సభ్యుడు కాదు. ఆ మహాసభకు ఏర్పాటు చేసిన ఆహ్వాన సంఘానికి మౌలానా హస్రత్ మోహాని అధ్యక్షుడుగా ఉన్నారు. బ్రిటిష్ పార్లమెంటులో కమ్యూనిస్టు సభ్యునిగా ఉన్న షాపుర్జీ సక్లత్‌వాలాను ఈ మహాసభకు అధ్యక్షత వహించవలసిందిగా కోరారు. ఆయన హాజరు కాలేకపోయిన కారణంగా సింగారవేలు చెట్టియార్ సభకు అధ్యక్షత వహించారు.

ఇటువంటి ప్రధాన వేదిక సత్యభక్త ఆధీనంలోకి పోవడాన్ని ఇష్టపడని గుర్తింపు పొందిన కమ్యూనిస్టు గ్రూపులు మహాసభకు హాజరు కావాలని నిర్ణయించుకున్నారు. ఫలితంగా బొంబాయి నుంచి ఆర్‌ఎస్ నింబకర్, జె పి భగేర్‌హత్తా, కే ఎన్ జోగ్లేకర్, ఎస్‌వి ఘాటే, ఝాన్సీ నుంచి అయోధ్యప్రసాద్, పంజాబ్ నుండి సంతోఖ్ సింగ్, లాహోర్ నుంచి ఎస్‌డి హస్సన్, రామచంద్ర, మద్రాస్ నుండి కామేశ్వరరావు, కఅష్ణస్వామి అయ్యంగార్, సింగారవేలు చెట్టియార్ హాజరయ్యారు. రాధామోహన్ గోకుల్‌జీ కలకత్తా ప్రతినిధిగా పాల్గొన్నారు. కాన్పూర్ కుట్రకేసు నుండి ఆరోగ్య కారణాల రీత్యా విడుదలైన ముజఫర్ అహ్మద్ కూడా మహాసభకు హాజరయ్యారు. అయితే ఆయన స్వస్థత కోసం ఉన్న అల్మోరా నుండి కాన్పూర్ చేరుకున్నారు. అజ్మీర్‌కి చెందిన అర్జున్‌లాల్ సేథీ కూడా మహాసభలో భాగస్వాములయ్యారు. కాంగ్రెస్ మహాసభలో పాల్గనటానికి వచ్చి, కాన్పూరులో ఉన్న తీవ్రవాద కార్మికసంఘ నాయకులు అనేకమంది ఈ మహాసభ జరుగుతున్న తీరును చూసేందుకు వచ్చారు. ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం ఈ సభకు 500 మంది హాజరుకాగా అందులో అత్యధికులు కార్మికులు కర్షకులు ఉన్నారు.

మొదటి సెషన్లో సక్లత్‌వాలా పంపిన సందేశాన్ని చదివారు. ఆ తర్వాత ఆహ్వాన సంఘం అధ్యక్షుడు హస్రత్ మోహాని ఉపన్యసించారు. ఆ తరువాత సింగారవేలు చెట్టియార్ అధ్యక్షోపన్యాసం చేశారు. డిసెంబర్ 26 సాయంత్రం చర్చలు జరిపి తీర్మానాలు ఆమోదించడానికి కేటాయించబడింది. 27న నిబంధనావళిని ఆమోదించి, కేంద్ర ఎగ్జిక్యూటివ్ కమిటీకి ఎన్నికలు జరిగాయి. 1925 డిసెంబరు 28న, కేంద్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశమై ఆఫీస్ బేరర్లు, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శులను, వివిధ ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహించే సిఇసి సభ్యులను ఎన్నుకున్నారు.

మోహాని సభకు హాజరైన వారికి ఆహ్వానం పలుకుతూ ఆమోదయోగ్యమైన అన్ని పద్ధతుల ద్వారా సంపూర్ణ స్వరాజ్యం సాధించడమే ఈ మహాసభ మొదటి లక్ష్యమని, ఆ తరువాత లక్ష్యం 'సోవియెట్ తరహా రిపబ్లిక్' ను నిర్మించుకోవడమని చెప్పారు.

సింగారవేలు చెట్టియార్ ఓ సుదీర్ఘ ఉపన్యాసం చేసారు. అందులో ఆయన బ్రిటిష్ పాలనను వ్యతిరేకిస్తూ ప్రాణాలు కోల్పోయిన వారందరికీ, తిలక్, దేశబంధులకే కాక, రోజా లగ్జెంబర్గ్, కార్ల్ లీబ్‌నెక్‌లకు, ముఖ్యంగా లెనిన్


**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

మఱతికి కూడా సంతాపం ప్రకటించారు. భారతదేశంలో కార్మికులు, కర్షకులు ఎదుర్కొంటున్న ఈతిబాధలు, వారి పరిస్థితులను మెరుగుచేయటానికి కృషిచేయటం, సంపూర్ణ స్వరాజ్యాన్ని సాధించవలసిన అవసరాన్ని ప్రస్తావించారు.

సింగారవేలు చెట్టియార్ కుల మత సమస్యలను ప్రస్తావించడం, వాటిని వదిలించుకోకపోతే భవిష్యత్తులో అనేక కష్టాలు ఎదురవుతాయని అనడం కూడా ఆసక్తిదాయకంగా ఉంది. “వినాశకరమైన కుల మతాలు మన రాజకీయ ఐక్యతను యుగయుగాలుగా విచ్ఛిన్నం చేస్తున్నాయి. ఈ రోజుకూడా దేశం కుల, మత విభేధాల ప్రాతిపదికనే చిందర వందరగా ఉంది. ప్రజలను వీటి ప్రాతిపదికన విభజిస్తున్న నాయకులు దేశానికీ, మన లక్ష్యానికి కూడా ద్రోహం చేస్తున్నవారు.”

అంటరానితనం గురించి సింగార వేలు చెట్టియార్ ఇలా అన్నారు, “అంటరానితనమనేది ముఖ్యంగా వ్యవసాయ సమస్య. ఆర్థిక పరాధీనత నుండి బయట పడకుండా అంటరానితనాన్ని రూపుమాపుత ామంటే అది కేవలం వట్టిమాటే. మార్పును ఇష్టపడని పెద్ద మనిషి (మహాత్మా గాంధీ గారి అంటరానితనం నిర్మూలనను ఉద్దేశించి) పెద్ద పెద్ద మాటలు చెప్పడం అన్యాయం. తోటి మానవులను అంటరానివారుగా చూడడం అమానుషం. వారి ఆకలి కేకలను గురించిగాని, పొయ్యిలే వెలగని ఇళ్ల గురించిగాని ప్రస్థావించకుండా వారు జాగ్రత్తపడుతున్నారు. కేవలం అంటరానితనాన్ని మాత్రమే నిర్మూలిస్తాననడం ఖచ్చితంగా కపటత్వం. అందువలన కమ్యూనిస్టులుగా మనం అణగారిన తరగతులు వారి జీవితాలను మెరుగుగా గడిపే అవకాశాన్ని కల్పించడానికి అవసరమైన కనీసవేతనం లాంటి ఆర్థిక డిమాండ్ల కోసం వత్తిడి చేయాలి. ”

ఇన్ని అభివఅద్ధి కాముక అంశాలు ఉన్నప్పటికీ, ఆ నాటి నాయకుల ఉపన్యాసాలలో కొన్ని పరిమితులను కూడా గమనించవచ్చు. వారు సోషలిజం, సోవియెట్ యూనియన్ అన్న ఆలోచనలతో ఉత్తేజితులయ్యారు. కానీ కమ్యూనిస్టు సిద్ధాంతంలోని మౌలికాంశాలు అవగాహన చేసుకోలేదు. సామాజిక మార్పును సాధించడానికి వర్గ పోరాటం మౌలికాంశమన్న విషయం గుర్తించలేకపోయారు. ‘సరుకుల పంపకంలో తీవ్రమైన అసమానతలు సరి చేయడానికి కమ్యూనిజం ఒక మార్గంగా సింగారవేలు భావించారు. అందువలన అందరూ ప్రయోజనం పొందుతారని అనుకున్నారు. “ఈ నాటి ప్రపంచంలోని రాజకీయ, సామాజిక విధానాలలో స్పష్టంగా కనిపిస్తూ, రాజ్యమేలుతున్న అసమానతలు, దుష్టత్వం నివారించడానికి’’ ఆయనకి కమ్యూనిజం ఒక మార్గం. వారి చర్చలలో, పార్టీ పేరు నిర్ధారణలో, దాని లక్ష్యం, గమ్యాన్ని నిర్దేశించుకోడంలో, ఆ లక్ష్యాలను చేరేందుకు ఎంచుకునే పోరాటాలు మార్గాలలో, అంతర్జాతీయత విషయంలోనూ ఈ పరిమితులు వెల్లడైనాయి.

మహాసభ ప్రపంచవ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టులతో సంఘీభావం తెలుపుతూ, బ్రిటన్‌లోని కమ్యూనిస్టు పార్టి సభ్యులను నిర్బంధించడాన్ని నిరసిస్తూ, పెషావర్, కాన్పూర్ కుట్రకేసులలో శిక్షించబడిన వారికి సంఘీభావాన్ని తెలుపుతూ, సింగారవేలు స్థాపించిన కార్మిక కర్షక పార్టీని రద్దు చేస్తూ తీర్మానాలు ఆమోదించింది. కొత్తగా ప్రారంభించబడిన కార్మిక కర్షక గజెట్ కమ్యూనిస్టు పార్టీ అఫ్ ఇండియా పత్రికగా మారుతుందని, బొంబాయిలో పార్టీ కేంద్ర ఆఫీసు ఉంటుందని కూడా నిర్ణయించారు.

సత్యభక్త ప్రతిపాదించిన పార్టీ పేరుగాని, కార్యక్రమాలుగాని చర్చల సందర్భంగా ఆమోదించబడలేదు. పార్టీ పేరు భారతీయ కమ్యూనిస్టు పార్టీగా ఉండాలని, కొమింటర్న్‌తో ఎటువంటి సంబంధం ఉండకూడదని సత్యభక్త ప్రతిపాదించారు. ఆయనకి అంతర్జాతీయత మీద నమ్మకం లేదు. కానీ ఏ కమ్యూనిస్టు పార్టీకైనా మౌలికమైనది అంతర్జాతీయత. సభలోని ప్రతినిధులలో అత్యధికులు ఈ ప్రతిపాదనలను తిరస్కరించారు.

కమ్యూనిస్టు పార్టీ అఫ్ ఇండియా అనే పేరును మహాసభలో నిర్ణయించారు. పార్టీలో చేరేవారి కోసం ఒక డిక్లరేషన్‌ను ఆమోదించారు. పార్టీలో చేరదలుచుకున్న వారందరు ఆ డిక్లరేషన్‌పై సంతకాలు చేశారు. ఆ డిక్లరేషన్‌లో ఇలా ఉంది.” ఈ కింద సంతకం చేసిన నేను, వయసు... భారతదేశంలో సర్వ సత్తాక కార్మిక, కర్షక రాజ్యం ఏర్పాటుచేయడానికి ఉద్దేశించబడిన భారత కమ్యూనిస్టు పార్టి విధానాలను అంగీకరిస్తున్నాను. కమ్యూనిస్టు పార్టి మొదటి మహాసభ తీర్మానాలను క్షుణ్ణంగా చదివాను. ప్రజా సేవారంగాలైన భూమి, గనులు, పరిశ్రమలు, ఇళ్ళు, టెలిగ్రాఫ్ సేవలు, టెలిఫోన్లు, రైల్వేస్ లాంటివి జాతీయం చేసి, ఉమ్మడి యజమాన్యంలోకి తీసుకురావడానికి, కార్మిక కర్షకులకు జీవించడానికి సరిపోయే కనీస వేతనాలు పొందేందుకు కృషి చేయటమనే కమ్యూనిస్టు పార్టీ తక్షణ కర్తవ్యాలతో పూర్తిగా ఏకీభవిస్తున్నాను”.

మహాసభ 30 మంది సభ్యులుగల ఎగ్జిక్యూటివ్ కమిటీని ఎన్నుకోవాల్సి ఉంది. కానీ 16 మంది మాత్రమే ఎన్నుకోబడ్డారు. మిగిలిన 14 స్థానాలను ప్రాంతాలవారి ప్రాతినిధ్యం కల్పిస్తూ తరువాత ఎన్నుకోవటం కోసం ఖాళీగా ఉంచారు. డిసెంబర్ 28న కేంద్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. సింగారవేలు పార్టీ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా ఆజాద్ శోభని, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.వి ఘాటే, జానకి ప్రసాద్ బాగెర్‌హట్టా ఎన్నికయ్యారు. కామ్రేడ్ కఅష్ణస్వామి అయ్యంగార్, సత్యభక్త, ఎస్ డి హస్సన్, ముజఫర్ అహ్మద్ మద్రాస్, కాన్పూరు, లాహోర్, కలకత్తా ప్రాంతాలకు కార్యదర్శులుగా ఎన్నికయ్యారు.

పార్టీ ఏర్పడిన పరిస్థితులను గురించి ప్రస్తావిస్తూ కాన్పూరు మహాసభలో ఎన్నికైన కేంద్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ బొంబాయిలో 1927 మేలో జరిగిన సమావేశంలో ఆమోదించిన తీర్మానంలో ఈ విధంగా పేర్కొంది. “కమ్యూనిస్టులపై నేరారోపణలు చేసి, శిక్షలు విధించిన ప్రాంతం కాన్పూర్. ఒక కార్యక్రమంతో కూడిన పార్టీని ఏర్పాటు చేయాలనే కోరిక ఇతర ప్రాంతాల ప్రజల కన్నా అక్కడ ప్రజలలో ఎక్కువగా ఉంది. సత్యభక్త ఈ అవకాశాన్ని వినియోగించుకుని పేరులోనూ, పనిలోనూ భారతీయ కమ్యూనిస్టు పార్టీని తలపించే పార్టీని ఏర్పాటు చేశాడు. ఈ పార్టీ అనేక మందిని ఆకర్షించటంతో ఎక్కువ మంది సభ్యులుగా చేరారు. కానీ ఈ పార్టీలో మార్క్సిజానికి సంబంధించిన అంశాలేవీ లేకపోగా కమ్యూనిజం అంటే అంతగా తెలియని భారతదేశంలో, కమ్యూనిస్టు తాత్వికతకి మచ్చతెచ్చే అనేక పనులు చేశారు. వాటిని ఇక్కడ ప్రస్తావించాల్సిన అవసరం లేదు. ఈ పార్టీని మన నిర్వహణలోకి తెచ్చుకోగలిగినా కేవలం తాత్కాలిక రూపంలోనే ఉంది. దీనికి నిర్దిష్టమైన నిబంధనావళి, కార్యక్రమం రూపొందించ బడలేదు”.

భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడడానికి తాష్కెంట్‌లో తొలి అడుగు పడితే, అఖిల భారత కమ్యూనిస్టు పార్టీని ఏర్పరచడానికి భారత భూభాగంలో జరిగిన తొలి ప్రయత్నం కాన్పూర్‌లో జరిగిన కమ్యూనిస్టు మహాసభ.

❋

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-12-2019 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20

# భారీ పెట్టుబడి చిన్న ఉత్పత్తిదారులకు ఉరి



– ప్రభాత్ పట్నాయక్

పెట్టుబడిదారీ విధాన సమర్ధకులు వాదిస్తున్నట్లుగా చిన్న తరహా ఉత్పత్తి అసమర్ధమైనదనటానికి ఎటువంటి ఆధారాలు లేవు. ముఖ్యంగా వ్యవసాయరంగంలో శ్రమ ఉత్పాదకత తక్కువగా ఉంటున్నదన్న కారణం మినహా చిన్న తరహా ఉత్పత్తి గిట్టుబాటు కాదని అనటం సరికాదు. సాగునీటి సదుపాయం కల్పించటం, మంచి విత్తనాలు, ఇతర ఉపకరణాలను సక్రమంగా అందించటంపై ఉత్పాదకత ఆధారపడి ఉంటుంది. ఇటువంటివి భారీస్థాయిలో జరిగే పెట్టుబడిదారీ వ్యవసాయంలోనే కాక, రైతాంగం సాగించే చిన్న తరహా ఉత్పత్తి విధానంలోనూ వినియోగించవచ్చు. చిన్న ఉత్పత్తిదారులు విస్తారంగా కేంద్రీకరించబడి ఉన్న వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచటం అంటే ఉపాధికల్పన తగ్గిపోతుంది. అందువలన వ్యవసాయరంగంలో భారీస్థాయిలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని ప్రవేశపెట్టటం వలన ప్రజలను ఆ రంగం నుండి బయటికి పంపటం జరుగుతుంది. ఆ రంగంలో ఉపాధి పొందుతున్న కోట్లాదిమంది నిరుద్యోగులవుతారు. అయితే వ్యవసాయం, చిన్న ఉత్పత్తిరంగాల నుండి తొలగించబడిన వారిని పెట్టుబడిదారీ విధానం తనలో ఇముడ్చుకొని ఉపాధి కల్పిస్తుందని విశ్వసిస్తున్నారు. పెట్టుబడిదారీ విధానాభివృద్ధి క్రమంలో అదే జరిగిందని నమ్మబలుకుతున్నారు. కానీ చారిత్రక వాస్తవాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. చారిత్రక అభివృద్ధి క్రమాన్ని పరిశీలించినట్లైతే మొదటగా యూరప్‌లో అభివృద్ధి అయిన పెట్టుబడిదారీ విధానం ఉపాధి కోల్పోయిన చిన్న ఉత్పత్తిదారులను ఇముడ్చుకోలేదు. ఫలితంగా పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి ఫలితంగా ఉపాధి కోల్పోయిన 5 కోట్లమంది ఇతర ప్రాంతాలకు వలసలు పోయారు. యూరప్‌లోని ప్రజల వలె వలసలు వెళ్ళటానికి అవకాశం లేని పరిస్థితులలో మూడో ప్రపంచదేశాలలో అభివృద్ధి సాధించటం కోసమంటూ ఇటువంటి విధానాలను అనుసరించటం సరికాదు.

ఇక యూరప్‌లో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి వలన వలస, అర్ధ వలస దేశాలైన చైనా, భారత్ వంటి దేశాలలో ఉపాధి కోల్పోయిన వారిని ఏ రంగంలోనూ ఇముడ్చుకోవటం జరగలేదు. కాబట్టి ఉపాధి కోల్పోయిన చిన్న ఉత్పత్తిదారులను పెట్టుబడిదారీ విధానం ఇముడ్చుకొంటుందనేది సరికాదు. సైద్ధాంతికంగా చూసినపుడు పెట్టుబడిదారీ విధానంలో నిరంతరం సాంకేతికాభివృద్ధి, దానితో పాటు శ్రమ ఉత్పాదకత పెరుగుతుంటుంది. కాబట్టి ఉపాధి కల్పన అతి తక్కువగా, జనాభా పెరుగుదల రేటుకన్నా తక్కువగా ఉంటుంది. ఫలితంగా పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమం పెట్టుబడిదారీ ఉత్పత్తిరంగంలో పనిచేస్తున్న మరింత మందిని నిరుద్యోగులుగా మారుస్తుంది. కాబట్టి చారిత్రకంగా చూసినపుడు పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం పనులలో ఉన్నవారిని తొలగిస్తుంది మినహా ఉపాధి కోల్పోయిన చిన్న ఉత్పత్తిదారులకు పనులు కల్పించదు. ఫలితంగా దేశంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతున్నపుడు కూడా దరిద్రం, నిరుద్యోగం పెరుగుతాయి.

దేశంలోకి భారీస్థాయిలో అమ్మకాలు నిర్వహించే వాల్‌మార్ట్ లాంటి షాపింగ్‌మాల్స్ వస్తే చిన్న దుకాణాదారులు, చేతివృత్తిదారులు ఉపాధి కోల్పోతారు. వారిని ఏ రంగంలోనూ ఇముడ్చుకోలేం. వారు అమ్మే సరుకులను కూడా ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి సేకరిస్తారు కాబట్టి వ్యవసాయరంగం కూడా నష్టపోతుంది. వ్యవసాయరంగంలోకి బహుళజాతి సంస్థలు ప్రవేశిస్తే నాణ్యమైన వ్యవసాయోపకరణాలను సరఫరా చేసి, ఉత్పత్తిని పెంచుతుందని భావిస్తున్నారు. కాని బహుళజాతి కంపెనీలు ఎవరికీ బాధ్యత వహించవు. భారాలన్నింటినీ రైతులపై మోపుతాయి. వ్యవసాయోత్పత్తుల ధరలు ప్రపంచమార్కెట్‌లో తగ్గినపుడు ఇక్కడా తగ్గుతాయి. ప్రపంచమార్కెట్‌లో ధరలు పెరిగినపుడు ఇక్కడ పెరగవు. అటువంటి పరిస్థితులలో రైతులు అప్పుల పాలవుతారు. కాలక్రమంలో వారి జీవితాలు దుర్భరంగా మారతాయి. బహుళజాతి కంపెనీలు చేస్తాయని చెబుతున్న పనిని ప్రభుత్వం కూడా చేయవచ్చు. ప్రభుత్వం ప్రజల చేత ఎన్నుకోబడుతుంది. ప్రజలకు బాధ్యత వహిస్తుంది. బహుళజాతి సంస్థల స్థానంలో ప్రభుత్వం వస్తే ప్రపంచమార్కెట్‌లోని ధరల ఒడిదుడుకులతో చిన్న ఉత్పత్తిదారులను పీల్చివేయటం జరగదు. కాబట్టి బహుళజాతి సంస్థలను పక్కన పెట్టి, ప్రభుత్వం జోక్యం చేసుకోవటం సరైనదవుతుంది.

**(2017లో ధార్ ఎ సలాం యూనివర్సిటీలో ప్రభాత్ పట్నాయక్ చేసిన ప్రసంగంలోని భాగాలు)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977, 9494101091.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.14, No.8. Published on December 1, 2019